




RNI No: TELTEL/2021/81803

# మెట్రో సిటీటైమ్స్

METRO CITY TIMES Telugu daily

తెలుగు దినపత్రిక

సంపుటి: 5 | సంచిక : 245 | రంగారెడ్డి | శనివారం, జూన్ 6, 2026 | పేజీలు : 8 | వెల : 2/-







## ఏది ఎక్కడ ఉందో చూస్తోనికి

# రెండేళ్లు పట్టింది



పాలమూరు: మహబూబ్ నగర్ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి  రెండో రోజు పర్యటిస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులను రేవంత్ రెడ్డి పరిశీలించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ... సాగునీరు, తాగునీటి ప్రాజెక్టులకు సబంధించిన క్షేత్రస్థాయి పర్యటన చేశానని పేర్కొన్నారు. ప్రాజెక్టుల పనులు పరిశీలించి భవిష్యత్ కార్యాచరణ తయారీకి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కష్టకాలంలో పాలమూరు నుంచి కేసీఆర్ ను ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధి చేస్తారని ఆశించామని పేర్కొన్నారు.

కృష్ణా జలాలు పూర్తిగా జిల్లాల్లో ప్రవహించినా ఎన్నడూ ఒడిసి పట్టుకోలేదన్నారు. కేసీఆర్ సీఎం అయ్యాక పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేస్తారని ఆశించామన్నారు. ప్రాజెక్టుల గురించి ప్రశ్నిస్తే అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టే యత్నం చేశారని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి పూర్తియితే 26 లక్షల ఎకరాలకు ఆయకట్టు వచ్చేదన్నారు. పాలమూరు-రంగారెడ్డికి రూ. 27 వేల కోట్లు ఖర్చుపెట్టి పంపులు, లిఫ్ట్ పనులు చేశారని చెప్పారు. పంపులు, లిఫ్ట్ పనులు చేపడితే కేసీఆర్ ఇంట్లో కనక వర్షం కురిసిందన్నారు. కమీషన్ల పేరిట రూ. వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేదని సీఎం ఆరోపించారు. మహబూబ్ నగర్ జిల్లాల్లో అన్ని ప్రాజెక్టులు పెండింగ్ లో ఉన్నాయని సూచించారు.

ఏది ఎక్కడ ఉందో చూస్తోనికి రెండేళ్లు పట్టింది: సీఎం రేవంత్

ఏది ఎక్కడ ఉందో సరిచూసుకునేందుకే రెండేళ్లు పట్టిందని ముఖ్యమంత్రి తెలిపారు. తాము పనులు చేపడుతుంటే వాళ్లు రాజకీయ కార్యాచరణ చేపడుతున్నారని మండిపడ్డారు. మీరు పాపాలు చేయడమే కాదు.. కేసీఆర్ చేస్తుంటే చూడడం కూడా మహాపాపం అన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు చేసిన అప్పులకు రూ. 84 వేల కోట్లు చెల్లించారు. గత పాలనలో సాగునీటి ప్రాజెక్టులకు చేసిన అప్పులకు రూ. 52 వేల కోట్లు చెల్లించామన్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టులకు తాము వచ్చాక రూ. 22 వేల కోట్లు ఖర్చుచేశామని సీఎం వివరించారు. రూ. 22 వేల కోట్లలో రూ. 8 వేల కోట్లు పాలమూరు జిల్లా ప్రాజెక్టులకు ఇచ్చామన్నారు. జిల్లా నలుమూలలా తిరిగిన నేను ప్రాజెక్టులను కొలిక్కి తెచ్చే ప్రయత్నం చేస్తున్నానని వివరించారు. జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి కావాలంటే 4 వేల ఎకరాలు భూసేకరణ చేయాలని తెలిపారు.

భూసేకరణ, ఆర్అండ్ ఆర్ చేయకుండా రిజర్వాయర్లతో నీళ్లు నింపగలమా? అని ప్రశ్నించారు. రెండేళ్లలో పనులు పూర్తి చేయాలని కంకణం కట్టుకుని ముందుకెళ్తున్నామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో విపరీతంగా అప్పులు తేవడం వల్ల ప్రాజెక్టులకు అప్పులు తెచ్చుకోలేని పరిస్థితి ఉందన్నారు. పాలమూరు ప్రాజెక్టుకు రూ. 55 వేల కోట్ల అంచనా వేసి రూ. 27 వేల కోట్లు ఖర్చు చేశారని సీఎం వివరించారు. 50 శాతం నిధులు ఖర్చుపెట్టకుండా 90 శాతం పనులెలా పూర్తవుతాయి? అన్నారు. ఉన్నదంతా దోచుకుని మమ్మల్ని దోషులుగా నిలబెడతామనే భ్రమలో ఉన్నారని సూచించారు. పాలమూరు జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

ప్రాజెక్టులకు నిధుల కోసం పక్కా కార్యాచరణతో క్షేత్రస్థాయి పర్యటన చేస్తానని చెప్పారు. భూసేకరణకు సంబంధించి రూపాయి ఎక్కువైనా ఇచ్చి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. జిల్లా ప్రాజెక్టుల పూర్తికి సంపూర్ణంగా కట్టుబడి ఉన్నానని సీఎం హామీ ఇచ్చారు. తక్కువ భూసేకరణ ఉండి.. ఎక్కువ నీళ్లు నిల్వ చేసుకునే ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేస్తామన్నారు. కర్ణాటకతో సమన్వయం చేసుకుని ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెరి సగం ఖర్చు చేసిని మనం 70 శాతం నీళ్లు వాడుకునే అవకాశముందన్నారు. బ్రిడ్జ్ కమ్ బ్యారేజీల కోసం అధ్యయనం చేస్తున్నామన్నారు. ఆగిపోయిన రిజర్వాయర్ల పనుల పూర్తికి కార్యాచరణ చేపట్టామని సీఎం పేర్కొన్నారు. పనులకు అడ్డుపడకుండా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ నేతలను కోరారు.



## కోట్ల విలువైన ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు

# ఆ స్థలాలల్లో మహిళలకు వాటా కల్పిస్తాం

### -మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



హైదరాబాద్: పేదల జీవనోపాధికి ఏ మాత్రం ఇబ్బంది లేకుండా నియోజక వర్గాన్ని యూనిట్ గా తీసుకొని క్యూర్ పరిధిలో పేదలు నివాసముంటున్న ప్రాంతాలకు సమీపంలోనే అల్పదాయ , మధ్యతరగతి వర్గాలు కు లక్ష ఇండ్లు నిర్మించ బోతున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార ఒ పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. కోట్ల రూపాయల విలువచేసే ప్రభుత్వ స్థలాలల్లో లక్ష ఇండ్లను నిర్మించి ఆ స్థలములో వారి వాటాకు యజమానిని చేస్తూ పెడింటి ఆడబిడ్డలకు ఇవ్వబోతున్నా మని ప్రకటించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై శుక్రవారం నాడు సచివాలయంలోని తన కార్యాల యంలో అధికారులతో సమీక్షించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి క్యూర్ పరిధిలో లక్ష ఇండ్లకు ఇతర ప్రాంతాలల్లో 2.50 లక్షలు మొత్తం 3.50 లక్షల ఇండ్లకు ఇప్పటికే ప్రరిపాలన పరమైన అనుమతులు ఇవ్వడం జరిగిందని, దీనిని దృష్టిలోపెట్టుకొని అవసరమైన కార్యాచరణను రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

గత ప్రభుత్వం పేదల జీవన పరిస్థితులను, వారి ఉపాధి అవసరాలను ఏ మాత్రం పట్టించుకోకుండా హైదరాబాద్ నగరానికి 30-40 కిలోమీటర్ల దూరంలో అరకొరగా డబుల్ బెడ్రూమ్ ఇళ్లను నిర్మించిందని విమర్శించారు. ఇల్లు అనేది పేద కుటుంబానికి ఎంత అవసరమో, వారి జీవనోపాధి కూడా అంతే ముఖ్యమనే విషయాన్ని గత పాలకులు విస్మరించారని అన్నారు. రోజువారీ కూలి పనులు, చిన్న వ్యాపారాలు, ఉపాధి అవకాశాలపై ఆధారపడే పేద కుటుంబాలు నగర శివార్లలో నిర్మించిన ఇళ్లకు వెళ్లలేకపో యాయని, ఉపాధి దూరమవడంతో పాటు పిల్లల విద్య, వైద్య సదుపాయాలు, రవాణా వంటి సమస్యలు ఎదురవడంతో అనేక కుటుంబాలు ఆ ఇళ్లలో నివసించడానికి ఆసక్తి చూపలేదన్నారు. ఫలితంగా ఆ గృహాలు ఖాళీగా, నిరుపయోగంగా మిగిలిపోయాయని పేర్కొన్నారు.

ఇలాంటి తప్పిదాలను పునరావృతం చేయకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాల్లోనే గౌరవప్రదమైన జీవితం గడిపేలా ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టబోతున్నామని, ఈ దిశగా విలువైన ప్రభుత్వ భూములను పేదల సంక్షేమం కోసం వినియోగిస్తూ లక్ష ఇళ్ల నిర్మాణ కార్యక్రమానికి శ్రీకారం చుడుతోన్నామని మంత్రి గారు వెల్లడించారు.

ముఖ్యంగా పేద కుటుంబాల మహిళలకు సొంతింటిపై హక్కు కల్పించడం ద్వారా వారి ఆర్థిక, సామాజిక భద్రతను మరింత బలోపేతం చేయనున్నట్లు మంత్రి తెలిపారు. సొంత ఇల్లు మహిళ సాధికారతకు, కుటుంబ స్థిరత్వానికి, భవిష్యత్ తరాల అభివృద్ధికి బలమైన పునాది అవుతుందన్నారు.

పేదల అవసరాలను దృష్టిలో పెట్టుకొని వారికి సౌకర్యవంతంగా ఉండేలా ఇండ్ల డిజైన్ లను రూపొందించాలని, ఇంటి నిర్మాణం కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణం ఉండేలా ప్లాన్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ సెక్రెటరీ వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం దిష్టిబొమ్మ దహనం.!

## నాగర్ కర్నూల్ జిల్లాలో బిఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టులు.

## అక్రమ అరెస్టులపై నిరసన తెలిపిన బిఆర్ఎస్ నేతలు.

నాగర్ కర్నూల్ : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా తిమ్మాజిపేటలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి "సీఎం డౌన్ డౌన్'' అంటూ నినాదాలు చేశారు. ముందస్తుగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి నిరసనలకు అవకాశం లేకుండా ముందస్తు అరెస్టులు గృహనిర్బంధం చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఈ నిరసనపై బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. నిరసనలో పాల్గొన్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.



మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి స్వగృహంలో కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ పాలమూరు ప్రాంత అభివృద్ధి, పెండింగ్ ప్రాజెక్టులపై ప్రభుత్వం స్పష్టమైన నిధుల ప్రకటన చేసిన తర్వాతే సీఎం పర్యటన జరగాలని డిమాండ్ చేశారు. రైతు సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, "రైతుబంధు" పథకం అమలులో సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులు నెమ్మదిగా సాగుతున్నాయని, ప్రాజెక్టుల పూర్తి విషయంలో జాప్యం జరుగుతోందని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. అభివృద్ధి పేరుతో ప్రభుత్వం రాజకీయ ప్రదర్శనలు మాత్రమే చేస్తోందని విమర్శించారు. మాజీ సీఎం కెసిఆర్ పాలమూరు ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని, ప్రాజెక్టులను వేగవంతం చేయాలని గతంలోనే ప్రణాళికలు రూపొందించారని గుర్తు చేశారు.

# కర్ణాటక మంత్రి పదవికి రామలింగారెడ్డి రాజీనామా

**కర్ణాటక కాంగ్రెస్‌లో లుకలుకలు**

**మంత్రిగా ప్రమాణం చేసిన 36 గంటల్లోనే రామలింగారెడ్డి రాజీనామా**

**రాహుల్ గాంధీ ముందు రామలింగారెడ్డి పంచాయతీ**

**బెంగళూరు అభివృద్ధి శాఖ ఇవ్వలేదని రామలింగారెడ్డి అలక**

బెంగళూరు: కర్ణాటక రాజకీయాల్లో లుకలుకలు బయటపడ్డాయి. శాఖల కేటాయింపు పట్ల అసంతృప్తితో ఉన్న కర్ణాటక మంత్రి రామలింగారెడ్డి తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. బెంగళూరు అభివృద్ధి శాఖను తనకు కేటాయిస్తామని హామీ ఇచ్చారని రామలింగారెడ్డి పేర్కొన్నారు. గురువారం రాత్రి ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తన 13 మంది మంత్రులకు శాఖలను కేటాయించారు. బెంగళూరు అభివృద్ధి శాఖను దక్కించుకోవడంలో రామలింగారెడ్డి పట్టుబట్టారని, అయితే ఆ శాఖ ఆయనకు దక్కలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. శాఖల కేటాయింపుపై గురువారం జరిగిన సమావేశం నుంచి మంత్రి రామలింగారెడ్డి బయటకు వచ్చారని సమాచారం. ఆ సమావేశంలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరిగినప్పుడు తనకు 'బెంగళూరు అభివృద్ధి' శాఖను కేటాయిస్తామని 2023లో ఇచ్చిన హామీని మంత్రి ముఖ్యమంత్రికి గుర్తుచేశారు.

రామలింగారెడ్డి అలక

రామలింగారెడ్డి మంత్రిగా ప్రమాణం చేసిన 36 గంటల్లోనే రాజీనామా చేయడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయలేదని, 53 ఏళ్లుగా పార్టీలోనే కొనసాగుతున్నానని రామలింగారెడ్డి వివరణ ఇచ్చారు.




వీరప్పమొయిలీ, ఎస్.ఎం కృష్ణ కేబినెట్ లో మంత్రిగా పనిచేశానని తెలిపారు. తనకు కేటాయించిన శాఖలపై అసంతృప్తితో రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. బెంగళూరు అభివృద్ధి శాఖ ఇవ్వలేదని రామలింగారెడ్డి అలిగారని పార్టీ నేతలు చెబుతున్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే శుక్రవారం బెంగళూరుకు వెళ్లనున్నారు. రాహుల్ గాంధీ ఖర్గే రాజ్యసభ నామినేషన్ కార్యక్రమానికి హాజరుకానున్నారు. రామలింగా రెడ్డి అలక పంచాయితీ రాహుల్ ముందుకు రానుంది. కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాల మేరకు సిద్ధరామయ్య తన సీఎం పదవికి రాజీనామా చేసి డీకే శివకుమార్ కు అప్పగించిన విషయం తెలిసిందే.

మెట్రో సిటీటైమ్స్

శనివారం, జూన్ 6, 2026

# నై.. నై.. రుతుపవనాలు

దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటిది. నైరుతి రుతుపవన కాలం.జూన్ 1వ తేదీ వచ్చింది అంటే చాలు, కేరళ తీరాన్ని వర్షాలు పలకరిస్తాయి. తద్వారా దేశవ్యాప్తంగా వ్యవసాయ పనులు ఊపందుకుంటాయని అందరూ ఆశిస్తారు. అయితే 2026 సీజన్‌లో నైరుతి రుతుపవనాల రాక కోసం కొంత జాప్యం చోటు చేసుకుంది. ముందుగా అంచనా వేసినట్టుగా జూన్ 1న ఇవి కేరళను తాకలేకపోయాయి. వాతావరణ పరిస్థితుల అనుకూలించకపోవడంతో ఇవి ప్రస్తుతం ఉన్నచోటే స్తబ్దుగా నిలిచిపోయాయి. సాధారణంగా జూన్ 1వ తేదీ నాటికి కేరళ తీరాన్ని తాకాల్సిన రుతుపవనాలు, ఈ సారి ఆ లక్ష్యాన్ని చేరుకోవడంలో విఫలమయ్యాయి. ప్రస్తుతం ఇవి మార్గమధ్యలో నిలిచిపోయాయని భారత్ వాతావరణ శాఖ, ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ ధ్రువీకరించాయి. రుతుపవనాల ద్రోణి కదలికలు మందగించడమే దీనికి ప్రధాన కారణం. పూర్తిగా వ్యవసాయిక దేశం అయిన భారత్ లో వర్షాలే ఆధారం. ఎంతలా అంటే దేశ జీడీపీని ప్రభావితం చేసేటంతలా. గ్రామీణ ప్రాంతాలు దేశంలో నూటికి డెబ్బై శాతం ఉన్నాయి. దాంతో దేశ జాతీయ స్థూల ఆదాయం వృద్ధి చెందాలీ అంటే గ్రామీణ భారతం పచ్చగా ఉండాలి. అది ఎపుడు సాధ్యపడుతుంది అంటే భారీగా సమాయనుకూలంగా వానలు పడి పంటలు పండినపుడు. దేశంలో ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1న మొదలవుతుంది. కానీ దేశంలో అగ్రికల్చర్ ఇయర్ మాత్రం జూన్ లో స్టార్ట్ అవుతుంది. దానికి కారణం నైరుతు రుతు పవనాల రాక. ఈ రుతు పవనాలు ఎంత తొందరగా వస్తే అంత సంబరంగా ఏరువాక స్టార్ట్ అవుతుంది. దాంతో రైతాంగం సైతం సంబరాలు చేసుకుంటుంది. కానీ ఈసారి పరిస్థితి చూస్తే నైరుతి నై నై అంటోంది: సకాలంలో నైరుతి రుతు పవనాలు దేశంలోకి ప్రవేశించడం అంటే మే నెలాఖరు అన్న మాట. ఈ మేరకు భారత వాతావరణ విభాగం ఐఎండీ అయితే మొదట చెప్పింది మే 26న నైరుతి దేశంలో ఎంట్రీ ఇస్తుందని. కానీ ఆ డేట్ తప్పింది. ఆ తరువాత మే 30, 31 తేదీలు అన్నా కూడా అదీ జరగలేదు. జూన్ 1 లేదా 3 అని చెప్పినా ఇపుడు ఆ డేటూ మారింది. లేటెస్ట్ డేట్ ఏంటి అంటే జూన్ 8 తరువాత అని అంటున్నారు. అయితే అది కూడా అంత కన్ ఫర్మ్ అవునా కాదా అన్నది ఒక పెద్ద డౌట్. మరో వైపు చూస్తే ఈసారి నైరుతి ఆగమనం లేట్ అయినా వానలు కూడా చాలా తక్కువ పడతాయని దానికి కారణం నైరుతి బలహీనంగా ఉందని. ఈ వార్తలు అయితే రైతాంగాన్ని కాదు దేశ ఆర్థిక నిపుణులను కూడా షాక్ కి గురి చేస్తున్నాయి. ఈసారి వానలు తక్కువ పడితే ఆ ప్రతికూల పరిస్థితి ఎలా ఉంటుంది అనే అంతా ఆలోచిస్తున్నారు. ఈసారి తేలిక పాటి వానలే పడతాయంటే వ్యవసాయం సంగతి ఏమిటి అన్నది కూడా మరో చింతగా మారుతోంది. భారత్ లో నైరుతి ఎంట్రీకి గేట్ వే కేరళం రాష్ట్రం. అక్కడ నుంచే మెల్లగా దేశంలోకి ప్రవేశించి మొత్తం దేశమంతా కొద్ది కాలంలోనే సర్దుకుని భారీ వానలు కురుస్తాయి. అలా వర్షాకాలం సీజన్ స్టార్ట్ అయి సెప్టెంబర్ నెలాఖరు వరకూ కొనసాగుతుంది. అయితే ప్రస్తుతం కేరళంలో కొన్ని ప్రంతాలలో వర్షాలు పడుతున్నాయి కానీ నైరుతి ఆరంభ సూచిన అది కాదని ఐఎండీ చెబుతోంది. నైరుతి రాకను గుర్తించాలంటే కొన్ని ప్రమాణాలు ఉన్నాయి. కేరళంలోని ఈ సీజన్ లో ఏకంగా అరవై శాతం పైగా వానలు పడితే నైరుతి ఎంటర్ అయినట్లుగా భావిస్తారు. అలాగే అరేబియా సముద్రం నుంచి పశ్చిమ దిశగా వీచే గాలులు ఆ నిర్దిష్ట వేగాన్ని అందుకోవాల్సి ఉంటుంది. ఆ మీదట ఆయా ప్రాంతమంతా తగినన్ని మేఘాలు విస్తరించి ఉండాలి. ఇవన్నీ నైరుతి రుతు పవనాల ఆగమాన్ని సూచిస్తాయి. ప్రస్తుతం అయితే కేరళం రాష్ట్రంలో కొన్ని చోట్ల వానలు పడుతున్నాయి. మేఘాలు విస్తరించి కూడా ఉన్నాయి. కానీ అసలైన ప్రమాణం అయిన అరేబియా సముద్రం నుంచి గాలులు వీయడం లేదని ఐఎండీ సైంటిస్టూ చెబుతున్నారు . ఈ మూడు ఒకేసారి కలసి ఉంటేనే నైరుతి పవనాల సీజన్ స్టార్ట్ అయినట్లు. అపుడు వర్షాకాలం వచ్చినట్లుగా చెబుతారు. ఇక ఈసారి పూర్తి స్థాయి వానలు కురిసే అవకాశాలు కూడా తక్కువ అని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. దానికి ఎల్ నినో ప్రభావం కారణం అని స్పష్టం చేస్తున్నారు. దాని వల్ల గత ఏడాది కంటే ఈసారి తక్కువ వానలు పడతాయని వాటితోనే సర్దుకోవాల్సి ఉంటుందని అంటున్నారు. నైరుతి రుతు పవనాలు ఆలస్యమైనా లేదా ఎంట్రీ ఇచ్చినా బలహీనం కావడం వెనక ఎల్ నినో ప్రభావం గట్టిగా ఉంటుందని అంటున్నారు. ఈ విధంగా వర్షాభావ పరిస్థితులు కనుక ఉంటే ఇది దేశ ఆర్థిక వ్యవస్థ మీద కూడా పెను ప్రభావం చూపిస్తుందని అంటున్నారు. ఈ జాప్యాన్ని ప్రధాన కారణం ఏంటంటే... అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో ఏర్పడిన పరిస్థితులే. ఈ రెండు కూడా రుతుపవనాల పురోగతికి ఆటంకం కలిగిస్తున్నాయి. పశ్చిమ దిశ నుంచి వీచే గాలులు రుతుపవనాలను కేరళ తీరం వైపు నెట్టడంలో సహాయపడాలి కానీ ప్రస్తుతం గాలి దిశ, వేగం ఇందుకు అనుకూలంగా లేవు. అయితే ఈ ఆలస్యానికి రాబోయే ఎల్‌నినో ప్రభావానికి ఎలాంటి సంబంధం లేదని స్కైమెట్ వాతావరణ, వాతావరణ మార్పుల విభాగంలో వైఎస్ ప్రెసిడెంట్ మహేష్ స్పష్టం చేశారు. రుతుపవనాలు కేవలం భారత్ పరిసరాల్లోని వాతావరణ వ్యవస్థలపైనే ఆధారపడి కేవలం భారత్ పరిసరాల్లోని వాతావరణ వ్యవస్థపైనే ఆధారపడి ఉంటాయని ఆయన వివరించారు. కేరళలోని రుతుపవనాలు ప్రవేశించాయని చెప్పడానికి కొన్ని కచ్చితమైన నియమాలు ఉన్నాయి. అవి పూర్తి అయితేనే అధికారికంగా రుతుపవనాల రాకను ప్రకటిస్తారు. కేరళ, కర్ణాటక, లక్ష్యద్వీప్‌లోని సుమారు 60 శాతం వాతావరణ కేంద్రాల్లో వరుసగా రెండు రోజులపాటు కనీసం 2.5 మి.మి. వర్షపాతం నమోదు కావాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ పరిమితి ఇంకా నెరవేరలేదు. అందుకే అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతానికి రుతుపవనాలు ఆగిపోయినప్పటికీ , ఆశాజనకమైన వార్త కూడా ఉంది. స్కైమెట్ అంచనాల ప్రకారం రాబోయే గురువారం లేదా శుక్రవారం నాటికి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉంది. వచ్చే 3-4 రోజుల్లో అరేబియా సముద్రంలోని మిగిలిన ప్రాంతాలు, బంగళాఖాతంలోని మెజారిటీ ప్రాంతాలు, కేరళ, తమిళనాడులోని కొన్ని ప్రాంతాలకు ఇవి విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయి. పరిస్థితిని సమీక్షిస్తున్న ఐఎండీ త్వరలోనే రుతుపవనాల రాకపై సవరించిన తేదీని ప్రకటించే అవకాశం ఉంది. భారత్‌లో రుతుపవనాలకు కేరళ ప్రవేశ ద్వార లాంటిది. ఇక్కడికి రుతుపవనాలు చేరిన తర్వాతే దేశవ్యాప్తంగా వర్షాలు విస్తరిస్తాయి. వర్షాలపైనే దేశంలోని సుమారు 70 శాతం సాగు భూమి ఆధారపడి ఉంది. రుతుపవనాలు ఆలస్యమైతే విత్తనాలు వేయడం ఆలస్యమవుతుంది. అది ఆహార ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపుతుంది. అయితే కొన్ని రోజుల జాప్యం సర్వసాధారణమేనని, రుతుపవనాలు పుంజుకుంటే ఆ తర్వాత వర్షపాతం సాధారణంగానే ఉండొచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

# రాజ్యసభ టికెట్లపై టీడీపీ నేతల్లో టెన్షన్..

తిరుపతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాజ్యసభ టీడీపీ ఆశావాహుల్లో కొత్త టెన్షన్ పట్టుకుంది. అతి త్వరలో రాజ్యసభ స్థానాలు ఖాళీ కానున్న వేళ సీట్ల భర్తీ ప్రక్రియ వేగవంతమైంది. ఈ క్రమంలో రాజ్యసభ సీటు కోసం టీడీపీ ఆశావాహుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. రాజ్యసభ టికెట్ కోసం టీడీపీ నేతలు గట్టిగానే పోటీపడుతున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు చుట్టూ నేతలంతా ప్రదక్షిణలు చేస్తున్న పరిస్థితి నెలకొంది.తమకు ఎలాగైన రాజ్యసభ సీటుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దాంతో రాష్ట్ర సచివాలయం, పార్టీ హెడ్ క్వార్టర్స్ వద్ద చంద్రబాబును వ్యక్తిగతంగా కలిసేందుకు క్యూ కడుతున్నారు. తాము పార్టీ కోసం ఎంతగా కష్టపడ్డారో ఎన్ని సేవలు చేశారు? రాజకీయ అనుభవాల గురించి వివరించే పనిలో పడ్డారు.అయితే, ఈ క్రమంలో రాజ్యసభ రేసులో రాష్ట్రంలోని పలువురు ప్రముఖ టీడీపీ నేతల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. అందులో కిలారు రాజేష్, సానా సతీష్, కంభంపాటి రామ్మోహన్ రావు, టీడీ జనార్ధన్, గల్లా జయదేవ్, భాష్యం రామకృష్ణ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. వీరిలో కొందరు పార్టీకి ఆర్థికంగానూ మరికొందరు రాజకీయంగా చేసిన సేవలను అధిష్ఠానం ముందు ప్రస్తావిస్తున్నట్లు తెలుస్తోంది.అందులోనూ సామాజిక సమీకరణాలు సైతం రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో కీలకంగా మారాయి. ముఖ్యంగా ఎస్సీ కోటాలో సీనియర్ నేత వర్ల రామయ్య పేరు బలంగా వినిపిస్తోంది. అలాగే, ఉత్తరాంధ్ర ప్రాంతానికి ప్రాధాన్యం వహించే చింతకాయల విజయ్‌కు బీసీ కోటాలో అవకాశం లభించే ఛాన్స్ ఉందంటూ చర్చ నడుస్తోంది. ఇక రాయలసీమ నుంచి రెడ్డప్పగారి శ్రీనివాస్ రెడ్డి, లింగారెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. బీసీ వర్గం నుంచి మాత్రం తిప్పేస్వామి కూడా రేసులో ఉన్నట్లు పార్టీ వర్గాల సమాచారం.ఇదిలా ఉంటే.. తెలంగాణ ప్రాంతానికి చెందిన కొత్త ముఖాలకు కూడా ఈసారి రాజ్యసభలో సీటు దక్కుతుందనే ప్రచారం కూడా జోరుగా కొనసాగుతోంది. ప్రస్తుతం ఏపీ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది.అసలు ఇప్పటివరకు పెద్దగా చర్చలో లేని కొందరి పేర్లు కూడా చివరి నిమిషంలో తెరపైకి వచ్చే అవకాశం కూడా ఉందని టీడీపీ శ్రేణుల్లో ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే మహిళలకు ప్రాధాన్యం వహించేలా ఒక మహిళకు రాజ్యసభ అవకాశం కల్పించే అంశాన్ని అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

జనసేనకు ఒక సీటుపై క్లారిటీ? :

అదేవిధంగా, ఎన్డీఏ కూటమి సమీకరణాలు సైతం ఈసారి రాజ్యసభ సభ్యుల ఎంపిక ప్రక్రియలో కీలకంగా మారే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా ఈసారి జనసేనకు ఒక రాజ్యసభ సీటు కేటాయించే అంశంపై స్పష్టత వచ్చినట్టు తెలుస్తోంది.

ఒకవేళ జనసేనకు అవకాశమిస్తే.. ఆ పార్టీ తరఫున లింగమనేని రమేష్ పేరు దాదాపు ఖరారైనట్లేనన్న ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. అయితే, దీనిపై అధికా రిక ప్రకటన ఇంకా రావాల్సి ఉంది. ఈ నెల 8వ తేదీతో నామినేషన్ల దాఖలు గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో రాజకీయ పరిణామాలు శరవేగంగా మారిపోతున్నాయి. ఎన్డీఏ సమావేశంలో మిత్రపక్షాలకు కేటాయింపులు, అభ్యర్థుల ఎంపికపై క్లారిటీ వచ్చే అవకాశముంది. దాంతో టీడీపీ ఆశావాహులు, జనసేన నేతలు, పార్టీ శ్రేణులు సైతం ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. రాజ్యసభ టికెట్లపై టీడీపీ తుది నిర్ణయం ఎలా ఉండబోతుంది అనేది ఆసక్తిగా మారింది.

# అంగన్‌వాడీల్లో జూన్ 12 నుంచి బ్రేక్‌ఫాస్ట్ పథకం..


## - చిన్నారుల పోషకాహారానికి తెలంగాణ ప్రభుత్వం మరో అడుగు

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల పోషకాహార స్థాయిని మరింత మెరుగుపరిచే లక్ష్యంతో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీల్లో జూన్ 12 నుంచి బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. తొలి దశలో ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. ఈ పథకం కింద అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ప్రతిరోజూ ఉప్మా లేదా కిచిడీతో పాటు పాలు అందించనున్నారు. ఇప్పటికే మధ్యాహ్న భోజనం, గుడ్లు, ఇతర పోషకాహార పదార్థాలు అందుతున్న నేపథ్యంలో ఉదయం అల్పాహారం కూడా అందించడం ద్వారా పిల్లల్లో పోషకాహార లోపాన్ని తగ్గించాలని ప్రభుత్వం భావిస్తోంది.రాష్ట్రంలో ముఖ్యంగా గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల్లో రక్తహీనత, తక్కువ బరువు, ఎదుగుదల లోపం వంటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు అధికారులు చెబుతున్నారు. ఉదయం పూట ఖాళీ కడుపుతో కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పోషకాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, ఏకాగ్రత, శారీరక ఎదుగుదల మెరుగుపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర ఎండల నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రకటించిన వేసవి సెలవులను జూన్ 10 లేదా 12 వరకు పొడిగించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది.

సెలవుల పొడిగింపు నిర్ణయం తీసుకుంటే బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు తేదీలో కూడా మార్పులు జరిగే అవకాశం ఉందని సమాచారం.అంగన్‌వాడీ సేవలను మరింత బలోపేతం చేయడం, చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం అందించడం, బాలల ఆరోగ్య సూచీలను మెరుగుపరచడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. పైలట్ ప్రాజెక్ట్ ఫలితాలను పరిశీలించిన అనంతరం రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ పథకాన్ని విస్తరించే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

# ఏఐ హబ్ గా మారుతున్న హైదరాబాద్

హైదరాబాద్ : గ్లోబల్ ఐటీ రంగంలో తనదైన ముద్ర వేసిన హైదరాబాద్ నగరం.. ఇప్పుడు సరికొత్త సాంకేతిక విప్లవానికి వేదికగా మారుతోంది. సాధారణ ఐటీ సేవల దశ నుంచి ఒక అడుగు ముందుకేసి.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , హైపర్‌స్కేల్ డేటా సెంటర్ల హబ్‌గా అవతరిస్తోంది. ప్రముఖ అంతర్జాతీయ ప్రాపర్టీ కన్సల్టెంట్ 'నైట్ ఫ్రాంక్ ఇండియా' విడుదల చేసిన ఇండియా డేటా సెంటర్ మార్కెట్ అప్‌డేట్ 2025 నివేదికలో కీలక విషయాలు వెల్లడయ్యాయి. గత మూడేళ్ల కాలంలోనే హైదరాబాద్ తన లైవ్ ఐటీ సామర్థ్యాన్ని రెట్టింపు కంటే ఎక్కువ స్థాయికి పెంచుకోవడం విశేషం.నివేదిక వివరాల ప్రకారం.. 2022 సంవత్సరంలో కేవలం 60.9 మెగావాట్లుగా ఉన్న హైదరాబాద్ లైవ్ ఐటీ సామర్థ్యం.. 2025 చివరి నాటికి ఏకంగా 151.4 మెగావాట్లకు చేరుకుంది. రాబోయే పదేళ్ల కాలంలో హైదరాబాద్‌లో దాదాపు 1.9 గిగావాట్ల సామర్థ్యంతో కూడిన డేటా సెంటర్ల అభివృద్ధి పనులు ప్రాథమిక దశలో ఉన్నాయి. దేశంలోనే అతిపెద్ద హైపర్‌స్కేల్ హబ్‌గా ఉన్న ముంబై మొత్తం సామర్థ్యం 3.9 గిగావాట్లు కాగా.. తర్వాతి స్థానంలో హైదరాబాద్ నిలిచి తన సత్తా చాటింది.హైదరాబాద్ గ్లోబల్ ఏఐ డేటా సెంటర్ హబ్‌గా ఎదగడానికి తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చొరవలు ప్రధాన కారణమని నివేదిక పేర్కొంది. ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో పాటు హై-డెన్సిటీ గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లు, భారీ స్థాయి




శిక్షణ కంప్యూట్, లిక్విడ్ కూలింగ్ టెక్నాలజీల ఏర్పాటుకు ప్రభుత్వం ఇస్తున్న ప్రత్యేక ప్రోత్సాహకాలు అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని చెప్పింది.హైదరాబాద్‌లో డేటా సెంటర్ల డిమాండ్ కూడా క్రమంగా మారుతోందని నివేదికలో వెల్లడైంది. 2024లో నగరం 19.2 మెగావాట్ల డేటా స్పేస్ వినియోగాన్ని నమోదు చేసింది. 2025లో ఈ డిమాండ్ కొంత మేర స్థిరంగా ఉన్నప్పటికీ.. మార్కెట్‌లో ఖాళీల శాతం సగటున 23 శాతంగా నమోదైంది. అంటే రాబోయే రోజుల్లో ఏఐ టెక్నాలజీ ఆధారంగా రానున్న భారీ డిమాండ్‌ను తట్టుకునేందుకు వీలుగా మార్కెట్ ప్రస్తుతం నిర్మాణ దశలో ఉందని నివేదిక విశ్లేషించింది. ఈ దూకుడు చూస్తుంటే భవిష్యత్తులో గ్లోబల్ ఏఐ మ్యాప్‌లో హైదరాబాద్ అగ్రస్థానంలో నిలవడం ఖాయంగా కనిపిస్తోంది.

# తెరపైకి నీటి కుంటలు

నిజామాబాద్ : 12 లక్షల లీటర్ల నిల్వ.. 20 మీటర్ల వెడల్పు.. 20 మీటర్ల పొడవు.. 3 మీటర్ల లోతుతో నీటి కుంట నిర్మించుకుంటే సుమారు 12 లక్షల లీటర్ల నీరు నిల్వ చేసుకోవచ్చు. ఇందుకు ఉద్యానశాఖ 50 శాతం రాయితీ ఇస్తోంది. కష్టకాలంలో బిందు సేద్యం ద్వారా పంటలకు నీటి తడులు అందించొచ్చు. తద్వారా దిగుబడులు పెంచుకోవచ్చు. బోరు బావులపై భారాన్ని తగ్గించొచ్చు. సిల్పాలిన్ షీట్తో కుంటకు లైనింగ్ చేసుకోవడం ద్వారా నీటి లీకేజీని అరికట్ ఎక్కువ రోజులు నిల్వ ఉండేలా చేసుకోవచ్చు.ఖరీఫ్ పంటల సాగుకు ఇంకా సమయం ఉన్నందున రైతులు వెంటనే నీటి కుంటలు తవ్వుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. వర్షాధారంగా పంటలు పండించే మెట్ట ప్రాంతాల్లో ఇవి కీలకంగా ఉంటాయని చెబుతున్నారు. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, మిరప, పసుపు ఇలా... దీర్ఘకాలం సాగులో ఉండే ఈ పంటలకు నీటి తడులు తరచూ అందించాల్సి ఉంటుంది. చాలాచోట్ల నీటి వనరులు అందుబాటులో లేని కారణంగా కొంతమంది రైతులు ఉద్యాన పంటల సాగులో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటివారికి తక్షణ ఉపాయంగా నీటి కుంటలను సూచిస్తోంది ఉద్యానశాఖ.ఎందుకంటే... నిర్దేశిత పరిమాణంలో నీటి కుంటలను తవ్వుకోవడం వల్ల సాగునీటి ఇబ్బందులుండవు. ప్రస్తుతం పొలాలు ఖాళీగా ఉన్నందున రైతులు దృష్టి సారించొచ్చు. కుంటల పరిమాణం ఆధారంగా రాయితీలు వినియోగించుకోవచ్చు. మిర్చి సాగులో కీలక దశలో ఒక్క తడి అందించకపోయినా దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వర్షాభావ పరిస్థితుల్లో రైతులు కిలోమీటర్ల దూరం నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకున్న ఘటనలెన్నో ఉన్నాయి. బోధన్ మండలంలోని పెగడపల్లి, భూలక్ష్మి క్యాంప్, బర్దిపూర్, సాలంపాడు సాలుర మండలాల్లో ఈ గుంటలో నిర్మిస్తున్నారు.ప్రాంతాల్లో అప్పటికప్పుడు నీటి కుంటలు తవ్విన పరిస్థితులూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో వేసవిలోనే నీటి కుంటలు తవ్వుకుంటే కాస్త వర్షం కురిసినా.. నీటిని ఒడిసిపట్టి నిల్వ చేసుకోవచ్చు. వర్షాలు కాస్త ఆలస్యమైనా.. కాలువలకు నీటి విడుదలలో జాప్యం జరిగినా.. ఇవి ఉపయోగపడతాయి. పంట కుంటల వల్ల పొలంలో 5 సెంట్ల వరకు సాగుకు ఉపయోగపడదన్న అపోహలో కొంతమంది రైతులున్నారు. వాటి ఆవశ్యకతను గుర్తించాలని జలవనరుల నిపుణులు సూచిస్తున్నారు.

# గజ్వేల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ హోమ్ గార్డ్ గలీజు వేషాలు

గజ్వేల్ : గజ్వేల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న హోం గార్డ్ గాజల కరుణాకర్ రెడ్డి వెకిలీ వేషాలు బయటపడ్డాయి. ట్రాఫిక్ పోలీసు స్టేషన్ లో పనిచేస్తూ సమీపంలోని ఓ ఇంట్లో హోమ్ గార్డ్ గాజల కరుణాకర్ రెడ్డి అద్దెకు ఉంటున్నాడు. పక్కింటిలో వుంటున్న గృహిణిని వేధింపులుకు గురి చేస్తున్నాడు. ఒంటిమీద బట్టలు తొలగించి ఆమె ముందు అంగ ప్రదర్శన చేస్తున్నాడు. బట్టలు ఆరేయడానికి మేడపైకి వెళ్ళినప్పుడల్లా తన భార్య ముందు ఇలా అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని..అతని వేషాలపై భార్య చెప్పడంతో..భర్త రహస్యంగా ఫోటోలు తీశాడు. స్థానిక పోలీసులకు పిర్యాదు చేసాడు. గజ్వేల్ పోలీసు స్టేషన్ లో హోమ్ గార్డ్ కరుణాకర్ రెడ్డిపై కేసు నయోదు అయింది.

# మట్టి తవ్వకాలలో కలెక్టర్ ఆదేశాలు గాలికి..

కృష్ణాజిల్లా : పామర్రు మండలం రిమ్మనపూడి గ్రామంలో చెరువు తవ్వకాలు పగలు రాత్రి తేడా లేకుండా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. కలెక్టర్ ఆదేశాలు ఉన్నప్పటికీ పర్మిషన్ తీసుకుని తవ్వుతున్నప్పటికీ ఐదు నుంచి 12 అడుగుల లోతు తవ్వుతున్నారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం గ్రామ అభివృద్ధికి మాత్రమే మట్టి తోలకలు జరగాలి. కానీ గ్రామ అభివృద్ధి శూన్యం. మట్టి అమ్ముకుని డబ్బు సొమ్ము చేసుకోవడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. అధిక వేగంతో టెట్రికార్డ్ సౌండ్ తో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న పట్టించుకునే నాధుడే లేకపోవడం తో గ్రామస్థులు మండిపడుతున్నారు.

# ఉపమాక వెంకన్న ఆలయంలో భారీ చోరీ

అనకాపల్లి : హోంమంత్రి ఇలాకాలోని శ్రీవారి ఆలయంలో దొంగతనం చోటు చేసుకుంది. పాయకరావుపేట ఉపమాక వెంకన్న ఆలయంలో భారీ చోరీ జరిగింది. ఆలయంలో గత అర్ధరాత్రి రెండు హుండీలు చోరీకు గురైయాయి. గత ఆరు సంవత్సరాలుగా అధికారులు బంగారం, వెండి ఆభరణాలు.. హుండీ ఆదాయాన్ని లెక్కించలుదని సమాచారం. విలువ సుమారు రూ.50 లక్షల వరకు నగదు ఉంటుందని అంచనా. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఆలయ సిబ్బందిని విచారిస్తున్నారు. సిసి ఫుటేజ్ పరిశీలిస్తున్నారు.

# ఫార్మా పనులను అడ్డుకున్న రైతులు

రంగారెడ్డి : యాచారం మండలంలోని తాటిపర్తి గ్రామంలో జరుగుతున్న ఫార్మా పనులను రైతులు అడ్డుకున్నారు. అక్రమంగా ఫార్మా భూముల్లో చదును చేసేందుకు గ్రామానికి పదుల సంఖ్యలో వచ్చిన జేసీబీలు, డోజర్లను అడ్డుకొని కోర్టు స్టే ఉన్న భూముల్లో ఎలాంటి పనులు చేయొద్దని వెనక్కి పంపారు. గ్రామానికి చెందిన చిట్టి నాగమణి అనే మహిళా రైతు ఫార్మాకు భూమిని ఇవ్వలేదు. సర్కార్ నుంచి పరిహారమూ తీసుకోలేదు.. పోలీసుల సహకారంతోఅధికారులు బలవంతంగా భూమిని చదునుచేస్తున్నారని స్థానికుల ఆరోపణ. విషయం తెలుసుకుని అక్కడికి వెళ్లి జేసీబీలు, డోజర్లు పొలాలకు రాకుండా అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు, పోలీసులతో వాగ్వాదం జరిగింది.

# టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్ కు రూ 20 లక్షలు విరాళం

తిరుమల : టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్ కు రూ 20 లక్షలు విరాళం అందింది. క్యాంప్ కార్యాలయంలో చైర్మన్ బిఆర్ నాయుడుని కలిసి దాతలు విరాళం అందజేసారు. హైదరాబాద్ కు చెందిన పురం సంజయ్ బాబు రూ 10 లక్షలు, హోమి పెట్స్ అధినేత హనుమర హర్షవర్ధన్ రూ 10 లక్షలు విరాళం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బోర్డుసభ్యుడు నన్నపనేని సదాశివరావు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలను ప్రోత్సహిద్దాం.. మంచి విద్యార్థులను తయారు చేద్దాం : ఎంపి ఈటల రాజేందర్

రంగారెడ్డి : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎల్బీ నగర్ లో నిర్వహించిన సమ్మర్ కోచింగ్ క్యాంప్ -2026 ముగింపు ఉత్సవాల్లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ తో చేసిన గౌరవ వందనం స్వీకరించారు. విద్యార్థులతో కలిసి ఫోటోలు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈకాలంలో పొద్దున్నుంచి రాత్రి దాకా చదువు తప్ప ఇంకోటి లేదు. అదొక్కటే సరిపోదు, సంపూర్ణత్వం ఇవ్వదు.విద్యార్థికి తనకాళ్ళ మీద తను నిలబడేలా విద్య ఉండాలి తప్ప.. మార్కులే పరమావధి కాకూడదు.అన్నిటినీ తట్టుకొని నిలబడే మానసిక స్థైర్యం అందించేవి క్రీడలు.ప్రభుత్వంతో పాటు అనేక మంది క్రీడాభిమానులు కలిసి ఈ క్యాంప్ నిర్వహించారు. కోచింగ్ ఇచ్చిన టీచర్లకు, ఓపికగా తీసుకువచ్చిన తల్లిదండ్రులకు, నిర్వాహకులకు, అధికారులకు నా హృదయపూర్వక అభినందనలు. మనం కనకూడని వినకూడని అనేక రుగ్మతలు వెంటాడుతున్నాయి.. వాటి నుంచి దూరం చేయగలిగిన సత్తా క్రీడలకు ఉంది. క్రీడలను ప్రోత్సహిద్దాం మంచి విద్యార్థులను తయారు చేద్దామని అన్నారు.

# ప్రకాష్ రాజ్ కు బండ్ల గణేష్ కౌంటర్

హైదరాబాద్ : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై నటుడు ప్రకాష్ రాజ్ విమర్శలు గుప్పించారు. తెలంగాణలో జనసేన పోటీ చేస్తుందన్న పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై ప్రకాష్ రాజ్ సెటైర్లు వేసారు. ఒంటరిగా వస్తున్నావా? పొత్తులతో వస్తున్నావా? క్లారిటీ ఇచ్చి రా' అని ప్రకాష్ రాజ్ ట్వీట్ చేసారు.


ప్రకాష్ రాజ్కు నిర్మాత, నటుడు బండ్ల గణేష్ కౌంటర్ ఇచ్చారు. "ఒరే.. నీకెందుకురా.. ప్రతి దాంట్లో వేలు పెడతావు? నువ్వు తమిళోడివా? తెలుగోడివా? కన్నడోడివా?" "నీ వూరేది? నీ కథేంటి? అందరి విషయాల్లో దూరి హీరోలా ఫీలవ్వకు."""ముందు నీ అడ్రస్ తెలుసుకో.. ఆ తర్వాత ప్రపంచాన్ని మార్చే ప్రయత్నం చెయ్యి" అని ప్రకాష్ రాజ్కు బండ్ల గణేష్ కౌంటర్ ఇచ్చారు..

# రమా నందన పై కేసు నమోదు

రంగారెడ్డి : ఇబ్రహీంపట్నంలో ప్రముఖ యూట్యూబర్, మన శంకర వర ప్రసాద్ నటి రమా నందన అలియాస్ నందు కుటుంబంపై కేసు నమోదు అయింది. యూకే వీసా రెన్యూవల్ పేరిట రూ.15 లక్షల టోకరా ఇచ్చినట్లు పిర్యాదు. డెస్టినీ కన్సల్టెన్సీ పేరిట వీసా రెన్యూవల్ చేస్తామంటూ నమ్మించి భారీ మోసానికి నిందితులు పాల్పడ్డారు. వెస్ట్ ఇబ్రహీంపట్నం కి చెందిన మామిళ్ళపల్లి శివక్రాంతి కుమార్ అనే బాధితుడి ఫిర్యాదుతో ఉదంతం వెలుగు చూసింది. బాధితుడు యూకే లో ఉన్న సమయంలో వీసా గడువు ముగిసిపోతుండటంతో డెస్టినీ కన్సల్టెన్సీ నిర్వాహకులను ఆశ్రయించిన వైనం. ఇండియాకు చెందిన తమ బ్రాంచ్లో డబ్బులు చెల్లిస్తే వీసా ప్రాసెస్ చేస్తామని కేటుగాళ్లు నమ్మబలికారు. నిందితుల మాటలు నమ్మి రూ. 15 లక్షల వరకు బాధితుడు కుమార్ చెల్లించాడు. నెలలు గడుస్తున్నా వీసా రాకపోవడంతో పాటు నిందితులు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో మోసపోయానని గ్రహించాడు.

ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లో బాధితుడి ఫిర్యాదు ఆధారంగా నిందితులపై క్రైమ్ నంబర్ 515/2025 కింద కేసు ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసారు. డెస్టినీ కన్సల్టెన్సీ డైరెక్టర్ జాగర్లమూడి మధుకర్, ఆయన భార్య రమానందన మరియు గుంటూరులో ఉండే మధుకర్ తండ్రి పై కేసు నమోదు అయింది. ఈ ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఎస్ఐ బి.రాజు వెల్లడించారు. ఈ కన్సల్టెన్సీ ద్వారా ఇంకా చాలా మంది మోసపోయి ఉండే అవకాశం ఉందన్న అనుమానాలు వున్నాయి. మిగిలిన బాధితుల వివరాలను కూడా పోలీసులు సేకరిస్తున్నారు.

# విజయ్ వర్సెస్ అన్నామలై



చెన్నై : తమిళనాడు రాజకీయాలు ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. మొన్నటి తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే ఇందుకు కారణమని చెప్పాలి. ఈ ఎన్నికల్లో కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ స్థాపించిన తమిళ వెట్రిగ కజగం (టీవీకే) రెండు పెద్ద పార్టీలను చిత్తు చేసి అధికార పార్టీగా అవతరించిన తీరు ఈ ఆసక్తిని మరింతగా పెంచింది. ఈ ఆసక్తి ఎక్కడిదాకా వెళ్లిందంటే.. తమిళనాడు అసెంబ్లీకి 2031లో జరిగే ఎన్నికల సమీకరణాల వరకూ వెళ్లిపోయింది. 2031లో జరిగే తమిళ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ విజయ్ వర్సెస్ అన్నామలై అంటూ ఆసక్తికర విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఈ విశ్లేషణలు ఎంతమేర కార్యరూపం దాలుస్తాయన్న దానిపైనా ఇప్పుడు ఆసక్తికర చర్చలు జరుగుతున్నాయి. తమిళనాడు నూతన సీఎం విజయ్ ఎన్నికలకు రెండేళ్ల ముందుగానే రాజకీయ పార్టీని ప్రకటించి రెండేళ్ల పాటు ప్రజల్లో తిరిగారు. అప్పటికే తనకున్న స్టార్ డమ్ ను, ఫ్యాన్ ఫాలోయింగ్ ను చక్కగా వినియోగించుకున్న విజయ్ ఎన్నికల్లో విజయం సాధించారు. ఈ విజయానికి దివంగత నేతలు కరుణానిధి, జయలలిత మరణాలతో ఏర్పడిన రాజకీయ శూన్యతను సద్వినియోగం చేసుకోవడంలో విజయ్ సఫలమయ్యారు. 2031 నాటికి విజయ్ పార్టీ ఓ ప్రధాన పోటీదారుగా అయితే ఉంటుందని పక్కాగా చెప్పవచ్చు. ఇక బీజేపీ నుంచి బయటకు వెళ్లేందుకు సిద్ధమైపోయిన అన్నామలై విషయానికి వస్తే.. అసలు ఆయన రాజకీయ ప్రయాణం ఎలా అన్న దానిపై ఇప్పటిదాకా స్పష్టత లేదని చెప్పాలి. ఓ ఐపీఎస్ అధికారిగా పనిచేస్తున్న అన్నామలై తన సివిల్ సర్వెంట్ పదవికి రాజీనామా చేసి మరీ రాజకీయాల్లోకి వచ్చారు. వచ్చీరాగానే బీజేపీ బాటలో నడిచిన ఆయన బీజేపీ తమిళనాడు అధ్యక్షుడి హోదాలో పలు కీలక కార్యక్రమాలకు దిగారు. బహిరంగంగా తనను తాను కొరడాతో కొట్టుకుని నిరసన వ్యక్తం చేసిన అన్నామలై దేశవ్యాప్తంగా అయితే గుర్తింపును దక్కించుకున్నారు. అయితే ఆయన భవిష్యత్తు రాజకీయ చిత్రం ఏమిటన్నది ఇప్పటికీ తెలియదనే చెప్పాలి. అన్నామలై బీజేపీని వీడే దిశగా సాగుతూ ఉంటే ఆయనను పార్టీలోనే నిలుపుకునే దిశగా కమలం పార్టీ యత్నిస్తోంది. అయినా బీజేపీని వీడినా అన్నామలై విజయ్ స్థాయిలో ప్రజాదరణను చూరగొంటారన్న గ్యారెంటీ అయితే లేదు. ఎందుకంటే ఇప్పటికే ఓ రాజకీయ పార్టీలో పనిచేసిన ఆయన ఆ పార్టీని వీడి బయటకు వచ్చేందుకు యత్నిస్తూ రాజకీయాలపై తనకు ఇంకా స్పష్టత రాలేదన్న విషయాన్ని తనకు తానుగానే బయటపెట్టుకున్నారు. విజయ్ కి కోట్లాది మంది ఫ్యాన్స్ ఓట్లు వేసి, వెయింటి ఆయనకు గెలుపును అందిస్తే ఆ స్థాయిలో అన్నామలైకి ఓట్లు వేసి, వేయించే వారు ఎవరన్నది ప్రశ్నార్థకం. వెరసి విజయ్ తో అన్నామలై పోలిక అసలు కుదరదని చెప్పాలి. అంతేకాకుండా విజయ్ కి ఆయన ప్రధాన ప్రత్యర్థి అవుతారన్నది దాదాపుగా సాధ్యం కాదని చెప్పాలి.

**ముందే చెప్పిన అన్నామలై**

2024 లోక్ సభ ఎన్నికల సమయంలో అన్నామలై మాట్లాడుతూ.. 2026లో తమిళనాడు ఏ ఒక్క పార్టీ సొంతంగా అధికారంలోకి రాలేదని అంచనా వేశారు. ఆయన అంచనాలకు దగ్గరగా తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చాయి. ఆప్షన్-ఏ కింద తమిళనాడులో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడుతుందని అంచనా వేసిన అన్నామలై.. ఆప్షన్-బి కింద బీజేపీ గనుక వచ్చే రెండేళ్లపాటు క్రమించి క్షేత్రస్థాయిలో నాయకులను తీర్చిదిద్దితే.. 500 రోజుల ముందు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా అభ్యర్థులను ప్రకటిస్తే.. 2026లో ప్రజలు తమవైపు మొగ్గు చూపుతారని ఆయన అంచనా వేశారు. బీజేపీ పెద్ద రిస్క్ తీసుకొని.. ఎన్నికల నోటిఫికేషన్ అమల్లోకి రావడానికి 500 రోజుల ముందు అభ్యర్థులను ప్రకటిస్తే.. తమిళనాడులో బీజేపీకి అద్భుతమైన భవిష్యత్తు ఉంటుందని అన్నామలై 2024లోనే వ్యాఖ్యానించారు. అన్నామలై చెప్పినట్టు 2026 ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా లేదు.. 2024 ఎన్నికల తరహాలోనే చిన్న పార్టీలతో కలిసి పోటీ చేసి 5-6 సీట్లు గెలుచుకున్నా సరే.. ఇప్పుడు తమిళనాడు ముఖచిత్రం మరోలా ఉండేదని చెప్పొచ్చు. ఒకవేళ ఒక్క సీటు గెలవలేకపోయినా సరే, 10 శాతానికి అటు ఇటుగా ఓట్లు సాధిస్తే మరుసటి ఎన్నికల నాటికి బీజేపీ పరిస్థితి ఆశాజనకంగా ఉండేది. అయితే బీజేపీ అధినాయకత్వం ఆయన మాటలను పరిగణనలోకి తీసుకోలేదు. అన్నాడీఎంకేతో పొత్తుకే ప్రాధాన్యం ఇచ్చింది. ఈపీఎస్ డిమాండ్ తో అన్నామలైను పార్టీ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించింది. దీంతో 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చాక.. పళనిస్వామి పేరు కూడా ఎత్తకుండా అన్నామలై ట్వీట్ చేశారు. జాతీయ పార్టీ అయిన బీజేపీకి కొన్ని సమస్యలు కూడా ఉంటాయని అన్నామలైకు తెలుసు. తమిళనాడులో ద్రవిడ వాదంతోపాటు బీజేపీ పట్ల వ్యతిరేకత కూడా ఎక్కువే. అందుకే బీజేపీ నాయకుడిగా జనంలో వెళ్లడం కంటే.. సొంత పార్టీ పెట్టుకుని జాతీయ వాద దృష్టి, లౌకిక భావనలతో ముందుకెళ్తే తనకు సొంతంగానే ఎదిగే అవకాశం ఉందని అన్నామలై భావించి ఉండొచ్చు. 41 ఏళ్ల తాను మరోపదేళ్లు కష్టపడితే పార్టీని అధికారంలోకి తీసుకు రావడం కష్టం కాదనే అంచనాతోనే ఆయన సొంత పార్టీవైపు మొగ్గు చూపుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే డీఎంకేను దెబ్బతీసి విజయ్ నాయకత్వంలోని టీవీకే అధికారంలోకి రాగా.. మూడో స్థానానికి పరిమితమైన అన్నాడీఎంకేను అన్నామలై దెబ్బకొట్టే అవకాశం ఉంది.

# 2027లో కేటీఆర్ పాదయాత్ర



హైదరాబాద్ : ఏ పార్టీ నేత పాద యాత్ర చేసే ఎన్నికల్లో ఆ పార్టీ గెలవడం ఖాయం. ఈ సంప్రదాయం తెలుగు రాష్ట్రాల్లో కొనసాగుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్.రాజశేఖరరెడ్డి ఈ పాదయాత్రల సంస్కృతికి శ్రీకారం చుట్టారు. పదేళ్ల టీడీపీని గద్దెలోకి దించేందుకు ఆయన పాదయాత్ర చేశారు. తర్వాత అధికారంలోకి వచ్చారు. ఆ తర్వాత వైఎస్సార్ తనయుడు జనగ్ కూడా పాదయాత్ర చేశారు. రాష్ట్ర విభజన తర్వాత 2019లో అధికారంలోకి వచ్చారు. ఇక 2023లో టీడీపీ నేత లోకేశ్ పాదయాత్ర చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చింది. 2022లో తెలంగాణలో రేవంత్‌రెడ్డి పాదయాత్ర చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఇదే సెంటిమెంటు కొనసాగించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పాదయాత్రను ఎంచుకున్నారు. 2027లో రాష్ట్రవ్యాప్త పాదయాత్ర చేపట్టనున్నట్లు తాజాగా కేటీఆర్ ప్రకటించారు. గతంలో కూడా చెప్పాడు. ఇది తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చనీయాంశమైంది. తాజాగా "ఈలోపు ఫిట్ అవుతాను" అని చెప్పుతూ, పాదయాత్ర మార్గం పార్టీ చర్చల అనంతరం నిర్ణయిస్తామని తెలిపారు. ఇది సాధారణ ప్రకటన కాదు. ఇది బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం తీసుకురావడంలో భాగమని విశ్లేషకులు భావిస్తున్నారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి అధికారం లక్ష్యంగా ఈ పాదయాత్రం ఉంటుందని పేర్కొంటున్నారు. అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో బీఆర్ఎస్‌కు ప్రజల మధ్య ఒక దూరం ఏర్పడిందని. ఇది చాలా ముఖ్యమైన అంగీకారం. ఎందుకంటే, ఏ పార్టీ అయినా అధికారంలో ఉన్నప్పుడు పాలనా యాంత్రికత, అధికార దూరం వల్ల గ్రామీణ-ప్రజా స్థాయి సంబంధాలు బలహీనపడతాయి. బీఆర్ఎస్ ఈ వాస్తవాన్ని అంగీకరించి, పాదయాత్ర ద్వారా ఆ అంతరాన్ని తగ్గించాలని నిర్ణయించుకోవడం రాజకీయంగా బాధ్యతావంతమైన వైఖరి.ఏ పార్టీ నేత పాద యాత్ర చేసే ఎన్నికల్లో ఆ పార్టీ గెలవడం ఖాయం. ఈ సంప్రదాయం తెలుగు రాష్ట్రాల్లో కొనసాగుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్.రాజశేఖరరెడ్డి ఈ పాదయాత్రల సంస్కృతికి శ్రీకారం చుట్టారు. పదేళ్ల టీడీపీని గద్దెలోకి దించేందుకు ఆయన పాదయాత్ర చేశారు. తర్వాత అధికారంలోకి వచ్చారు. ఆ తర్వాత వైఎస్సార్ తనయుడు జనగ్ కూడా పాదయాత్ర చేశారు. రాష్ట్ర విభజన తర్వాత 2019లో అధికారంలోకి వచ్చారు. ఇక 2023లో టీడీపీ నేత లోకేశ్ పాదయాత్ర చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చింది. 2022లో తెలంగాణలో రేవంత్‌రెడ్డి పాదయాత్ర చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఇదే సెంటిమెంటు కొనసాగించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పాదయాత్రను ఎంచుకున్నారు.

**2027లో జనంలోకి..** 2027లో రాష్ట్రవ్యాప్త పాదయాత్ర చేపట్టనున్నట్లు తాజాగా కేటీఆర్ ప్రకటించారు. గతంలో కూడా చెప్పాడు. ఇది తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చనీయాంశమైంది. తాజాగా "ఈలోపు ఫిట్ అవుతాను" అని చెప్పుతూ, పాదయాత్ర మార్గం పార్టీ చర్చల అనంతరం నిర్ణయిస్తామని తెలిపారు. ఇది సాధారణ ప్రకటన కాదు. ఇది బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం తీసుకురావడంలో భాగమని విశ్లేషకులు భావిస్తున్నారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి అధికారం లక్ష్యంగా ఈ పాదయాత్రం ఉంటుందని పేర్కొంటున్నారు. అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో బీఆర్ఎస్‌కు ప్రజల మధ్య ఒక దూరం ఏర్పడిందని. ఇది చాలా ముఖ్యమైన అంగీకారం. ఎందుకంటే, ఏ పార్టీ అయినా అధికారంలో ఉన్నప్పుడు పాలనా యాంత్రికత, అధికార దూరం వల్ల గ్రామీణ?ప్రజా స్థాయి సంబంధాలు బలహీనపడతాయి. బీఆర్ఎస్ ఈ వాస్తవాన్ని అంగీకరించి, పాదయాత్ర ద్వారా ఆ అంతరాన్ని తగ్గించాలని నిర్ణయించుకోవడం రాజకీయంగా బాధ్యతావంతమైన వైఖరి.వైఎస్ రాజశేఖర్ రెడ్డి నుంచి చంద్రబాబు నాయుడు, రాహుల్ గాంధీ వరకు అనేక నాయకులు పాదయాత్రల ద్వారా తమ రాజకీయ జీవితాల్లో కీలక మలుపులు తిప్పుకున్నారు. కేటీఆర్ కూడా ఇప్పుడు అదే మార్గం ఎంచుకోవడం ఆయన ఇమేజ్‌ను 'హై?టెక్, అర్బన్ నాయకుడి' నుంచి 'ప్రజా నాయకుడి'గా మార్చుకోవాలన్న తపనను సూచిస్తోంది. కేటీఆర్ మరో ముఖ్యమైన విషయం స్పష్టం చేశారు. 2028 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒంటరిగా పోటీ చేస్తుందని, ఎలాంటి కూటములు లేవని. ఇది ఒకవైపు ధైర్యవంతమైన నిర్ణయం కాగా, మరోవైపు ప్రస్తుత రాజకీయ సమీకరణాల్లో ఆఖకి పెద్ద సవాలు కూడా. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మీద ఉన్న అసంతృప్తి బీఆర్ఎస్‌కు అవకాశం ఇస్తున్నప్పటికీ, పార్టీ సంస్థాగత బలం గణనీయంగా తగ్గింది. ఈ నేపథ్యంలో పాదయాత్ర ద్వారా కేడర్‌ను పునరుజ్జీవింపజేయడం, కొత్త నాయకత్వాన్ని గుర్తించడం, ప్రజల సమస్యలను నేరుగా అర్థం చేసుకోవడం అత్యంత కీలకం.కేటీఆర్ పాదయాత్ర విజయవంతమైతే, అది బీఆర్ఎస్‌ను మళ్లీ తెలంగాణ రాజకీయాల్లో ప్రధాన ఆప్షన్‌గా నిలబెట్టవచ్చు. ముఖ్యంగా గ్రామీణ తెలంగాణలో ఇప్పటికీ ఉన్న సానుభూతిని మళ్లీ సక్రమంగా ఉపయోగించుకోవడానికి ఇది ఉపయోగపడవచ్చు. అయితే, పాదయాత్ర కేవలం నడక మాత్రమే కాదు. దాని వెనుక స్పష్టమైన అజెండా, ప్రజల సమస్యలపై నిజమైన దృష్టి, స్థిరమైన సందేశం ఉండాలి. లేనప్పుడు ఇది ఒక ఏడాది ముందు ఎన్నికల డ్రామాగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. 2027లో ఆయన పాదయాత్ర ఎంతవరకు ప్రజలను ఆకట్టుకుంటుందనేది రాబోయే రోజుల్లో తేలాల్సి ఉంది.వైఎస్ రాజశేఖర్ రెడ్డి నుంచి చంద్రబాబు నాయుడు, రాహుల్ గాంధీ వరకు అనేక నాయకులు పాదయాత్రల ద్వారా తమ రాజకీయ జీవితాల్లో కీలక మలుపులు తిప్పుకున్నారు. కేటీఆర్ కూడా ఇప్పుడు అదే మార్గం ఎంచుకోవడం ఆయన ఇమేజ్‌ను 'హై?టెక్, అర్బన్ నాయకుడి' నుంచి 'ప్రజా నాయకుడి'గా మార్చుకోవాలన్న తపనను సూచిస్తోంది. కేటీఆర్ మరో ముఖ్యమైన విషయం స్పష్టం చేశారు. 2028 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒంటరిగా పోటీ చేస్తుందని, ఎలాంటి కూటములు లేవని. ఇది ఒకవైపు ధైర్యవంతమైన నిర్ణయం కాగా, మరోవైపు ప్రస్తుత రాజకీయ సమీకరణాల్లో ఆఖకి పెద్ద సవాలు కూడా. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మీద ఉన్న అసంతృప్తి బీఆర్ఎస్‌కు అవకాశం ఇస్తున్నప్పటికీ, పార్టీ సంస్థాగత బలం గణనీయంగా తగ్గింది. ఈ నేపథ్యంలో పాదయాత్ర ద్వారా కేడర్‌ను పునరుజ్జీవింపజేయడం, కొత్త నాయకత్వాన్ని గుర్తించడం, ప్రజల సమస్యలను నేరుగా అర్థం చేసుకోవడం అత్యంత కీలకం.కేటీఆర్ పాదయాత్ర విజయవంతమైతే, అది బీఆర్ఎస్‌ను మళ్లీ తెలంగాణ రాజకీయాల్లో ప్రధాన ఆప్షన్‌గా నిలబెట్టవచ్చు. ముఖ్యంగా గ్రామీణ తెలంగాణలో ఇప్పటికీ ఉన్న సానుభూతిని మళ్లీ సక్రమంగా ఉపయోగించుకోవడానికి ఇది ఉపయోగపడవచ్చు. అయితే, పాదయాత్ర కేవలం నడక మాత్రమే కాదు. దాని వెనుక స్పష్టమైన అజెండా, ప్రజల సమస్యలపై నిజమైన దృష్టి, స్థిరమైన సందేశం ఉండాలి. లేనప్పుడు ఇది ఒక ఏడాది ముందు ఎన్నికల డ్రామాగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. 2027లో ఆయన పాదయాత్ర ఎంతవరకు ప్రజలను ఆకట్టుకుంటుందనేది రాబోయే రోజుల్లో తేలాల్సి ఉంది.

# ప్రపంచ వేదికపై ఆంధ్రప్రదేశ్ కీర్తి పతాకం రెపరెపలు

- ప్రపంచాన్ని ఆకట్టుకున్న ఏపీ ప్రకృతి వ్యవసాయం - ప్రకృతి వ్యవసాయంలో ఏపీకి విశిష్ట స్థానం
- దేశానికే గర్వకారణమైన ఈ గౌరవాన్ని మహిళలు, రైతులకు అంకితం చేస్తున్నాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికత, రైతాంగ అంకితభావానికి దక్కిన అంతర్జాతీయ గుర్తింపు
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

అమరావతి : ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పర్యావరణ పురస్కారంగా గుర్తింపు పొందిన 'ఫుడ్ ప్లానెట్ ప్రైజ్?2026' ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ కార్యక్రమంకు లభించడం రాష్ట్రానికే కాక దేశానికీ గర్వకారణమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఈ అరుదైన అంతర్జాతీయ గుర్తింపుతో ప్రకృతి వ్యవసాయ రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, రాష్ట్ర ప్రభుత్వం చూపిన చిత్తశుద్ధి, రైతులు, గ్రామీణ మహిళల అంకితభావంతో కూడిన కృషికి ప్రపంచ వేదికపై లభించిన గౌరవమే ఈ పురస్కారమని మంత్రి వివరించారు. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులు, గ్రామీణ మహిళలు, ప్రకృతి వ్యవసాయ ఉద్యమానికి అంకితభావంతో పనిచేసిన ప్రతి కార్యకర్తకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు.కర్ట్ బర్గ్‌ఫోర్స్ ఫౌండేషన్ జూన్ 2న స్వీడన్‌లోని బస్తాద్ నగరంలో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్, రైతు సాధికార సంస్థ కార్యనిర్వాహణ అధికారి తల్లం విజయ్ కుమార్ పాల్గొని ఈ అవార్డును స్వీకరించారు. ప్రపంచ ఆహార వ్యవస్థలో పర్యావరణ అనుకూల మార్పులకు దోహదపడుతున్న వినూత్న కార్యక్రమాలను గుర్తించి ఈ పురస్కారం అందజేసారని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గనిర్దేశంలో దశాబ్దం క్రితం ప్రారంభమైన ప్రకృతి వ్యవసాయ ఉద్యమం నేడు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన అతిపెద్ద వ్యవసాయ పర్యావరణ కార్యక్రమాలలో ఒకటిగా ఎదిగిందని మంత్రి అన్నారు. ప్రకృతి సిద్ధాంతాలకు అనుగుణంగా వ్యవసాయ విధానాలను అమలు చేయడం ద్వారా వాతావరణ మార్పులు, పర్యావరణ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని ఒఖఅఔఈ నిరూపించిందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం రైతులకు అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయాన్ని అందించడమే కాకుండా నేల సారాన్ని పెంపొందించడం, జీవవైవిధ్యాన్ని పరిరక్షించడం, రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించడం వంటి ప్రయోజనాలను అందిస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ నమూనా దేశంలోని 21 రాష్ట్రాలతో పాటు శ్రీలంక, జాంబియా దేశాల్లోనూ అమలవుతుండటం ఆంధ్రప్రదేశ్ రూపొందించిన విధానం ప్రపంచవ్యాప్తంగా ఆచరణీయమని నిరూపిస్తోందని ఆయన చెప్పారు. ముఖ్యంగా మహిళల నాయకత్వం ఈ ఉద్యమ విజయానికి ప్రధాన బలంగా నిలిచిందని వివరించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులైన గ్రామీణ మహిళలు కుటుంబ స్థాయిలో ఆలోచనా విధానంలో మార్పు తీసుకువచ్చి రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా 18 లక్షల మంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు నడిపిస్తున్న 10 వేల మందికిపైగా కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు సేవలు అభినందనీయమని తెలిపారు.

# త్వరలో ఇండియాకు వస్తా...



హైదరాబాద్ : పరారీలో ఉన్న లలిత్ మోడీ, భారత్‌కు తిరిగి రావడం, చట్టపరమైన విషయాల గురించి క్లియర్ గా మాట్లాడారు. "నేను పారిపోవడం లేదు. ఈ రోజు నా స్నేహితులలో చాలా మంది అధికారంలో ఉన్నారని చెప్పాను, కానీ నేను సహాయం కోసం ఎవరికీ ఎప్పుడూ ఫోన్ చేయలేదు" అని అన్నారు. నేను మోదీ చాలా క్లోజ్‌గా ఉండే వాళ్లమని ఎప్పుడూ క్రికెట్ గురించి మాత్రమే మాట్లాడుకునే వాళ్లమని వివరించారు. ఐపీఎల్ మాజీ ఛైర్మన్, పరారీలో ఉన్న లలిత్ మోడీ, భారతదేశానికి తిరిగి రావడం, చట్టపరమైన విషయాలతో సహా పలు అంశాలపై ఇంటర్వ్యూలో మాట్లాడారు. తనపై బలమైన కేసు ఉంటే, తాను కోర్టుకు వెళ్లేవాడినని పేర్కొన్నారు. లలిత్ మోడీ భారత న్యాయ ప్రక్రియను కూడా ప్రశ్నించారు. "నేను ఏ చట్టం నుంచీ పారిపోవడం లేదు. నాపై పక్కా కేసు ఉండి ఉంటే, అది 17 ఏళ్లలోపే కోర్టుకు చేరి ఉండేది." ఇప్పటి వరకు తనపై ఎలాంటి క్రిమినల్ శిక్ష పడలేదని ఆయన పేర్కొన్నారు. "నేను ఏదైనా తప్పు చేసి ఉంటే, చర్య తీసుకుని ఉండేవారు."పరారీలో ఉన్న లలిత్ మోడీ తన సమస్య భారత ప్రభుత్వంతో కాదని, న్యాయ ప్రక్రియలోని నెమ్మదితోనే ఉందని పేర్కొన్నారు. చాలా కేసుల్లో నిజం బయటపడటానికి సంవత్సరాలు పడుతుందని ఆయన అన్నాడు. నెమ్మదైన న్యాయ ప్రక్రియే ఒక శిక్షగా మారుతుందని అన్నారు. ఐపీఎల్ మాజీ ఛైర్మన్ లలిత్ మోడీ ఐపీఎల్ గురించి మాట్లాడుతూ, "వ్యవస్థ అంగీకరించినా, అంగీకరించకపోయినా, నేను ఈ ఆటను, లీగ్‌ను చాలా నిశితంగా చూస్తున్నాను." "ఈ రోజు నా ప్రాధాన్యత నా కుటుంబం, నా పిల్లలే. నా వల్ల, వారు ఊహించలేని పరిస్థితులను ఎదుర్కొన్నారు. ఐపీఎల్ కూడా నాకు బిడ్డతో సమానం" అని అన్నారు. అధికార పార్టీతో తనకున్న సాన్నిహిత్యం గురించి లలిత్ మోదీ మాట్లాడుతూ, "ఈ రోజు నా స్నేహితుల్లో చాలా మంది అధికారంలో ఉన్నారు, కానీ నేను సహాయం కోసం ఎవరికీ ఫోన్ చేయలేదు. 17 ఏళ్లలో, నా స్వలాభం కోసం నేను ఏ రాజకీయ సంబంధాలను ఉపయోగించుకోలేదు." అని అన్నారు. "నేను కోరుకుంటే చాలా మందికి ఫోన్ చేసి ఉండొచ్చు, కానీ నేను ఎవరినీ సహాయం అడగలేదు." అని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని గొప్ప క్రికెట్ అభిమానిగా మాజీ ఐపీఎల్ ఛైర్మన్,క్రికెట్ నిర్వాహకుడు లలిత్ మోడీ అభివర్ణించారు. తనకు, ప్రధాని మోదీకి మధ్య జరిగే చర్చల్లో ఎక్కువ భాగం అహ్మదాబాద్‌లో క్రికెట్ మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ఉండేవని అన్నారు. గుజరాత్‌లో క్రికెట్ అభివృద్ధిపై ప్రధాని మోదీ ఎల్లప్పుడూ ఉత్సాహంగా ఉండేవారని చెప్పారు."మా సంభాషణలు కేవలం క్రికెట్ గురించే ఉండేవి," అని లలిత్ మోడీ అన్నారు, "నరేంద్ర మోదీ క్రికెట్ అభిమాని. ఆయనకు అహ్మదాబాద్‌లోని క్రికెట్ మౌలిక సదుపాయాలపై ఆసక్తి ఉండేది, మా చర్చలు క్రికెట్‌కే పరిమితమయ్యాయి." "నేను నరేంద్ర మోదీకి సన్నిహితంగా ఉండేవాడిని, కానీ ఆ సాన్నిహిత్యం క్రికెట్ విషయంలోనే కానీ రాజకీయాల విషయంలో కాదు." అని స్పష్టం చేశారు. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం గురించి ఇటీవల చేసిన ప్రకటనల తర్వాత లలిత్ మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు . అవకాశం ఇస్తే, ప్రేక్షకులకు మెరుగైన వీక్షణా అనుభవాన్ని అందించడానికి ఆ స్టేడియంను కూల్చివేసి తిరిగి నిర్మిస్తానని ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలోని ప్రముఖ క్రికెట్ స్టేడియంలలో ఒకటిగా పరిగణించే ఈ మైదానంపై ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీశాయి.

'నేను స్టేడియంను విమర్శించలేదు'

తాను స్టేడియంను విమర్శించలేదని, భారత క్రీడా మౌలిక సదుపాయాల కోసం ఒక పెద్ద దార్శనికత గురించి మాట్లాడుతున్నానని లలిత్ మోడీ అన్నారు. "ఈ రోజు ఇది భారత్‌లోనే అత్యుత్తమ స్టేడియం, కానీ అది సరిపోదు. నేను దానిని కూల్చివేస్తానని చెప్పాను. నేను దానిని కూల్చివేయడం గురించి మాట్లాడితే, ఇతర స్టేడియంలను కూడా కూల్చివేయాల్సి వస్తుంది. ఈ రోజు ఇది భారత్‌లోనే అత్యుత్తమ స్టేడియం అని నేను స్పష్టంగా చెప్పాను. కానీ నేను అంతర్జాతీయ స్థాయి అభిమానుల అనుభవాన్ని అందించాలనుకుంటే, నేను దానిని కూడా పునర్నిర్మిస్తాను." అని పేర్కొన్నారు. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)కి నేడు ఉన్న ఆర్థిక శక్తి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్రపంచంలోని అత్యంత ప్రతిష్ఠాత్మక క్రీడా మైదానాలకు దీటుగా దేశంలో స్టేడియాలను నిర్మించాలని లలిత్ అన్నారు. "ఈ రోజు వెంబ్లీ స్టేడియం, లార్డ్స్, బార్సిలోనా క్యాంప్ నౌ, మాంచెస్టర్ యునైటెడ్ ఓల్డ్ ట్రాఫోర్డ్, మాంచెస్టర్ సిటీ ఎతిహాద్ స్టేడియంలను చూడండి. అవన్నీ మన స్టేడియాల కంటే ఎంతో ఉత్తమమైనవి. ఈ రోజు బీసీసీఐ వద్ద గతంలో కంటే ఎక్కువ డబ్బు ఉంది, కాబట్టి మనం మరింత పెద్ద స్థాయిలో ఆలోచించాలి." అని సూచించారు.

# చిక్కుల్లో యూ ట్యూబర్స్...నందూస్ వరల్డ్

విజయవాడ : యూట్యూబర్, 'నందూస్ వరల్డ్' ఛానల్ నిర్వాహకురాలు రమానందన దంపతుల మోసాలు వెలుగులోకి వస్తున్నాయి. ఉద్యోగాలు, వీసా రెన్యువల్ పేరుతో పలువురి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూళ్లు చేసినట్లు వస్తున్న ఆరోపణలు ఇప్పుడు సంచలనంగా మారుతున్నాయి. గుంటూరుకు చెందిన జాగర్లమూడి మధుకర్, అన్నే రమా నందన దంపతులు యూకేలో స్థిరపడ్డారు. యూట్యూబ్ ద్వారా ఫేమ్ అయిన అనేకమంది తెలుగు వారిలో రీసెంట్ గా ఎక్కువగా పాపులరైన జంట నందూస్ ఫ్యామిలీనే. నందన, తన భర్త, పిల్లలతో కలిసి సరదా వీడియోలు చేస్తూ మంచి పాపులారిటీ సంపాదించుకుంది. కొంచెం డిఫరెంట్ హస్కీ వాయిస్ తో ఉండే ఆమె చేసే వీడియోలకు ఎంతో క్రేజ్ ఉంది. ఆమె ఛానల్ కు 28 లక్షలకు పైగా సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. కంటెంట్ పరంగా జఐలో ఫ్యామిలీ డైలీ లైఫ్, వాళ్ళింట్లో జరిగే ఫంక్షన్లు, ట్రావెల్ అనుభవాలు, షాపింగ్, పండుగలు, బంధువులతో గడిపే క్షణాలు, భార్యాభర్తల సరదా సంభాషణలు ఇలా ఒకటేంటి వారి జీవితంలో సమస్తం మనకు చూపిస్తారు. అది కూడా చాలా సరదాగా. ఈమధ్య చిరంజీవి మూవీలో కూడా మెరిశారు నందన. ఇలా ఇన్-ఫ్లూయన్సర్ గా సంచలనం సృష్టించిన నందన దంపతులు.. ఇప్పుడు వీసా స్కామ్ ఆరోపణలు రావడం కలకలం రేపుతోంది. ఒక్కొక్కరి దగ్గర రూ.20 లక్షల వరకు తీసుకుని స్పాన్సర్షిప్ వీసా సర్టిఫికెట్ ఇప్పిస్తామంటూ మోసం చేశారంటూ ఇప్పుడీ దంపతులపై కేసు కూడా నమోదైంది. వర్క్ పర్మిట్ చేసే స్పాన్సర్షిప్ సర్టిఫికెట్ వీసా కోసం నందన ఫ్యామిలీకి డబ్బులిచ్చినట్లు బాధితుల ఆరోపణ. ఒక్కొక్కరి నుంచి 20 లక్షల వరకు వసూల్ చేసినట్లు, 50 మందికిపైగా బాధితులు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. వర్క్ పర్మిట్ వీసాలు ఇచ్చే ఐదారు కంపెనీల్లో తన భర్త కన్-సల్టెంట్ అని చెప్పి నందనే వసూళ్లు చేసినట్లు కూడా చెబుతున్నారు.

అయితే తన కుటుంబంపై వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదంటూ కొన్నిరోజుల కిందటే ఓ వీడియో పోస్ట్ చేసింది నందన. కానీ అందులో వీసా స్కామ్ విషయం గురించి మాత్రం ప్రస్తావించలేదు. అంతేకాదు లండన్‌లో తమ వ్యాపారాలు, తన భర్త నిర్వహించే కన్సల్టెన్సీ కంపెనీ వ్యవహారాలన్నింటిపై ఇండియాలో ఉన్న తన లాయర్ ద్వారా చెప్పించే ప్రయత్నం చేశారు.మరోవైపు మామిళ్లపల్లి శివకాంతి కుమార్ అనే వ్యక్తి ఇబ్రహీంపట్నం పీఎస్‌లో కేసు ఫైల్ చేశాడు. యూకేలో ఉన్న సమయంలో వీసా రెన్యూవల్ కోసం డబ్బులిచ్చానని, విడతల వారీగా సుమారు 15 లక్షలు ఇచ్చినట్లు కుమార్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

# అనంత లో వైకాపా నిరసన

అనంతపురం : అనంతపురంలో వైసీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన కార్యక్రమం జరిగింది. వైకాపా నేతలు మాట్లాడుతూ హామీల అమలులో టీడీపీ కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. నిరసనగా అనంతపురం లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట వైసీపీ ఆందోళన చేపట్టింది. వైసీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో నిరసన జరిగింది. సీఎం చంద్రబాబు హామీలపై ప్లకార్డులు, నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు.

## శంషాబాద్ ఎయిర్ పోర్టులో ప్రయాణికుడికి

# ఎబోలా వైరస్ లక్షణాలు

హైదరాబాద్ : శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఒక ప్రయాణికుడికి ఎబోలా వైరస్ లక్షణాలు కనిపించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. స్కానర్ ద్వారా గుర్తించి గాంధీ ఆసుపత్రిలోని ఐసోలేషన్ వార్డుకి పంపించారు. అతడినుంచి శాంపిల్ తీసి పూణే ల్యాబ్కు పంపినట్లు సమాచారం. ప్రయాణికుడు సూడాన్ నుండి వచ్చిన మొహమ్మద్గా గుర్తించారు.

# పోలీసుల వలలో గజదొంగ

సికింద్రాబాద్ : మల్కాజిగిరి జోన్ లో ఇటీవల జరిగిన దొంగ తనం కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసారు. డీసీపీ సీహెచ్ శ్రీధర్ మాట్లాడుతూ గత నెల 27న సందీప్ రఘునాథ్ చవాన్ ఇంట్లో దొంగతనం జరిగింది. రఘు నాథ్ చవాన్ సాయి జెవెల్లెర్ దుకాణంలో ఉద్యోగి. సుమారు 576గ్రాముల బంగారం చోరీ జరిగినట్లు పిర్యాదులో పేర్కొన్నాడు. నిందితుడు అంతరాష్ట్ర దొంగ ఢిల్లీకి చెందిన మనోజ్ సింగ్ అని గుర్తించాం. గోవాలో నిందితుడ్ని అరెస్ట్ చేసి అక్కడి కోర్టులో ప్రవేశ పెట్టి నగరానికి తీసుకు రావడం జరిగిందని అన్నారు. నిందితుడి నుండి 82లక్షల విలువైన 576గ్రాముల బంగారం, 900గ్రాముల వెండి ఆభరణాలు స్వాదీనం చేసుకున్నారు.నిందితుడి ప్రవృత్తి చోరీలు, జల్సాలు. దేశంలోని ప్రముఖ ప్రాంతాలను సందర్శించడం అలవాటు. ఇప్పటికే ఢిల్లీలో 19ఇళ్ల దోపిడీ కేసులలో నిందితుడుగా వున్నాడు.ఏ ఏడు క్రిమినల్ కేసులలో తీహార్ జైలు లో శిక్షను అనుభవించాడని అన్నారు. సీసీ కెమెరాలు తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై

# కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి

బద్వేలు : బద్వేల్, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయి సహాయకులు అప్రమత్తంగా వ్యవహరించాలని వైఎస్సార్ కడప జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎన్.డి. విజయజ్యోతి పిలుపునిచ్చారు. గురువారం బద్వేల్ ఆర్ ఒ బీ అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు మూలస్తంభమని పేర్కొంటూ, అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. అదే సమయంలో అనర్హుల పేర్లు, మరణించిన వారి పేర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లు, ఒకే వ్యక్తికి ఉన్న బహుళ ఓట్లను గుర్తించి తొలగించే ప్రక్రియలో అధికారులు నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని కోరారు.జూన్ 5 నుండి జూన్ 14 వరకు అధికారులు సన్నాహక కార్యక్రమాలు నిర్వహించనున్నారని, జూన్ 15 నుండి జూలై 14 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసి వివరాలు సేకరిస్తారని తెలిపారు. ఓటరు జాబితాలోని వివరాలను 2002 ఎన్నికల జాబితా మరియు కుటుంబ సభ్యుల వివరాలతో సరిపోల్చి పరిశీలించనున్నారని చెప్పారు.బద్వేల్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ బూత్ స్థాయి సహాయకులను నియమించాలని, ప్రతి బీఎల్ఏ రోజుకు కనీసం 50 దరఖాస్తులను బీఎల్ఓలకు అందజేసేలా కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా బీఎల్ఏలు రోజుకు 10 వరకు దరఖాస్తులను కూడా బీఎల్ఓలకు సమర్పించవచ్చని తెలిపారు.జిల్లా ఎన్నికల అధికారి జూలై 21న ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేస్తారని, జూలై 21 నుండి ఆగస్టు 20 వరకు క్లెయిమ్స్ మరియు అభ్యంతరాలను స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఇదే కాలంలో కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం-6 దరఖాస్తులను కూడా స్వీకరిస్తారని తెలిపారు.తుది ఓటరు జాబితా సెప్టెంబర్ 22న ప్రచురించబడుతుందని చెప్పారు. ఎన్నికల నమోదు అధికారి నిర్ణయంపై అసంతృప్తి ఉన్నవారు 15 రోజులలోపు జిల్లా మేజిస్ట్రేట్‌కు లేదా 30 రోజులలోపు అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి కు అప్పీల్ చేసుకోవచ్చని వివరించారు.ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించే దిశగా కాంగ్రెస్ పార్టీ నిరంతరం పర్యవేక్షణ చేస్తుందని ఎన్.డి. విజయజ్యోతి తెలిపారు.

# వెన్నుపోటుకు రెండేళ్లు

## - రుద్రవరంలో వైఎస్ఆర్సిపి భారీ నిరసన ర్యాలీ

రుద్రవరం : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినప్పటికీఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందంటూ రుద్రవరంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు నిరసన గళం విప్పారు. వైఎస్ఆర్సిపి అధినేత, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మరియు ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి (నాని) ఆదేశాల మేరకు ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన ర్యాలీలో స్థానిక వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున పాల్గొన్నారు. స్థానిక హైస్కూల్ నుండి అమ్మవారి శాల సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి, తమ నిరసనను వ్యక్తం చేశారు. "వెన్నుపోటుకు రెండేళ్లు" అంటూ నినాదాలు చేస్తూ కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మోసపూరితమైన హామీలను నమ్మి ప్రజలు ఓటు వేస్తే, అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు ఆ హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని గంధం రాఘవరెడ్డి ఆరోపించారు. ప్రభుత్వం ప్రజల ఆశలను ఆశలను అడియాసలు చేస్తోందని, ఇచ్చిన మాట నిలబెట్టుకోని ప్రభుత్వం కూలిపోక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు ప్రసాద్ రెడ్డి,, టి ఏ నరసింహారావు, హరి నారాయణ, డే గాని వెంకటేష్, జాకీర్ హుస్సేన్, పెద్దన్న,పాణ్యం చంద్ర, సవరం నాగ ముని, మాధవ, జయరాముడు, శూలం ప్రభాకర్, డిష్ భాస్కర్, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జలరవాణా మార్గాల్లో ఎలక్ట్రిక్ రివర్ మెట్రో

# పైలట్ ప్రాజెక్టులను ప్రారంభించండి

సెయింట్ పీటర్స్ బర్గ్ (రష్యా): రష్యాకు చెందిన ప్రముఖ బహుళజాతి పెట్టుబడి సంస్థ సిస్టమా ప్రెసిడెంట్ తాగిర్ సిట్‌దేకోవ్ తో ఏపీ విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సెయింట్ పీటర్స్ బర్గ్ లో భేటీ అయ్యారు.ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... భారత్ లో అంతర్గత జలరవాణా, స్మార్ట్ ఫ్లీట్ నిర్వహణ కోసం జాతీయ జలరవాణా మార్గాల్లో ఒక ఎలక్ట్రిక్ రివర్ మెట్రో పైలట్ ప్రాజెక్టును ప్రారంభించండి. ప్రధాన ఓడరేవుల్లో ఒకచోట అసెంబ్లింగ్ సదుపాయాలను ఏర్పాటుచేసే అవకాశాలను పరిశీలించండి. భారత్ లో పునరుత్పాదక ఇంధన లక్ష్యాలకు అనుగుణంగా భారీపరిశ్రమల అవసరాల కోసం గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియా పైలట్ ప్రాజెక్టును అభివృద్ధి చేయండి. భారత్ లోని ఇస్రో మౌలిక సదుపాయాల సమీపంలో రాబోయే హైటెక్ క్లస్టర్లలో ఒక జాయింట్ స్మాల్ శాటిలైట్, గ్రౌండ్ స్టేషన్ సదుపాయాన్ని నిర్మించండి. అటానమస్ సీ షిప్ యార్డు, తీరప్రాంత పర్యవేక్షణ కోసం ఏఐ విశ్లేషణలకు సహకారం అందించండి. భారతదేశం అంతటా స్మార్ట్ ఈవి చార్జింగ్ నెట్ వర్క్ లు, డేటా ప్లాట్ ఫారమ్ లను ఏర్పాటుచేయండి. దక్షిణ భారతదేశంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నిర్మాణరంగ మార్కెట్ లో సేవలు, ఆంధ్రప్రదేశ్ పోర్టుల ద్వారా వచ్చే ముడిసరుకు దిగుమతులను ఉపయోగించి సిమెంట్, వ్యవసాయ రంగాల కోసం కాగితపు ప్యాకేజింగ్ ఉత్పత్తుల తయారీ, లోకలైజేషన్ కు సహకరించండి.

# రాష్ట్రవ్యాప్తంగా "నవచేతన" బాల్యారంభ అభివృద్ధి స్క్రీనింగ్ కార్యక్రమం ప్రారంభం

## ప్రతి చిన్నారికి జీవితంలో అత్యుత్తమ ఆరంభాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యం

## తొలి 1,000 రోజులు చిన్నారి భవిష్యత్తును నిర్ణయించే స్వర్ణావకాశం : మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



అమరావతి : ప్రతి చిన్నారికి జీవితంలో అత్యుత్తమ ఆరంభాన్ని అందించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బాల్యారంభ అభివృద్ధి మరియు అభివృద్ధి స్క్రీనింగ్‌పై రాష్ట్రవ్యాప్త సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గర్భధారణ నుండి రెండేళ్ల వయస్సు వరకు ఉండే తొలి 1,000 రోజులు చిన్నారి జీవితంలో అత్యంత కీలకమైన కాలమని పేర్కొన్నారు. ఈ సమయంలో పిల్లల మెదడు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని, ప్రతి సెకనుకు దాదాపు 10 లక్షల న్యూరల్ కనెక్షన్లు ఏర్పడతాయని తెలిపారు. పిల్లల మెదడు అభివృద్ధిలో 80 శాతం మూడు సంవత్సరాల వయస్సులోపు, 90 శాతం ఆరు సంవత్సరాల వయస్సులోపు పూర్తవుతుందని వివరించారు.ప్రారంభ సంవత్సరాల్లో అందే పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, స్పందనాత్మక సంరక్షణ, ప్రారంభ అభ్యసన అవకాశాలు, భద్రత మరియు ప్రేరణ పిల్లల భవిష్యత్తు విద్య, ఆరోగ్యం, ఉత్పాదకత మరియు శ్రేయస్సుపై గణనీయమైన ప్రభావం చూపుతాయని మంత్రి గారు పేర్కొన్నారు.బాలల అభివృద్ధిలో ఆలస్యాలను ముందుగానే గుర్తించి సకాలంలో జోక్యాలు చేపట్టేందుకు స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ, వైద్య మరియు ఆరోగ్య శాఖతో సమన్వయంగా "నవచేతన" అనే మొబైల్ ఆధారిత అభివృద్ధి స్క్రీనింగ్ సాధనాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సాధనం 0 నుండి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లల అభివృద్ధిని అంచనా వేయడానికి ఉపయోగపడుతుందని చెప్పారు.నవచేతన వేదిక ద్వారా అంగన్వాడీ కార్యకర్తలు పిల్లలలో స్థూల చలన నైపుణ్యాలు, సూక్ష్మ చలన నైపుణ్యాలు, భాషా అభివృద్ధి, జ్ఞాన వికాసం మరియు సామాజిక-భావోద్వేగ అభివృద్ధి వంటి ఐదు ప్రధాన అభివృద్ధి రంగాలను వ్యవస్థీకృతంగా పరిశీలించగలరని తెలిపారు. దీని ద్వారా అదనపు మద్దతు లేదా ముందస్తు జోక్య సేవలు అవసరమయ్యే పిల్లలను త్వరగా గుర్తించవచ్చని చెప్పారు. రాష్ట్ర స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు జిల్లా అధికారులు, సీడీపీఓలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు మరియు ఆరోగ్య శాఖ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు.క్షేత్రస్థాయి సిబ్బందికి అభివృద్ధి మైలురాళ్ల ప్రాముఖ్యతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం, వయస్సుకు అనుగుణమైన స్క్రీనింగ్ నిర్వహించడం, అభివృద్ధి ఆలస్యాలు మరియు వైకల్యాలను గుర్తించడం, ముందస్తు రిఫరల్ మరియు జోక్యాలను ప్రోత్సహించడం, కుటుంబ స్థాయిలో పోషణాత్మక సంరక్షణ పద్ధతులను బలోపేతం చేయడం వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు.స్క్రీనింగ్ అనంతరం కుటుంబాలకు మద్దతుగా వాట్సాప్ సందేశాలు, వీడియోలు, ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్, అలాగే నెట్‌వర్క్ సౌకర్యం లేని ప్రాంతాల్లో ముద్రిత కౌన్సెలింగ్ మరియు కార్యాచరణ కార్డుల ద్వారా తల్లిదండ్రులకు వ్యక్తిగతీకరించిన మార్గదర్శకత్వం అందించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా తల్లిదండ్రులు ఇంటి వద్దనే స్పందనాత్మక సంరక్షణ, ఆటలు, సంభాషణ, పోషణ మరియు ప్రారంభ అభ్యసన కార్యక్రమాల ద్వారా పిల్లల అభివృద్ధికి మరింత సమర్థవంతంగా తోడ్పడగలరని తెలిపారు."ప్రతి చిన్నారి విలువైనవాడు" అనే నమ్మకంతో ప్రభుత్వం బాల్యారంభ అభివృద్ధిలో పెట్టుబడి పెడుతోందని, నవచేతన కార్యక్రమం ద్వారా అభివృద్ధి సంబంధిత సమస్యలు ఉన్న ఏ చిన్నారి కూడా గుర్తించబడకుండా మిగలకుండా చూడటమే లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు."పిల్లలే మన గొప్ప సంపద. తొలి 1,000 రోజులు జీవితంలో ఒక్కసారి మాత్రమే వస్తాయి. ఈ రోజు ముందస్తు గుర్తింపు, పోషణాత్మక సంరక్షణ మరియు తల్లిదండ్రుల సాధికారతలో పెట్టుబడి పెట్టడం ద్వారా ఆరోగ్యవంతమైన, బలమైన, అభివృద్ధి చెందిన స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి పునాది వేస్తున్నాము" అని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.

# వైద్య విజ్ఞానానికి వేదికగా 'అపోలో సర్జ్-2026'

## రోబోటిక్ సర్జరీ, ట్రాన్స్‌ప్లాంట్లపై నిపుణుల అవగాహన



చిత్తూరు : శస్త్రచికిత్స రంగంలో వేగంగా వస్తున్న సాంకేతిక మార్పులు, రోబోటిక్ సర్జరీలు, అవయవ మార్పిడి, లాపరోస్కోపిక్ విధానాలపై వైద్యులకు అవగాహన లక్ష్యంతో అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ లో నిర్వహించిన 'అపోలోసర్జ్-2026 - షార్పెనింగ్ సర్జికల్ మైండ్స్' నిరంతర వైద్య విద్యా కార్యక్రమం (సీఎంఈ) ఘనంగా జరిగింది. జనరల్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో దేశంలోని ప్రముఖ శస్త్రచికిత్స నిపుణులు పాల్గొని వైద్య విద్యార్థులు, అధ్యాపకులు, వైద్యులకు తాజా వైద్య పరిజ్ఞానాన్ని అందించారు.కార్యక్రమ ప్రారంభోత్సవంలో ది అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్. వినోద్ భట్, వైస్ ఛాన్సలర్ డిజిగ్నేట్ డాక్టర్ నితిన్ ఎం. నాగర్కర్, ఎఐఎంఎస్ఆర్ డీన్ డాక్టర్‌బ్లైడ్ జె. ఆగస్టీన్, అసోసియేట్ డీన్ (అకడమిక్స్) డాక్టర్ రమ్య రామకృష్ణన్, ఏపీఎంసీ అబ్జర్వర్ డాక్టర్ ఐ.వి. రామచంద్రరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ హెచ్. వినోద్ భట్ మాట్లాడుతూ అపోలో నాలెడ్జ్ సిటీ ఆవిర్భావం, అభివృద్ధి, వైద్య విద్యా రంగంలో సాధించిన పురోగతిని వివరించారు. ఆధునిక వైద్య విద్య, పరిశోధనలు, ఆరోగ్య సేవల విస్తరణలో అపోలో నాలెడ్జ్ సిటీ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. డాక్టర్ నితిన్ ఎం. నాగర్కర్ మాట్లాడుతూ వైద్య రంగంలో నిరంతర అభ్యాసం, పరిశోధనలు, నూతన సాంకేతికతల అనుసరణ అత్యంత అవసరమని పేర్కొన్నారు. వైద్యులు ఎప్పటికప్పుడు తమ జ్ఞానాన్ని, నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం ద్వారా రోగులకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించవచ్చని, తద్వారా చికిత్స ఫలితాలను మరింత మెరుగుపరచవచ్చని ఆయన అన్నారు.

సైంటిఫిక్ సెషన్లలో దేశంలోని ప్రముఖ శస్త్రచికిత్స నిపుణులు పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. అపోలో హాస్పిటల్స్ చెన్నైకి చెందిన డాక్టర్ రాజ్ పలనియప్పన్ రోబోటిక్ సర్జరీ సూత్రాలను వివరించగా, అపోలో ఇంద్రప్రస్థ హాస్పిటల్స్, న్యూఢిల్లీకి చెందిన ప్రముఖ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ అజయ్ కుమార్ శర్మ మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్సల్లో అనుసరించాల్సిన ఆధునిక విధానాలపై ప్రసంగించారు. అపోలో హాస్పిటల్ గ్రూప్ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ మురళీధరన్ ఎం. అక్యూట్ ప్యాంక్రియాటైటిస్‌లో తాజా చికిత్సా విధానాలను వివరించగా, తిరుపతి స్విమ్స్ రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ విజయలక్ష్మి ప్యాంక్రియాటైటిస్ నిర్ధారణలో ఇమేజింగ్ సాంకేతికతల పాత్రను వివరించారు. అపోలో హాస్పిటల్స్ చెన్నైకి చెందిన డాక్టర్ కుముద్ కుమార్ ధితాల్ గుండె మార్పిడి శస్త్రచికిత్సలలో తాజా పురోగతిని వివరించగా, డాక్టర్ మీరా రాఘవన్ రోబోటిక్ పెల్విక్ సర్జరీలో వస్తున్న మార్పులపై అవగాహన కల్పించారు. డాక్టర్ కలయరసన్ క్లిష్టమైన హెపాటో-బిలియరీ, ప్యాంక్రియాటిక్ శస్త్రచికిత్సలపై విశ్లేషణాత్మక ఉపన్యాసం అందించారు. మధ్యాహ్నం జరిగిన ప్యానెల్ చర్చలో డాక్టర్ వై. ముత్తేశ్వరయ్య (స్విమ్స్), డాక్టర్ కొండారెడ్డి (ఎఐఎంఎస్ఆర్), డాక్టర్ వై. రామకృష్ణ (ఎఐఎంఎస్ఆర్) పాల్గొని అబ్స్ట్రక్టివ్ జాండిస్ చికిత్సలో ఎదురవుతున్న సవాళ్లు, పరిష్కారాలపై చర్చించారు. అనంతరం పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల కేస్ ప్రెజెంటేషన్లు నిర్వహించగా, నిపుణులు విలువైన సూచనలు అందించారు. సాయంత్రం నిర్వహించిన లాపరోస్కోపిక్ ఎండోట్రైనర్ హ్యాండ్స్-ఆన్ స్కిల్ వర్క్‌షాప్ విశేష ఆకర్షణగా నిలిచింది. ఇందులో పాల్గొన్న యువ వైద్యులు ఆధునిక లాపరోస్కోపిక్ శస్త్రచికిత్సలపై ప్రత్యక్ష శిక్షణ పొందారు. కార్యక్రమంలో సదస్సు ఆర్గనైజింగ్ చైర్మన్, జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ వై. రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎన్. ఉదయ్ కుమార్, రాష్ట్రంలోని పలు వైద్య కళాశాలలు, ఆసుపత్రుల నుంచి వచ్చిన వైద్యులు, అధ్యాపకులు, పీజీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేశారు.

# అరుణాచలం బాలికపై గ్యాంగ్ రేప్

హైదరాబాద్ : అరుణాచల గిరి ప్రదక్షిణ బాటలో కేవలం ఒక రోజు వ్యవధిలోనే ఇద్దరు యువతులపై ఒకే దండగుల ముఠా అత్యంత అమానుషంగా సామూహిక అత్యాచారానికి పాల్పడింది. మే 30న ఒక వివాహితపై, ఆ మరుసటి రోజు మే 31న మరో 23 ఏళ్ల యువతిపై మారణాయుధాలతో దాడి చేసి, సమీపంలోని అటవీ ప్రాంతంలోకి లాక్కెళ్లి ఈ ఘాతుకానికి ఒడిగట్టారు. అంతటితో ఆగకుండా బాధితులను నగ్నంగా వీడియోలు తీసి, డబ్బుల కోసం బ్లాక్‌మెయిల్ చేయడం, నగలు దోచుకోవడం వంటి దారుణాలు భక్తుల భద్రత ఏ స్థాయిలో ఉందో అద్దం పడుతోంది. పోలీసులు ఈ కేసులో ఇప్పటివరకు 8 మందిని అరెస్ట్ చేసినప్పటికీ, పవిత్ర క్షేత్రంలో ఇలాంటి నేరాలు జరగడం తీవ్ర కలకలం రేపుతోంది.గడిచిన కొన్నేళ్లుగా అరుణాచలానికి వచ్చే భక్తుల సంఖ్య లక్షల కు చేరింది. ముఖ్యంగా ప్రతి పౌర్ణమికి గిరి ప్రదక్షిణ చేసేందుకు భక్తులు పోటెత్తుతున్నారు. అయితే, దానికి అనుగుణంగా స్థానిక యంత్రాంగం మౌలిక వసతులు కానీ, సీసీటీవీ కెమెరాల నిఘా కానీ, తగినంత పోలీసు బలగాలను కానీ ఏర్పాటు చేయడంలో పూర్తిగా విఫలమైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 14 కిలోమీటర్ల పొడవైన గిరి ప్రదక్షిణ మార్గంలో కొన్ని ప్రాంతాలు, బైపాస్ రోడ్లు రాత్రి వేళల్లో పూర్తి చీకటి మయంగా మారుతున్నాయి. ఈ అంధకారాన్నే ఆసరాగా చేసుకుని స్థానిక జులాయిలు, గంజాయి ముఠాలు భక్తులను టార్గెట్ చేస్తున్నాయి. అరుణాచలానికి వచ్చే భక్తులలో అత్యధిక శాతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక వంటి ఇతర రాష్ట్రాల నుంచే వస్తున్నారు. స్థానిక భాష రాకపోవడం ఇతర రాష్ట్రాల భక్తులకు ఒక పెద్ద శాపంగా మారుతోంది. గిరి ప్రదక్షిణ దారిలో ఆటో డ్రైవర్లు, లాడ్జీల నిర్వాహకులు, చిరువ్యాపారులు భక్తులను నిలువునా దోచుకుంటున్నా ప్రశ్నించే నాథుడు కరువయ్యాడు. భాషా సమస్య వల్ల భక్తులు ఏదైనా ఆపద వస్తే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడానికి కూడా వెనుకాడాల్సి వస్తోంది. ఇతర రాష్ట్రాల యాత్రికుల పట్ల స్థానిక సిబ్బంది చూపే ఉపేక్షా భావం వల్లే నేరస్థులకు మరింత ధైర్యం పెరుగుతోందనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి.

**ప్రభుత్వం అలర్ట్ - సీఎం విజయ్ కఠిన ఆదేశాలు**

ఈ అమానుష ఘటనలపై తమిళనాడు వ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తమవడంతో నూతన ముఖ్యమంత్రి విజయ్ తీవ్రంగా స్పందించారు. అరుణాచలం ఘటనపై ఉన్నత స్థాయి నివేదిక కోరిన సీఎం, నిందితులపై కఠిన చట్టాల కింద చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళల రక్షణ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తూ.. గిరి ప్రదక్షిణ మార్గమంతటా అదనపు పోలీసు బలగాలతో అవుట్ పోస్టులను, నిరంతర పెట్రోలింగ్‌ను ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు.భక్తిభావంతో వచ్చే లక్షలాది మంది యాత్రికుల నమ్మకాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కేవలం పౌర్ణమి రోజుల్లోనే కాకుండా నిరంతరం గిరి ప్రదక్షిణ దారి పొడవునా హై-రిజల్యూషన్ సీసీ కెమెరాలు, రాత్రి వేళల్లో హైమాస్ట్ లైట్లు, నిరంతర రౌండ్-ది-క్లాక్ పోలీసు నిఘా ఉంచితేనే భవిష్యత్తులో ఇలాంటి దారుణాలు పునరావృతం కాకుండా అడ్డుకోగలరు.

## ప్రజా భాగస్వామ్యంతో

# గ్రామాభివృద్ధికి కార్యాచరణ

## - జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల : గ్రామ ప్రగతి, అభివృద్ధి పై చర్చించుకోవడానికి ప్రత్యేక గ్రామ సభలు దోహద పడతాయని ప్రజల భాగస్వామ్యంతో గ్రామ అభివృద్ధికి కార్యాచరణ, ప్రణాళిక రూపొందించవచ్చని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కోనరావుపేట మండలం మర్రిమడ్ల గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వర్షాకాల సన్నద్ధత, పంట మార్పిడి వ్యవసాయ, ఉద్యానవన శాఖల కార్యాచరణ ప్రణాళిక, బడి బాట, ఘన వ్యర్థాల నిర్వహణ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, విపత్తుల నిర్వహణ, పారిశుద్ధ్యం, మొక్కల పెంపకం, జల సంరక్షణ, అరైవ్-అలైవ్ తదితర అంశాలపై గ్రామ ప్రజలతో సుదీర్ఘంగా చర్చించి అవగాహన కల్పించారు. తమ మండల, గ్రామాల్లో ఉన్న అధికారులు శాఖల వారీగా ఏయే కార్యక్రమాలు చేపడుతున్నారు అనే విషయాలపై సంపూర్ణ అవగాహన ప్రజలు కలిగి ఉండాలని అన్నారు. వర్షాకాల సన్నద్ధతపై అధికారులు సూచించిన విషయాలను ప్రజలు పాటించాలని కలెక్టర్ అన్నారు. వర్షాకాలానికి ముందే గ్రామాల్లోని డ్రైనేజీలు శుభ్రం చేయడం గ్రామ పంచాయితీ బాధ్యత అని తెలిపారు. డ్రైనేజీల్లో ప్లాస్టిక్, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయవద్దని కోరారు. ఘన వ్యర్థాల నిర్వహణ -2026 పై ప్రజలు ఖచ్చితంగా అవగాహన కలిగి ఉండాలని, చెత్తను నాలుగు రకాలుగా వేరు చేయాలని సూచించారు. తడి, పొడి, సానిటరీ, ప్రత్యేక చెత్త గా వేరు చేసి గ్రామ పంచాయితీ వాహనానికి అందించాలని అన్నారు.సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్వహణపై అవగాహన పొందాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతీ వార్డులో చెత్తను వేరు చేసి కంపోస్ట్ షెడ్ కు తరలించే బాధ్యత ప్రతీ వార్డు సభ్యులు తీసుకోవాలని సూచించారు. మన ఆరోగ్యం పాడవకుండా ఉండాలంటే స్వచ్ఛందంగా ఈ సూచనలు పాటించాలని కలెకర్ పేర్కొన్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించి క్రమం తప్పకుండా నీటి ట్యాంకులను బ్లీచింగ్ తో సిబ్బంది శుభ్రం చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు రాకుండా స్వచ్ఛమైన నీటి సరఫరా అందించే బాధ్యత అధికారులపై ఉంటుందని, నీటి సరఫరా, నిర్వహణ సక్రమంగా లేకపోతే ప్రజలు అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. పంటల వైవిధ్యంపై రైతులు వ్యవసాయ అధికారులు అందించే సలహాలు, సూచనలు పాటించాలని , ఎల్నినో ప్రభావం దృష్ట్యా పంటలు సాగు చేసేముందు వ్యవసాయ అధికారులను సంప్రదించి, ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తే ఇబ్బందులు కలగకుండా ఉంటుందని అన్నారు. ఆయిల్ పామ్, కూరగాయలు, పత్తి, తదితర లాభదాయక పంటలను సాగు చేయడానికి రైతులు ముందుకు రావాలని సూచించారు. ఆయిల్ పామ్ కు సంబంధించి సిద్దిపేట జిల్లా నర్మెట లో పరిశ్రమ ఉందని, పండించిన దిగుబడిని పరిశ్రమకు తీసుకువెళ్ళడానికి దూర భారం కూడా లేదని గుర్తు చేశారు. ఆయిల్ పామ్ సాగు చేయడానికి మొక్కలకు, డ్రిప్ కు సబ్సిడీ కూడా అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో అంతర పంటలను సాగు చేసేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. వరిలో సన్న వడ్లను సాగు చేస్తే బోనస్ అందించడం జరుగుతుందని, సన్న వడ్ల సాగుపై రైతులు దృష్టి సారించాలని కోరారు. పంట మార్పిడి చేయకపోతే నేల సారం తగ్గుతుందనే విషయాన్ని రైతులు గమనించాలని పేర్కొన్నారు. అరైవ్ - అలైవ్ లో భాగంగా రోడ్డు భద్రతపై అందరికీ అవగాహన కల్పించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాల సంఖ్య నియంత్రించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ద్విచక్రవాహనం నడిపే ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని అన్నారు. ప్రతీ నెల రోడ్డు భద్రత సమావేశాలు నిర్వహించి, రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి అవసరమయ్యే చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వచ్చి వివరాలు సేకరించే బీఎల్ఓ లకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శాల మేరకు ఈ ఈ నెల 25 వ తేదీ నుండి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. గుర్తింపు కార్డులు చూపించి మ్యాపింగ్ ప్రక్రియకు సహకరించాలని కోరారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 12 వ తేదీ వరకు పర్యావరణ అంశాలపై కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచాలని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు పంపించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ప్రభుత్వం అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని తెలిపారు. అనంతరం గ్రామంలోని నర్సరీ, కంపోస్ట్ షెడ్‌ను కలెక్టర్ పరిశీలించారు. లక్ష్యానికి అనుగుణంగా మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని సూచించారు. కంపోస్ట్ షెడ్‌ను పూర్తిగా వినియోగంలోకి తీసుకువచ్చి చెత్తను తప్పనిసరిగా నాలుగు విభాగాలుగా వేరు చేసి శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వేములవాడ ఆర్డీఓ కె.ఎస్.బి కుమారి, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి లక్ష్మీనారాయణ, వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, పంచాయతీ అధికారి షర్ఫుద్దీన్, మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ అన్వర్, ఇంట్రా ఈఈ సుమలత, జిల్లా వైద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, సర్పంచ్ స్వాతి, తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీఓ స్నిగ్ధ, అటవీ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మెట్రో సిటీటైమ్స్ METRO CITY TIMES శనివారం, జూన్ 6, 2026

## విద్యుత్ షాక్ తో లైన్ మెన్ మృతి

విజయనగరం : గరివిడి మండలం, బొండపల్లి గ్రామంలో వీచిన గాలి వర్షాలకు బొండపల్లిలో కరెంట్ బ్రేక్ డౌన్ అయ్యింది. బొండపల్లి గ్రామంలో విలేజ్ ఎలక్ట్రికల్ వర్క్ వర్కర్ గా పనిచేస్తున్న లోచర్ల సాయిబాబు బ్రేక్ డౌన్ వర్క్ లో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తువిద్యుత్ షాక్ తగిలింది.. వెంటనే రాజా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే లోచర్ల సాయి మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. బొండపల్లి గ్రామంలో20 సంవత్సరాలుగా విధులు నిర్వహి స్తున్న డు. మృతుడు స్థానిక బొండపల్లి గ్రామ నివాసి కావడంతో బొండపల్లి గ్రామంలో విషాదశాలు అలుముకున్నాయి.

## నందిగామ బైపాస్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

రంగారెడ్డి : షాద్ నగర్ నియోజక వర్గం నందిగామ బైపాస్ రోడ్డులోని గాయత్రి మిల్క్ ప్లాంట్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. టాటా నెక్సాన్ కారు, హీరో స్ప్లెండర్ మోటార్ సైకిలను ఢీ కొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులను రోషన్ కుమార్ (24), కొత్తూర్ పట్టణ నివాసి, బీహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా, అలాగే పంకజ్ (19), నందిగామ పట్టణంలో నివాసం ఉంటున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఇద్దరూ నందిగామ పట్టణంలోని ఎస్ఎన్ పాలీ ప్యాక్ కంపెనీలో కార్మికులుగా పనిచేస్తున్నట్లు సమాచారం. ప్రమాదం అనంతరం కారు డ్రైవర్ ఘటన స్థలం నుంచి పరారైనట్లు తెలిసింది.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సీహెచ్‌సీ షాద్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు..

## ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైకు

### - ఒకరు మృతి మరొకరికి గాయాలు

ఫరూఖ్ నగర్ మండలం పరిధిలో లింగారెడ్డి గూడా వద్ద ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొన్న సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు షాద్ నగర్ వైపు వెళుతున్న లారీ రిపేర్ కారణంగా రహదారి పక్కన నిలపడంతో షాద్ నగర్ వైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఆగి ఉన్న లారీని ఢీకొట్టగా ఈ ప్రమాదంలో నందిగామ మండలం అప్పరెడ్డిగూడా గూడా గ్రామాన్నికి చెందిన చిన్నంత్ర గారి కార్తీక్ (20) అక్కడికక్కడే మృతి చెందాగా మరో వ్యక్తి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న షాద్ నగర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు..

## అమీర్ పేట్ మెయిన్ రోడ్డులో భారీ అగ్ని ప్రమాదం

హైదరాబాద్ : సిటీ నడిబొడ్డు అమీర్ పేట్ మెయిన్ రోడ్డులో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. మైత్రీవనం సమీపంలో మెయిన్ రోడ్డుపైనే ఉన్న కేఎస్ఆర్ ఫ్యాషన్స్ బట్టల దుకాణం ఉన్న బిల్డింగ్ మొత్తం మంటలు వ్యాపించాయి. బిల్డింగ్ మొత్తం నిలువెల్లా తగలబడిపోతుంది. భగభగ మండే మంటలతో దగ్గరకు వెళ్లటానికి సైతం సాహసించలేకపోతున్నారు స్థానికులు. బిల్డింగ్ మొత్తం మంటల్లో కాలిపోతున్న విజువల్స్ చుట్టు పక్కల వాళ్లను భయాందోళనలకు గురి చేస్తుంది.మూడు అంతస్తుల ఈ బిల్డింగ్ మొత్తం కాలిబూడిద అవుతుంది. ఈ బిల్డింగ్ చుట్టూ హోటళ్లు, రెస్టారెంట్లు, కంప్యూటర్ షాపులు, సెల్ ఫోన్ షాపులు ఇలా చాలా షాపులు ఉన్నాయి. మండే ఎండలకు మంటలు చుట్టుపక్కల ఉన్న షాపులకు వ్యాపిస్తున్నాయి. మంటల ధాటికి చుట్టుపక్కల ఉన్న వ్యాపారులు అందరూ వారి వారి షాపుల్లోని విలువైన వస్తువులను బయటకు తీసుకొచ్చి..అక్కడి నుంచి పరుగులు తీస్తున్నారు.విషయం తెలిసిన వెంటనే ఫైర్ సిబ్బంది, పోలీసులు స్పాట్ కు చేరుకున్నారు. చుట్టుపక్కల ప్రాంతాలకు మంటలు వ్యాపించకుండా చర్యలు..!విలువైన వస్తువులను బయటకు తీసుకొచ్చి.. అక్కడి నుంచి పరుగులు తీస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే ఫైర్ సిబ్బంది, పోలీసులు స్పాట్ కు చేరుకున్నారు. చుట్టుపక్కల ప్రాంతాలకు మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకుంటున్నారు. మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. కేఎస్ఆర్ ఫ్యాషన్స్ షాపులో అన్నీ దుస్తులు కావటంతో మంటల స్థాయిలో తీవ్రంగా ఉందంటున్నారు అధికారులు..

## జైలులో బాల్క సుమన్ ను పరామర్శించిన కేటీఆర్

హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ములాకత్లో భాగంగా చంచల్గూడ జైలుకు చేరుకున్నారు. జైలులో వున్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ను పరామర్శించారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, సుధీర్ రెడ్డి తదితరులున్నారు. బాల్క సుమన్ అరెస్ట్ వ్యవహారంపై బీఆర్ఎస్ నేతలు ఆరా తీసారు. జైలులో బాల్క సుమన్తో కేటీఆర్ భేటీ అయ్యారు. బాల్క సుమన్కు బీఆర్ఎస్ పార్టీ సంఘీభావాన్ని కేటీఆర్ తెలిపారు. చంచల్గూడ జైలు వద్ద బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సందడి నెలకొంది.

## మియాపూర్ న్యూ కాలనీ వద్ద ఆక్రమణల తొలగింపు

రంగారెడ్డి : మియాపూర్ న్యూ కాలనీ దగ్గర ఆక్రమణలను సీఎంసీ అధికారులు తొలగించారు. రోడ్డు పక్కనే ఉన్న పర్నిచర్ షాప్ లను,గుడిసేలను తోలగించారు. ఎటువంటి ఉద్రిక్తతలు చోటు చేసుకోకుండా భారీ పోలీస్ బందోబస్తు మధ్య ఆక్రమణలను తోలగించారు. తమకు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా షాపులను తోలగించడం ఏంటని పర్నిచర్ షాప్ నిర్వహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల మియాపూర్ లో పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు.

## అమీర్‌పేటలో షాపింగ్ కాంప్లెక్స్‌కు మంటలు

### ఫైర్ సిబ్బందితో కలసి మంటలనార్పిన హైడ్రా డీఆర్ ఎఫ్ బృందాలు

హైదరాబాద్: అమీర్‌పేటలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో చెలరేగిన మంటలను ఫైర్ సిబ్బందితో కలిసి హైడ్రా డీఆర్ ఎఫ్ బృందాలు అదుపులోకి తెచ్చాయి. పక్కనే ఉన్న దుకాణాలకు, ఇతర భవనాలకు మంటలు వ్యాపించకుండా నియంత్రించాయి. అమీర్‌పేట నుంచి ఎస్ ఆర్ నగర్ వెళ్తున్న మార్గంలో మెట్రో పిల్లర్ నంబరు 1043 సమీపంలో ఉన్న రెండంతస్తుల షాపింగ్ కాంప్లెక్స్‌లో మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో మంటలు చెలరేగాయి. హైడ్రా కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు అందగానే.. అదే సమాచారం క్షేత్రస్థాయిలో ఉన్న డీఆర్ ఎఫ్ బృందాలకు పంపారు. వెంటనే అక్కడకు చేరుకుని.. ఫైర్ సిబ్బందితో కలిసి మంటలనార్పే పనుల్లో డీఆర్ ఎఫ్ బృందాలు నిమగ్నమయ్యాయి. వెనుక వైపు ఉన్న మెస్‌తో పాటు.. పక్కనే ఉన్న దుకాణాలకు మంటలు వ్యాపించకుండా ఫైర్ ఇంజిన్లు మంటలార్పాయి. హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆర్ ఎఫ్ వో జయప్రకాష్‌తో పాటు ఎస్ ఎఫ్ వో చంద్రశేఖర్, డీఆర్ ఎఫ్ సభ్యులు 20 మంది మంటలను ఆదుపు చేసిన వారిలో ఉన్నారు.

## యువత భవిష్యత్తుతో రాజకీయాలు చేస్తే సహించం

### పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

పెద్దపల్లి : తెలంగాణ యువత ఒక్క విషయం స్పష్టంగా గమనించాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వంటి నాయకుల మాటలు నమ్మి యువత తమ భవిష్యత్తును ప్రమాదంలో పడేసుకోవద్దని సూచించారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల విషయంలో తీవ్ర అన్యాయం జరిగిందని, తెలంగాణ ప్రజలు ఆ పాలనను దగ్గర నుంచి చూశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి ఏడాదిలోనే సుమారు 50 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేసి, పారదర్శకంగా నియామకాలు చేపట్టిందని తెలిపారు.యువతకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, ముఖ్యంగా మంత్రి వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా అమలు అవుతున్నాయని పేర్కొన్నారు.

# మళ్లీ నీట్ రాయలేను

భోపాల్ : ఎంతో ప్రతిష్టాత్మకమైన నీట్ పరీక్షా పేపర్ లీక్ కావడంతో పలువురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే.. తాజాగా మరో విద్యార్థిని కూడా ప్రాణాలు తీసుకుంది. ఎంతో కష్టపడి పరీక్ష రాస్తే, లీక్ కారణంగా అది రద్దు అయితే.. మళ్లీ పరీక్ష రాయాల్సి వస్తుందనే ఒత్తిడితో మధ్యప్రదేశ్‌కి చెందిన ఆకాంక్ష అనే 18 ఏళ్ల విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటనపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ఎక్స్ వేదికగా పోస్ట్ చేస్తూ.. 'ఆకాంక్ష డాక్టర్ అయ్యి, దేశానికి, సమాజానికి సేవ చేయాలనుకుంది. ఆకాంక్ష తండ్రి ఒక రైతు. తన కూతురు డాక్టర్ కావాలనే కలను నెరవేర్చడానికి, ఆయన కిసాన్ క్రెడిట్ కార్డ్ మీద రూ.3 లక్షల రుణం తీసుకున్నారు. అంతేకాదు, తన కూతురు అక్కడ కోచింగ్‌కు వెళ్లడం కోసం నాగ్‌పూర్‌లో వంటవాడిగా కూడా పనిచేశారు. ఒక తండ్రిగా ఆయన చేయగలిగినదంతా చేశారు. ఆ తర్వాత నీట్ పేపర్ లీక్ అయింది. పరీక్ష రద్దయింది. ఆ అనిశ్చితిలోనే ఆకాంక్ష మనల్ని శాశ్వతంగా విడిచి వెళ్లిపోయింది. ఆకాంక్ష మరణం ఆత్మహత్య కాదు, అది మోదీజీ హయాంలోని అవినీతిమయమైన, విచ్ఛిన్నమైన వ్యవస్థ పర్యవసానం. ఇక ధర్మేంద్ర ప్రధాన్ జీ విషయానికొస్తే ఆయన ఈనాటికీ అదే కుర్చీలో ఉన్నారు. అదే కమిటీ. అవే బదిలీలు. అవే విచారణలు. సంస్కరణలు లేవు, న్యాయం లేదు. మోదీ జీ.. అధికారం శాశ్వతం కాదు. అది వస్తూ పోతూ ఉంటుంది. కానీ మీరు 12 ఏళ్లలో విద్యా వ్యవస్థను ఎంతగా నాశనం చేశారంటే, భారతదేశంలోని యువతరం మొత్తం దాని మూల్యం చెల్లిస్తోంది.' అని తీవ్రంగా విమర్శించారు.

**కన్నీళ్లు పెట్టిస్తున్న సూసైడ్ నోట్..**

మధ్యప్రదేశ్‌లోని మౌగంజ్ జిల్లా మగనియా గ్రామానికి చెందిన ఆకాంక్ష నాగ్‌పూర్‌లోని ఒక కోచింగ్ సెంటర్‌లో నీట్ పరీక్షకు కోచింగ్ తీసుకుంది. మే 3న నీట్ పరీక్ష రాసింది. 650 మార్కులు వస్తాయని ధీమాగా ఉంది. కానీ పేపర్ లీక్‌తో నీట్ పరీక్షను రద్దు కావడంతో మే 20న తన గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అయితే ఆలస్యంగా ఆమె చేతిరాతతో ఉన్న సూసైడ్ నోట్ తాజాగా బయటపడింది. "అమ్మా నాన్నా.. మీరు నా మీద ఎంతో నమ్మకం ఉంచారు. నేను డాక్టర్ అవుతానని ఆశించారు. కానీ మళ్లీ నీట్ పరీక్ష రాసే ధైర్యం నాకు లేదు. మొదటిసారి పరీక్షలో నాకు మంచి మార్కులు వచ్చేవి. కానీ ఇప్పుడు మళ్లీ అంత మంచి మార్కులు వస్తాయన్న నమ్మకం లేదు. నన్ను క్షమించండి, నేను అంతా పాడు చేశాను' అని ఆకాంక్ష తన చావుకి కారణాన్ని తెలిపింది. ఆకాంక్ష తండ్రి కృష్ణ కుమార్ చౌబే వ్యవసాయ కూలీ. కూతురు చదువు కోసం కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా సుమారు రూ.3 లక్షల అప్పు తీసుకున్నారు. కోచింగ్ ఖర్చులు భరించడానికి నాగ్‌పూర్‌లో వంటవాడిగా పని చేశారు. బంధువుల నుంచి కూడా ఆర్థిక సహాయం కూడా తీసుకున్నారు. ఒక తండ్రిగా తన కూతురి భవిష్యత్తు కోసం ఇంత చేసినా సిస్టమ్ విఫలం అవ్వడంతో ఆ తండ్రికి కడుపు కోతే మిగిలింది. కాగా పేపర్ లీక్ తర్వాత ఆకాంక్ష తినడం మానేసి, మాట్లాడడం తగ్గించి తీవ్ర ఆందోళనలో ఉండేదని కుటుంబ సభ్యులు తెలిపారు.

## మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యాబోధన ఆవశ్యకత

### మండల విద్యాశాఖాధికారులు ఎండీ. ఖాసిం, వై. శ్రీనివాసరావు

పిడుగురాళ్ల : మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా బోధన చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని పిడుగురాళ్ల మండల విద్యాశాఖ అధికారి ఎండీ. ఖాసీం అన్నారు. పిడుగురాళ్ల మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మూడవ సంవత్సరం జ్ఞాన ప్రకాష్ ఒకటి, రెండవ తరగతి బోధించే ఉపాధ్యాయులకు, మెగా డీఎస్సీ ద్వారా ఎంపిక కాబడిన ఉపాధ్యాయులకు ది. 04-06-2026 నుండి 9వ తేదీ వరకు జరుగు పునాది అన్నారు. అక్షరాస్యత సంఖ్యా జ్ఞానం (ఎఫ్ ఎల్ ఎన్ ) కింద 60 రోజుల సర్టిఫికెట్ కోర్స్ అమల్లో భాగంగా శిక్షణా కార్యక్రమం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలకు అనేక సౌకర్యాలు కల్పించడంతో పాటు మెగా డీఎస్సీ 2025 ద్వారా పల్నాడు ప్రాంతంలో అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయ నియమాలు చేపట్టటం జరిగిందని అన్నారు. ఉపాధ్యాయులు ఇక్కడ నేర్చుకున్న జ్ఞానాన్ని తమ తమ పాఠశాలలో అమలుపరిచి, తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలంటే నమ్మకం ఏర్పడే విధంగా బోధించి, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వనీ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అందిస్తున్న ఉచిత సౌకర్యాలు, సదుపాయాలను తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. శిక్షణకు సమయపాలన ఎంతో అవసరమని అన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న మరొక మండల విద్యాశాఖ అధికారి వై. శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను 100% ఉపాధ్యాయులు వినియోగించుకోవాలన్నారు. పిడుగురాళ్ల పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె. మల్లికార్జునరావు మాట్లాడుతూ, ఉపాధ్యాయులు కార్యాచరణ ఆధారిత, భాగస్వామ్య, ఆటలాధారిత బోధనా పద్ధతులను అనుసరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కె ఆర్ పీలు దాసరి లూర్దు మేరీ, డిఆర్పీలు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే సురక్షిత సమాజ నిర్మాణం సాధ్యం

- రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్, రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలి
- గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీ సభ్యులు గ్రామంలో ఉన్న బ్లాక్ స్పాట్స్ గుర్తించి నివరణకు కృషి చేయలి
- మాధకద్రవ్యాల నిర్ములనలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలి
- తంగళ్ళపల్లి మండలం తడూర్ గ్రామ సభలో పాల్గొన్న జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే



రాజన్న సిరిసిల్ల : ప్రజల భాగస్వామ్యంతోనే సురక్షితమైన, శాంతియుతమైన సమాజ నిర్మాణం సాధ్యమని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా తంగళ్ళపల్లి మండలం తడూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామ సభకు జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా గ్రామస్తులతో ముచ్చటించి వారి సమస్యలు తెలుసుకొని పలు సూచనలను చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...రోడ్డు భద్రత మన అందరి బాధ్యత అని రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు ట్రాఫిక్‌డరోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నరు. వాహనదారులు తమ స్వీయారక్షణార్థం,కుటుంబ క్షేమం కొసం తప్పని సరిగా హెల్మెట్ సిట్ బెల్ట్ ధరించాలన్నారు.మద్యం సేవించి వాహనాలు నపడం, ర్యాష్ డ్రైవింగ్,రాంగ్ రూట్ డ్రైవింగ్ చేయవద్దని,మైనర్ డ్రైవింగ్ పట్ల కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీలు గ్రామాల్లో ఉన్న రహదారి భద్రతా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో ఉన్న ప్రధాన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీల పాత్ర కీలకమని తెలిపారు. మహిళలు, యువతులు, బాలికలు జిల్లా షి టీమ్ సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్కూల్, కాలేజ్,పని చేసే ప్రదేశాల్లో మహిళలు విద్యార్థినులు ఏమైనా ఇబ్బందులు ఎదురుకుంటే నిర్భయంగా షి టీమ్ నంబర్ 87126 56425 నంబర్ ని సంప్రదించాలని సూచించారు.భరోసా కేంద్రం ద్వారా లీగల్, వైద్య సహాయం, మానసిక కౌన్సెలింగ్ సేవలు అందిస్తారని తెలిపారు.మాదక ద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు.మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రజలు పోలీసు శాఖకు సహకరిస్తు మాధకద్రవ్యాల నిర్ములనలో భాగస్వామ్యం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో డిఎస్పీ నాగేంద్రచారి, సిఐ నాగేశ్వరరావు, ఎస్ఐ ఉపేందర్ చారి, వివిధ శాఖల అధికారులు,గ్రామ సర్పంచ్, ప్రజలు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు, తరలింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

### అపరెల్ పార్క్, గోదాముల్లో ధాన్యానికి అనుగుణంగా హమాలీల సంఖ్యను పెంచాలి

### జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ - ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్ సమీక్ష

రాజన్న సిరిసిల్ల : జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు, తరలింపుపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లు, అన్ లోడింగ్, వాహనాలు, ఇతర అంశాలపై పౌర సరఫరాల శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, సహకార శాఖ, మెప్మా, రవాణా శాఖ, వ్యవసాయ శాఖ, తదితర శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి గురువారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, హమాలీల సంఖ్య, గన్ని సంచులు, ఇప్పటివరకు ఎన్ని కొనుగోలు కేంద్రాలు మూసి వేశారు.. తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. అపరెల్ పార్క్, గోదాముల్లో ధాన్యానికి అనుగుణంగా హమాలీల సంఖ్యను పెంచాలని సూచించారు. కొనుగోళ్ల ప్రక్రియలో వేగం పెంచాలని ఆదేశించారు. కొనుగోళ్లు తుది దశకు చేరిన కేంద్రాల నుంచి హమాలీలు, వాహనాలను ఇతర కేంద్రాలకు తరలించాలని సూచించారు. ధాన్యానికి అనుగుణంగా ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు వాహనాలు సమకూర్చాలని ఆదేశించారు. ప్రణాళిక ప్రకారం ధాన్యం కొనుగోలు, తరలింపు, అన్ లోడింగ్ ప్రక్రియ వేగవంతంగా చేయాలని, అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.

## కూటమి ప్రభుత్వం హామీలను ఇవ్వడంలో విఫలమైంది

### - మండల కన్వీనర్ ప్రహ్లాద చారి

కౌతాళం : కూటమి ప్రభుత్వం అధికారం లో వచ్చి రెండేళ్లు పూర్తయినప్పటికీ రాష్టంలో అభివృద్ధి పనులు కనిపించడం లేదని ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందని మండల కన్వీనర్ ప్రహ్లాద చారి పేర్కొన్నారు. బాబు రెండేళ్ల వెన్నుపోటు కార్యక్రమమును భారీ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్య కార్యక్రమం నిర్వహించామని తెలిపారు.టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ సంతకాలతో విడుదలైన హామీ పత్రాలు మరియు సంబంధిత పత్రికా ప్రకటనల పత్రాలను దహనం చేశారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలకు భారీ హామీలు ఇచ్చినప్పటికీ, వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని ఎన్నికల మేనిఫెస్టోను పక్కన పెట్టారని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ప్రహ్లాద్ ఆచారి,వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి ,కౌతాళం సర్పంచ్ పాల్ దినకర్,మాజీ సర్పంచ్ అవతారం,గ్రామ సర్పంచ్లు ,ఎంపీటీసీ లు,గ్రామ స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.

## సస్పెన్షన్‌లో ఉన్న అదనపు ఎస్పీకి ఏసీబీ షాక్

హైదరాబాద్ : తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ ఏసీబీ చేపట్టిన కీలక దాడుల్లో మరో ఉన్నతాధికారి అక్రమాస్తుల కేసులో చిక్కుకున్నారు. ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న తెలంగాణ అదనపు పోలీసు సూపరింటెండెంట్ ఏఎస్పీ నాయిని భుజంగ రావుపై ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టిన ఆరోపణలతో ఏసీబీ కేసు నమోదు చేసింది. సేవా కాలంలో అవినీతి చర్యలు, అనుమానాస్పద మార్గాల ద్వారా భారీగా ఆస్తులు సంపాదించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలడంతో ఈ కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.ఏసీబీ విడుదల చేసిన ప్రెస్‌నోట్ ప్రకారం,నాయిని భుజంగరావు తనకు తెలిసిన ఆదాయ వనరులకు మించి భారీ స్థాయిలో ఆస్తులు కూడబెట్టినట్లు సమాచారం అందడంతో అధికారులు విచారణ ప్రారంభించారు. ప్రాథమిక ఆధారాలు లభించడంతో అవినీతి నిరోధక చట్టం, 1988-2018 సవరణల ప్రకారం సెక్షన్ 13(1)(బి), 13(2) కింద కేసు నమోదు చేశారు.ఈ కేసులో భాగంగా జూన్ 3న ఏసీబీ అధికారులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంతో పాటు బంధువులు, బినామీలు, అనుబంధ వ్యక్తులకు చెందిన మొత్తం 15 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో భారీ స్థాయిలో ఆస్తుల పత్రాలు, నగదు, బంగారం మరియు ఇతర విలువైన వస్తువులు బయటపడినట్లు అధికారులు పేర్కొన్నారు.సోదాల్లో సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో 27.29 ఎకరాల వ్యవసాయ భూములకు సంబంధించిన పత్రాలు, ఐదు ఓపెన్ ప్లాట్లు, రెండు ఇళ్లు, అలాగే హైదరాబాద్‌లో ఒక వాణిజ్య భవనం ఉన్నట్లు గుర్తించారు.అదనంగా రూ.3.83 లక్షల నగదు, రూ.8 లక్షల బ్యాంక్ నిల్వలు, దాదాపు ఒక కిలో బంగారు ఆభరణాలు లభించినట్లు ఏసీబీ వెల్లడించింది.అలాగే, సోదాల్లో మారుతి స్విఫ్ట్, కియా సెల్టోస్ వాహనాలు కూడా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు గుర్తించిన మొత్తం ఆస్తుల విలువ రూ.5,92,54,500 గా అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే మార్కెట్ విలువ ప్రకారం ఈ ఆస్తుల ధరలు ఇంకా అధికంగా ఉండే అవకాశముందని అధికారులు అభిప్రాయపడ్డారు.ఇంకా సంచలన అంశంగా, నాయిని భుజంగరావు నివాసంలో 29 మద్యం బాటిళ్లు కూడా లభించినట్లు ఏసీబీ పేర్కొంది. దీనిపై అవసరమైన చర్యల కోసం ఎక్సైజ్ శాఖ అధికారులకు సమాచారం అందించినట్లు వెల్లడించింది. ప్రస్తుతం మరిన్ని ఆస్తులపై ధృవీకరణ, విచారణ కొనసాగుతోందని ఏసీబీ తెలిపింది. నిందిత అధికారిని నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

## దొంగ సొత్తుతో ఎన్జీవో వ్యవహారం

వికారాబాద్ : తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి దొంగ తనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగను వికారాబాద్ పోలీసులు అరెస్టు చేసారు. అంతరాష్ట్ర దొంగ వికాస్ సింగ్ ను మీడియా ముందు ప్రవేశపెట్టి జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా వివరాలను వెల్లడించారు. గత నెల 5న వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మణికంఠ నగర్ లోని ఓ ఇంట్లో చొరబడి ఒకటిన్నర తులాల బంగారం, 2,10000ల నగదు దొంగతనం జరిగింది. వికారాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాల్లో పరిశీలించి చూస్తే కరడు గట్టిన వికాస్ సింగ్ ను గుర్తించి రైల్వే స్టేషన్ లో అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. అదుపులోకి తీసుకున్న వికాస్ సింగ్ ను విచారించగా విస్మయానికి గురయ్యే విషయాలు వెలుగులోకి వచక్చాయి. నిందితుడు 16సంవత్సరాల వయస్సు నుంచే నేర జీవితాన్ని ప్రారంభించడు. గతంలో సంగారెడ్డి, బొల్లారం ప్రాంతాల్లో 34కేసులు నమొదై జైలు శిక్ష అనుభవించాడు. జైలు నుంచి తిరిగి వచ్చిన వికాస్ మారకపోగా వికారాబాద్ జిల్లా, సైబరాబాద్, మల్కాజిగిరి పరిధిలో మరో 27రాత్రి పూట దొంగతనాలకు పాల్పడినట్లు ఎస్పీ వెల్లడించారు. వికాస్ సింగ్ దొంగతనం చేసిన సొత్తు విక్రయించి జల్సాలకే కాకుండా హెల్పింగ్ హ్యాండ్స్ పేరుతో ఎన్జీవో ను ప్రారంభించాడు. వికాస్ సింగ్ ను దొంగ తనాలకు ఉసిగొల్పిన యుపికి చెందిన బంగారు నగలు వ్యాపారులు శ్యామ్ మోసెస్, సూరజ్ మోహన్, అశోక్ సోనీ, వికాస్ అగ్రహారి లగా గుర్తించారు. దొంగ వికాస్ సింగ్ ను దొంగ తనాలకు ఉసిగొల్పి బంగారు నగలు వ్యాపారులు ఓ తుపాకీ సమకూర్చారు. వికాస్ సింగ్ వద్ద నుంచి బంగారం తోపాటు ఒక తుపాకీ స్వాధీనం చేసుకున్నారు. వికాస్ సింగ్ ను దొంగ తనాలకు ప్రోత్సాహించిన వ్యాపారులు పై చట్టపరమైన కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ స్నేహ మెహ్రా చెప్పారు.

## ప్రొ. నాగేశ్వర్ పై రాద్ధంతం తగదు

హైదరాబాద్ : ప్రొఫెసర్ నాగేశ్వర్ విశ్లేషణలపై కక్షపూరిత దాడిని ఖండిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ లు కోదండరాం, అద్దంకి దయాకర్, సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివ రావు తదితరులు పాల్గోన్నారు.

పలువురు వక్తలు మాట్లాడుతూ సినిమాల్లో వేషాలు మార్చినట్లుగా పవన్ కళ్యాణ్ మాటలు మారుస్తున్నాడు. ఎర్ర కండువా వేశాడు.. చేగువేరా బొమ్మ పెట్టుకున్నాడు. ఇప్పుడు ఏం మాట్లాడుతున్నాడో అర్థం కావడం లేదు. సిద్ధతంతం మార్చుకొని ఇప్పుడు సనాతన ధర్మం అంటున్నాడు. రాజకీయ పార్టీ కట్టిన వ్యక్తినీ ఇక్కడికి రావద్దని ఎవరైనా అన్నారా. ఉన్న సోర్సు ప్రకారం నాగేశ్వర్ మాట్లాడారు.అభ్యంతరం రావడంతో తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నారు. అయినా ఈ విషయంలో రాద్ధాంతం చేయడం కరెక్ట్ కాదు. పవన్ కళ్యాణ్ కు తెలంగాణపై ప్రేమ బంధం లేదా ఇక్కడ రాజకీయాలను అస్థిరం చేయాలి అని ఆలోచిస్తున్నాడా తెలియడం లేదు. ప్రజాస్వామ్యవాదిగా ప్రగతి శీలవాదిగా నాగేశ్వర్ అందరిలోపాలను ఎత్తిచూపుతారు. లెఫ్ట్ పార్టీలు తప్పు చేసిన విశ్లేషణ చేస్తారని అన్నారు.

## భూములు వెనక్కి తిరిగి ఎలా ఇచ్చేస్తారు

అమరావతి : రాజధానిలో ట్రంక్ రోడ్లు,బ్రిడ్జి లు,వాగుల అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. ట్రంక్ రోడ్లపై 43,ఎల్పీఎస్ జోన్లలో 32 బ్రిడ్జి లు నిర్మిస్తున్నామని మంత్రి నారాయణ వెల్లడించారు. వర్షాకాలంలో కొండవీటి వాగు ప్రవాహానికి ఇబ్బంది లేకుండా మట్టి తొలగిస్తున్నారు. శాఖమూరు,పెనుమాక,నీరుకొండ రిజర్వాయర్లలో సగం పని పూర్తయింది. భారీ వర్షాలు వస్తే పనులకు ఆటంకం కలిగే అవకాశం ఉందని అన్నారు.

రైతులను వైసీపీ రెచ్చ కొడుతోంది. రైతుల మధ్య విభేదాలు సృష్టించి విధ్వంసం చేయాలని వైసీపీ చూస్తోంది. అమరావతిపై వైసీపీ కమిటీలు వేయడం హాస్యాస్పదంగా ఉంది. రాజధాని పనులు ఎలా జరుగుతున్నాయో ఇక్కడికి వచ్చి చూస్తే తెలుస్తుంది.. రైతుల భూములు వెనక్కి తిరిగి ఎలా ఇచ్చేస్తారు . భవనాలు,రోడ్లు, పైపు లైన్ ల నిర్మాణం పూర్తయ్యాక భూములు ఇవ్వడం సాధ్యమేనా?. మాజీ సీఎం గా చేసిన వ్యక్తి అవగాహన లేకుండా ఎలా మాట్లాడతారని అన్నారు.

# జగన్‌కు బీఆర్ఎస్ స్థానంలో కవిత



విజయవాడ : వైసీపీ అధినేత జగన్‌కు ఇరుగు పొరుగు రాష్ట్రాల మద్దతు ఉన్న విషయం తెలిసిందే. సమయం చూసుకు ని స్పందించే నాయకులు ఉన్నారు. అయితే.. ఒక్కొక్కసారి ఆయనను విమర్శించిన పొరుగు రాష్ట్ర నేతలు కూడా కనిపిస్తారు. హరీష్‌రావు, కేటీఆర్‌వంటి తెలంగాణ నాయకులు జగన్‌కు మిత్రులే అయినా.. సమయం సందర్భం చూసుకుని ఆయనను సమర్థించారు. ఒక్కొక్కసారి తీవ్రంగా విమర్శించారు. 4 వేల కోట్ల కోసం.. జగన్.. రైతులను ఫణంగా పెట్టారంటూ.. గతంలో హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. అప్పట్లో రైతులు వాడే విద్యుత్‌కు స్మార్ట్ మీటర్లు పెట్టే నిర్ణయం తీసుకున్నారు జగన్. ఇది కేంద్ర ప్రభు త్వం చెప్పడంతోనే .. చేశారని హరీష్‌రావు చెప్పారు. అంతేకాదు.. ఇలా చేస్తే.. కేంద్రం నుంచి 4 వేల కోట్ల రూపాయల మేరకు జగన్ ప్రభుత్వానికి అప్పుగా వస్తోందన్నారు. ఇది రాజకీయంగా జగన్‌కు ఇబ్బంది సృష్టించింది. ఇక, కేటీఆర్ కూడా.. ఏపీలో వైసీపీ పాలనా సమయంలో నెలకొన్న సమస్యలను ప్రస్తావించి ..ఇరుకున పడేశారు. ఏపీలో ఎక్కడ చూసినాగుంతల రోడ్లే ఉన్నాయని.. తన స్నేహితులు చెప్పారంటూ కేటీఆర్ వ్యాఖ్యానించారు. అయినప్పటికీ.. జగన్ బీఆర్ఎస్ నాయకుల తో కలివిడిగానే ఉంటున్నారన్న చర్చ ఉంది. కట్ చేస్తే.. ఇప్పుడు బీఆర్ఎస్ స్థానంలో కవిత తెరమీదికి వచ్చారు. నేరుగా జగన్‌ను ఆమె సమర్థించకపోయినా.. అసందర్భంగా ఆమె చేసిన వ్యాఖ్యలు.. వైసీపీలో చర్చకు దారితీశాయి. జగన్ రాజధాని విషయంలో చేసిన 'మావిగన్' ప్రకటనను కవిత స్వాగతిస్తున్నట్టుగా మాట్లాడారు. దీనిని అడ్డు పెట్టుకుని కూటమి ప్రభుత్వంపైనా ముఖ్యంగా సీఎం చంద్రబాబుపైన, రాజధాని అమరావతిపైనా విమర్శలు గుప్పించారు. దీంతో వైసీపీ నాయకులు తమ కు బూస్ట్ వచ్చిందని అనుకుంటున్నారు. కానీ, ఇది వాపే తప్ప బలుపు కాదని.. తెలంగాణ నాయకులను విశ్వసించడం సరికాదని చెబుతున్న వారు కూడా ఉన్నారు. ఎప్పుడు ఎలాంటి టర్న్ తీసుకుంటారో తెలియని.. కవిత గారి లాంటి నాయకులను నమ్మితే.. నిండా మునగడం కాయమ ని అంటున్నారు. కాబట్టి.. కవిత ఏదో చెప్పారని.. చంద్రబాబుపై విమర్శలు గుప్పించారని.. పొంగిపోతే.. అది మొత్తానికే ఇబ్బంది అవుతుందని చెబుతున్న నాయకులు కూడా ఉన్నారు.

**ఏపీలో సింపతీ పాలిటిక్స్...** ఏపీలో సింపతీ పాలిటిక్స్ నడుస్తున్నాయా? అంటే.. అవుననే సమాధానమే వినిపిస్తోంది. వాస్తవానికి రాజకీయాల్లో సింపతీ కావాల్సిందే. కానీ, అది కొన్ని కొన్ని సార్లు ఫలిస్తుంది.. మరికొన్ని సార్లు వికటిస్తుంది. ప్రజలు ఏది తమకు అనుకూలమని భావిస్తే.. అదే జరుగుతుంది. కానీ.. ప్రస్తుతం వైసీపీకి సింపతీ రాకుండా చేయాలన్న వ్యూహంతో కూటమి ప్రభుత్వం.. చంద్రబాబుకు సింపతీ రాకుండా చేయాలన్న లక్ష్యంతో వైసీపీ అడుగులు వేస్తున్నాయి ఈ క్రమంలోనే వైసీపీ నాయకులు.. పార్టీ అధినేత కూడా.. సంక్షేమ కార్యక్రమాలు సహా.. డీఎస్సీ వంటివాటిని తెరమీదికి తెచ్చారు. వాస్తవానికి సంక్షేమ కార్యక్రమాలు బాగానే వర్కవుట్ అవుతున్నాయి. కానీ, లోపాల ను వెతికి మరీ.. వైసీపీ నాయకులు కూటమి సర్కారును టార్గెట్ చేస్తున్నారు. దీనివల్ల తమకు మేలు జరుగుతుందని అనుకుంటున్నారు. కానీ, ప్రజలకు కూడా ఒక ఆలోచనా విధానం అయితే ఉ ంటుంది. వారు కూడా సంక్షేమంపై ఒక నిర్దేశిత అంచనాతో ఉన్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ ఎంచుకున్న సింపతీ పాలిటిక్స్ ఏమేరకు వర్కవుట్ అవుతాయన్నది ప్రశ్న. ఇక, టీడీపీ విషయానికి వస్తే.. జగన్‌ను తిట్టడమే పనిగా పెట్టుకుంది. తద్వారా .. జగన్‌కు ప్రజల్లో సింపతీ రాకూడదన్నది టీడీపీ నాయకుల లక్ష్యంగా కనిపిస్తోంది. విధానపరమైన అంశాలపై వైసీపీ విమర్శలు చేస్తే.. దానికి కౌంటర్లు ఇవ్వడం వరకు తప్పులేదు. కానీ.. లేనిపోని వ్యాఖ్యలు చేస్తే.. ప్రజల్లో దీనికి వ్యతిరేక భావన ఏర్పడుతుంది. ఫలితంగా.. అది బూమరాంగ్ అవుతుంది. గతంలో సింపతీ పాలిటిక్స్ విషయంలో వైసీపీకి, టీడీపీకి కూడా అనుభవం ఉంది. చంద్రబాబును తిట్టినా.. జగన్‌కు ప్రజలు ఓటేయలేదు. జగన్‌పై విమర్శలు చేసినా.. 2019లో టీడీపిని పట్టించుకోలేదు. కేవలం పాలనను చూసి..అమలు చేస్తున్న పథకాలను చూసి.. ప్రత్యర్థులు ఇస్తున్న హామీలను గమనించే ప్రజలు ఓటేస్తున్న విషయం 2024 ఎన్నికల్లో స్పష్టమైంది. సో.. ఇప్పటికీ సింపతీని నమ్ముకుంటామంటే.. అది బూమరాంగే అవుతుంది తప్ప.. కలిసి వచ్చే అవకాశం కనిపించడం లేదని పరిశీలకులు చెబుతున్నారు.

# కాంగ్రెస్ గూటికి జగన్

## - శివకుమార్ కు అధిష్టానం టాస్క్

విజయవాడ : కర్ణాటక కొత్త ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ బాధ్యతలు తీసుకొనున్నారు. ఇటీవల సిద్దరామయ్య తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ అగ్ర నాయకత్వం వ్యూహాత్మకంగా డీకే శివకుమార్ కు కర్ణాటక బాధ్యతలు అప్పగించింది. అయితే కేవలం కర్ణాటకలో రాజకీయ ప్రయోజనాలు పొందడం కాదు.. దక్షిణ భారతదేశంలో బలమైన శక్తిగా కాంగ్రెస్ పార్టీని తీర్చిదిద్దేందుకు డీకే శివకుమార్ ద్వారా అగ్ర నాయకత్వం బలమైన స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే తెలంగాణ, కర్ణాటక, కేరళలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నాయి. తమిళనాడులో కాంగ్రెస్ సహకారంతో విజయ్ ప్రభుత్వం నడుస్తోంది. దక్షిణాది రాష్ట్రాలను మరింత బలమైన క్యారీడార్ గా రూపొందించుకొని.. 2029 ఎన్నికల్లో అత్యధిక ఎంపీ స్థానాలు దక్కించుకోవాలన్నది కాంగ్రెస్ అగ్ర నాయకత్వం ప్లాన్. అయితే కాంగ్రెస్ పార్టీకి ఎంతో కొంత లోటు అనేది ఏపీ నుంచి ఉంది. దానిని భర్తీ చేసే బాధ్యతను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ.. డీకే శివకుమార్ కు అప్పగించినట్లు తెలుస్తోంది.ఏపీలో కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంక్ అంత జగన్మోహన్ రెడ్డి వైపు ఉంది. షర్మిల ద్వారా దాని టర్న్ చేసే ప్రయత్నం జరిగిన వర్కౌట్ కావడం లేదు. ఇప్పుడున్న ఏకైక మార్గం జగన్మోహన్ రెడ్డి వద్ద ఉన్న ఓటు బ్యాంకు కాంగ్రెస్ పార్టీ వైపు టర్న్ చేయడం.. లేకుంటే జగన్మోహన్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడం.. అది కాదంటే జగన్మోహన్ రెడ్డితో పొత్తు పెట్టుకోవడం. అయితే కాంగ్రెస్ పార్టీతో దోస్తీ అంటేనే అంత ఈజీగా జగన్మోహన్ రెడ్డి ఒప్పుకునే పరిస్థితి లేదు. అది డీకే శివకుమార్ ద్వారా చేయాలన్నది రాహుల్ గాంధీ ప్లాన్. రాజశేఖర్ రెడ్డి ఉన్న నాటి నుంచి కుటుంబ, వ్యాపార సన్నిహితుడు డికె శివకుమార్. ఆ కుటుంబం బలం, బలహీనతలు తెలుసు. పైగా ఆస్తి పంచాయితీలు ఇప్పుడు నడుస్తున్నాయి. ఆపై జగన్మోహన్ రెడ్డికి బెంగళూరులో విలువైన ఆస్తులు ఉన్నాయి. ఈ పరిణామాల క్రమంలో డీకే శివకుమార్ జగన్మోహన్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీతో కలపగల శక్తి కలిగి ఉన్నారు. అందుకే అగ్రనేత రాహుల్ కీలక టాస్క్ ఇచ్చినట్లు తెలుస్తోంది. 2029 ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలో కూటమి అధికారంలోకి రావాలి అంటే దక్షిణాది రాష్ట్రాలు కీలకం. ఐదు రాష్ట్రాలు ఉంటే అందులో మూడింట నేరుగా అధికారంలో ఉంది. మరో రాష్ట్రంలో అధికార భాగస్వామిగా ఉంది. ఏపీలో మాత్రం టీడీపీ కూటమి ఉంది. ఆ కూటమిని ఢీ కొట్టాలంటే జగన్మోహన్ రెడ్డికి మిగతా రాజకీయ పక్షాలు సాయం అవసరం. అందుకే ఆయనను కాంగ్రెస్ గూటికి తెచ్చేందుకు శివకుమార్ అప్పుడే ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. 135 పార్లమెంట్ స్థానాలు ఉన్న దక్షిణాది రాష్ట్రాల్లో మెజారిటీ సీట్లు వస్తే ఈజీగా కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చు. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల్లో నెలకొన్న పరిస్థితులు జగన్మోహన్ రెడ్డికి తెలుసు. అందుకే ఆయన బిజెపి నుంచి బయటకు వచ్చినట్టు కనిపిస్తున్నారు. ఇదే ఊపుతో డీకే శివకుమార్ పట్టు బిగిస్తే.. జగన్మోహన్ రెడ్డి కాంగ్రెస్ గూటికి చేరడం ఖాయమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# షర్మిలకు డీకే షాక్

కడప : రాజ్యసభ పదవిపై ఆశలు పెట్టుకున్నారు షర్మిల. ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నుంచి పిలుపు రావడంతో ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. అక్కడ రాజ్యసభ భరోసా రావడంతో ఆనందంతో కనిపించారు. అయితే ఇప్పుడు సీన్ రివర్స్ అవుతున్నట్లు తెలుస్తోంది. రాజ్యసభ పదవి కష్టమేనన్న టాక్ నడుస్తోంది. దానికి కారణం లేకపోలేదు. కర్ణాటక రాజకీయాలు మారడంతో.. షర్మిలకు ఈసారి అవకాశం ఉంటుందా లేదా అనేది ఒక అనుమానం. ఎందుకంటే ఆమె కర్ణాటక నుంచి రాజ్యసభకు ఎన్నిక కావాలి. కానీ అక్కడ పరిస్థితి ఏమంత బాగాలేదు. అందుకే కాంగ్రెస్ అగ్ర నాయకత్వం పునరాలోచనలో పడినట్లు ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే షర్మిలకు షాక్ తగిలినట్లే.తన తండ్రి పేరుతో తెలంగాణలో పార్టీ ఏర్పాటు చేశారు షర్మిల. అక్కడ రాజకీయాల్లో రాణించాలని భావించారు. సుదీర్ఘ పాదయాత్ర కూడా చేశారు. కానీ అనుకున్న స్థాయిలో వర్కౌట్ కాలేదు. దీంతో తన పార్టీని ఏదో ఒక జాతీయ పార్టీలో విలీనం చేయాలని భావించారు. తన తండ్రి ఇష్టపడే కాంగ్రెస్ పార్టీలోనే విలీనం చేశారు చివరకు. అలా విలీనం చేసినందుకు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని భావించారు. కానీ కాంగ్రెస్ హై కమాండ్ మాత్రం ఏపీ బాధ్యతలు అప్పగించింది. అచేతనంగా ఉన్న కాంగ్రెస్ పార్టీని ఊపిరి పోయాలని భావించింది. అందుకు అప్పట్లో రాజ్యసభ పదవి ఆఫర్ చేసినట్లు తెలుస్తోంది. ఇన్నాళ్లకు కర్ణాటక నుంచి మూడు రాజ్యసభ సీట్లు ఖాళీ అవుతుండడంతో.. షర్మిలకు ఇచ్చిన హామీ అమలు చేసేందుకు కాంగ్రెస్ పెద్దలు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. పైగా వైయస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబానికి అత్యంత సన్నిహితుడు డి కే శివకుమార్. షర్మిలకు రాజ్యసభ పదవి దక్కుతుందంటే ఆయన సైతం సంతోషిస్తారు. ఆ నమ్మకంతోనే అగ్రనేత రాహుల్ ఢిల్లీకి పిలిపించి రాజ్యసభ పదవి ఇస్తామని షర్మిలకు చెప్పారు. అయితే ఇప్పుడు మొత్తం సీన్ రివర్స్ అవుతున్నట్లు ప్రచారం నడుస్తోంది.. అయితే అదే కర్ణాటక నుంచి షర్మిల కు అవకాశం ఇచ్చేందుకు కాంగ్రెస్ హై కమాండ్ ఆదేశాలు జారీచేసింది. అయితే ఈ నిర్ణయంతో కర్ణాటక కాంగ్రెస్ నాయకులు అసంతృప్తికి గురవుతున్నారు. మరో రెండేళ్లలో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇవి డీకే శివకుమార్ పనితీరుకు అజెండాగా నిలవనున్నాయి. అయితే ప్రారంభంలోనే రాజ్యసభ పదవి ద్వారా కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తి రేగే అవకాశం ఉంది. కాంగ్రెస్ నుంచి చాలామంది నేతలు రాజ్యసభ పదవి ఆశిస్తున్నారు. ఇప్పుడు ఆ పదవిని షర్మిలకు ఇస్తే ఆ ప్రభావం డీకే శివకుమార్ పై పడుతుంది. అయితే ఇప్పుడు డీకే శివకుమార్ షర్మిల విషయంలో వెనక్కి తగ్గుతున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే షర్మిలకు షాక్ తగిలినట్టే.



### సీఎం చంద్రబాబుకు మాజీ ఎంపీ

# కేశినేని నాని ట్వీట్

విజయవాడ : మాజీ ఎంపి కేశినేని నాని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ట్వీట్ చేసారు. తాను రెండేళ్లుగా రాజకీయాలకు దూరంగా ఉన్నా కక్ష సాధింపులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. నాని రాజకీయాలతో సంబంధం లేని తన మిత్రుడ్ని స్థానిక ఎంపీ పోలీసులతో వేదిస్తున్నారని పేర్కొన్న నాని, తన చిన్ననాటి స్నేహితుడు తాతినేని రామ్ బాబుపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారని అన్నారు. టాస్క్ ఫోర్స్ పిఎస్ఐ నవీన్, రామ్ ఇంట్లో లేని సమయంలో అతని ఇంటికి వెళ్లి అతని తల్లిని వేధించాడని పేర్కొన్నారు. ఈ వేధింపులు ఆ కుటుంబానికి తీవ్రమైన వేదనను కలిగిస్తోందన్న నాని వేధింపులను ఆపడానికి, రాజకీయ కక్ష సాధింపు చర్యల కోసం పోలీసు యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయకుండా చూడాలని, దానికి జోక్యం చేసుకోవాలని చంద్రబాబుని కోరారు.

# లోకల్ బాడీ ఎన్నికలకు కమిటీ

విజయవాడ : ఏపీలో ఒక రకమైన అనుమానం ఉండేది. కూటమి ప్రభుత్వం ఎన్నాళ్లు నడుస్తుందో చెప్పలేం అన్నవారు ఎక్కువగా ఉండేవారు ఎన్నికల సమయంలో. ఎందుకంటే చాలా రాజకీయ పార్టీల మధ్య పొత్తు కొద్ది రోజులకే విచ్ఛిన్నం అవుతూ వచ్చింది. అలాగే ఏపీలో కూటమిలోని టిడిపి, జనసేన మధ్య విభేదాలు వస్తాయని ఎక్కువ మంది ఆశించారు. కానీ వారి ఆశలు తీరలేదు. గత రెండేళ్లుగా రెండు పార్టీల మధ్య బంధం పెరుగుతుందే తప్ప తగ్గేదిగా కనిపించడం లేదు. అయితే క్షేత్రస్థాయిలో క్యాడర్ మధ్య మాత్రం విభేదాలు ఉన్నాయి. ఆ విషయం ఇరుపార్టీల అధినేతలకు తెలుసు. అయితే విభేదాలు ఎంత ఉన్నాయో అంతకుమించి ప్రచారం చేస్తోంది వైసీపీ సోషల్ మీడియా. ఏదైనా పరిణామం జరిగితే చాలు సోషల్ మీడియాను నింపేస్తోంది. కానీ వారి మధ్య ఎటువంటి అరమరికలు లేకుండా సజావుగా కొనసాగుతోంది పొత్తు. అయితే ఎంత పొత్తు ఉన్న ఓట్ల బదలాయింపు జరిగితేనే.. దానికి సరైన ఫలితం వస్తుంది. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో ఇదే మాదిరిగా సత్ఫలితం చూసింది కూటమి. అయితే మరోసారి అటువంటి ఫలితాన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో చూడాలని భావిస్తున్నారు సీఎం చంద్రబాబు.ఏపీలో స్థానిక సంస్థలకు సంబంధించి పాలకవర్గాల గడువు ముగిసింది. ప్రత్యేక అధికారుల పాలన నడుస్తోంది. త్వరలో ఎన్నికలకు వెళ్లేందుకు సన్నాహాలు చేస్తోంది ప్రభుత్వం. అయితే చంద్రబాబు జరుపుతున్న ఈ జాప్యం వెనుక చాలా రకాల వ్యూహాలు ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా స్థానిక సంస్థల్లో సైతం కూటమి పార్టీల మధ్య ఓట్ల బదలాయింపు జరగాలన్నది చంద్రబాబు ప్రణాళిక. అందుకు ఆయన ఒక వ్యూహం రూపొందించారు. నియోజకవర్గ, మండల స్థాయిలో ఎన్డీఏ సమన్వయ కమిటీ సమావేశాలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ నెల నాలుగున జరగనున్న ఎన్డీఏ సమావేశంలో ఈ నిర్ణయాన్ని ప్రకటించనున్నారు.సార్వత్రిక ఎన్నికల వరకు పొత్తు ఓకే. కానీ స్థానిక సంస్థల ఎన్నికలు అలా కాదు. అక్కడ స్థానిక పరిస్థితులు విపరీతంగా ప్రభావం చూపుతాయి. నేతలు ఆశావహులుగా ఉంటారు. ఈ క్రమంలో ఎన్నికలు నిర్వహిస్తే కూటమి నేతల మధ్య ఘర్షణతో పాటు వివాదాలు జరుగుతాయి. దీనిని ముందుగానే గ్రహించారు సీఎం చంద్రబాబు.

అందుకే కూటమి సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ఏ మండలంలో ఎవరు జడ్పిటిసి గా పోటీ చేయాలి? సర్పంచ్ గా ఎవరికి అవకాశం కల్పించాలి? ఎంపీపీగా ఎవరికి ఛాన్స్ ఇవ్వాలి? ఆశావహుడు ఎప్పుడు నుంచి పనిచేస్తున్నారు? స్థానికంగా బలం ఎంత? ఇలా అన్ని వివరాలను ఆరా తీస్తుంది ఈ కమిటీ. ఒకవేళ బహుముఖ పోటీ ఉంటే సమన్వయం చేసుకొని ముందుకు సాగుతుంది. అప్పుడే ఓట్ల బదలాయింపు జరిగి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి భారీ ఓటమి ఇచ్చేందుకు ఈ ప్రయత్నం గా తెలుస్తోంది. రేపు ఈ కమిటీల గురించి ప్రత్యేక ప్రకటన చేస్తారు సీఎం చంద్రబాబు.

# ట్రెండింగ్ లో లేబర్ అడ్డా

గుంటూరు : ఏదైనా భవన నిర్మాణమైనా, రోడ్డు నిర్మాణమైనా అందుకోసం చాలా మంది కార్మికులు అవసరం. అన్నీ ఉ న్నా అల్లుడి నోట్లో శని అన్నట్టు.. ఆయా నిర్మాణాల కోసం సరిపడ డబ్బు, ఇతరత్రా సామాగ్రి ఉన్నా.. కార్మికులు లేకపోతే ఆ పని ఇంచు కూడా కదలదు.ఇప్పుడు అన్ని ప్రాంతాల్లో నిర్మాణాలు జోరుగా సాగుతున్న వేళ కార్మికుల పాత్ర మరింతగా పెరిగిపోయింది. ఇక ఏపీ రాజధాని అమరావతి విషయానికి వస్తే? వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు వస్తున్నారు. వెళుతున్నారు. ఒక్కో కాంట్రాక్టరు ఒక్కో రీతిన వ్యవహరిస్తున్న కారణంగా కార్మికులు ఇబ్బందులు పడుతున్న వైనం స్పష్టంగా కనిపిస్తోంది. అందుకే కార్మికుల వసతి కోసం పక్కా ఏర్పాట్లు చేయాలని కూటమి సర్కారు తన కాంట్రాక్టర్ల తెగేసి చుబుతోంది.కాంట్రాక్టర్లకు మాట మాత్రంగా చెప్పడానికి బదులుగా అసలు కార్మికుల వసతి కోసం ఎలాంటి ఏర్పాట్లు చేయాలి? ఆయా లేబర్ అడ్డాల్లో ఎలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలి? వంటి విషయాలను విస్పష్టంగా చెప్పేందుకు కూటమి సర్కారు రంగంలోకి దిగింది. ఇంటిగ్రేటెడ్ లేబర్ అమెనిటీస్ సెంటర్ (లేబర్ అడ్డా) నమూనాను గుంటూరులో ఏర్పాటు చేసింది.

అందులో కార్మికుల వసతి కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లను కళ్లకు కట్టినట్టు చూపింది.లేబర్ అడ్డాల్లో ఆయా ఏర్పాట్లతో పాటుగా కార్మికులకు తమ హక్కులు, బాధ్యతలపై మరింత అవగాహన పెంచే దిశగా పలు సూచనలు సలహాలను ఆ లేబర్ అడ్డాలో పొందుపరచింది.

చదువు వచ్చిన కార్మికులతో పాటుగా చదువు రాని వారికి కూడా సులభంగ అర్థమయ్యేలా ఈ అవగాహన ప్రకటనలను పొందుపరచిందిఅమరావతి పరిధిలోనే కాకుండా ఇతరత్రా పని ప్రదేశాల్లో కూడా కార్మికుల కోసం ఈ తరహా లేబర్ అడ్డాలను ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం కాంట్రాక్టర్లకు దిశానిర్దేశం చేసింది.

ఈ సూచనలను పాటిస్తే పని ప్రదేశాల్లో కార్మికులకు మంచి వసతులు లభించినట్టేనని చెప్పాలి.

# కొడాలి అర్జున్ ఎంట్రీ..

మచిలీపట్టణం : మాజీ మంత్రి కొడాలి నాని రాజకీయ వారసుడిపై క్లారిటీ వచ్చేసింది. మాజీ మంత్రి పేర్ని నాని కొడాలి నాని రాజకీయ వరసుడు ఎవరో చెప్పేశారు.. 2034 ఎన్నికల్లో కొడాలి అర్జున్ గుడివాడ నుంచి బరిలో ఉంటాడని ప్రకటించారు. కొడాలి నానితో కలిసి అర్జున్ గుడివాడలో సర్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంలో పేర్నినాని కీలక ప్రకటన చేశారు.గుడివాడ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం జరిగింది.. మాజీ మంత్రి కొడాలి నాని రాజకీయ వారసత్వంపై కీలక ప్రకటన వచ్చేసింది. కొడాలి నాని రాజకీయ వారసుడు ఎవరో మాజీ మంత్రి కొడాలి నాని ప్రకటించారు. గుడివాడ లింగవరంలోని కె కన్వెన్షన్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్)పై వైఎస్సార్‌సీపీ నేతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నానిలతో పాటుగా వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు హాజరయ్యారు. ఈ వేదికపై నుంచి మాజీ మంత్రి పేర్ని నాని కొడాలి నాని రాజకీయ వారసుడు కొడాలి అర్జునరావు అంటూ ప్రకటించారు. కొడాలి అర్జున్ 2034 ఎన్నికల్లో పోటీచేస్తారని పేర్ని నాని తెలిపారు.కొడాలి అర్జున్ నాని సోదరుడి కుమారుడు.. కొంతకాలంగా గుడివాడ వైఎస్సార్‌సీపీలో యాక్టివ్ అయ్యారు. గుడివాడలో సర్‌పై నిర్వహించిన సదస్సుకు అర్జున్ వచ్చారు.. వేదికపై మాజీ మంత్రులు, పార్టీ నేతల మధ్య కూర్చున్నారు. అర్జున్ 2034 ఎన్నికల్లో పోటీచేస్తారని ప్రకటించడంతో.. 2029 ఎన్నికల్లో కొడాలి నాని ఎన్నికల బరిలో ఉంటారనే క్లారిటీ వచ్చింది. కొడాలి నానికి ఇద్దరు కుమార్తెలు ఉ న్నారు.. కానీ తన సోదరుడి కుమారుడు అర్జున్‌ను రాజకీయ వారసుడిగా ప్రకటించారు. గతంలో కూడా పలు సందర్భాల్లో కొడాలి నాని తన రాజకీయ వారసత్వం గురించి ప్రకటనలు చేశారు. 2024 ఎన్నికల సమయంలో కూడా కొడాలి నాని సోదరుడి కుమారుడు అర్జున్ తన రాజకీయ వారసుడని ప్రకటించిన సంగతి తెలిసిందే. తనకు 2024 ఎన్నికలే చివరివి అని చెప్పారు. 2029 ఎన్నికల్లో తాను పోటీచేయనని.. తన వయసు గురించి ప్రస్తావించారు. 2029 ఎన్నికల సమయానికి తనకు 58 ఏళ్లు వస్తాయని.. తాను ఆ వయసులో మళ్లీ ఎన్నికల్లో పోటీచేయలేనని చెప్పుకొచ్చారు. తన కుటుంబం నుంచి ఎవరూ రాజకీయాల్లోకి రారని.. తన ఇద్దరు కుమార్తెలకు రాజకీయాల్లోకి రావాలనే ఆసక్తి లేదన్నారు. తన తమ్ముడి కుమారుడు రాజకీయాల్లోకి వస్తారని చెప్పారు. ఇప్పుడు మాజీ మంత్రి పేర్ని నాని ప్రకటనతో కొడాలి అర్జున్ పొలిటికల్ ఎంట్రీ ఖాయమైందనే చర్చ జరుగుతోంది.మరోవైపు గుడివాడలో జరిగిన సర్ సదస్సులో మాజీ మంత్రి పేర్ని నాని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో గుడివాడ, గన్నవరం సిట్టింగ్ ఎమ్మెల్యేలకు సీట్లు లేవని టీడీపీలో చర్చ జరుగుతోందన్నారు. సర్ విషయంలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సర్ కారణంగా తమిళనాడులో స్టాలిన్, పశ్చిమ బెంగాల్‌లో మమత బెనర్జీ ఓడిపోయారన్నారు మాజీ మంత్రి కొడాలి నాని. వారు పోటీచేసిన నియోజకవర్గాల్లో ఓట్లు తొలగించడంతోనే ఇలా జరిగిందని చెప్పుకొచ్చారు. సర్ విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

# టీడీపీలో అనంత లొల్లి


అనంతపురం : అనంతపురం నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీలో ముసలం మొదలయింది. అక్కడ మాజీ ఎమ్మెల్యేకు, ప్రస్తుత ఎమ్మెల్యేకు మధ్య గత కొన్నేళ్ల నుంచి పడటం లేదు. ప్రస్తుత ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి మధ్య విభేదాలు మరింత ముదిరాయి. ఎంతగా అంటే.. తాను వచ్చే ఎన్నికల్లో అనంతపురం అర్బన్ నియోజకవర్గం నుంచి పోటీ చేయబోనని ప్రభాకర్ చౌదరి ప్రకటించారు. తాను పార్టీ హైకమాండ్ ను టిక్కెట్ ను కూడా కోరనని అన్నారు. అదే సమయంలో డీలిమిటేషన్ లో మరొక నియోజకవర్గంలో అవకాశమిస్తే వెళతానని, లేకుంటే పోటీకి దూరంగా ఉ ంటానని ప్రభాకర్ చౌదరి ప్రకటించారు.ఇందుకు కారణాలు కూడా లేకపోలేదు. గత ఎన్నికల్లో ప్రభాకర్ చౌదరిని కాదని తెలుగుదేశం పార్టీ నాయకత్వం దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు టిక్కెట్ ఇచ్చింది. కూటమి హవాలో ఆయన గెలుపొందారు. అయితే గెలిచిన నాటి నుంచి ప్రభాకర్ చౌదరిని పక్కన పెడుతూ వస్తున్నారు. ఆయన వర్గాన్ని కూడా దూరం పెడుతున్నారు. దీంతో రెండు వర్గాల మధ్య సోషల్ మీడియాలో గత కొంతకాలంగా వార్ నడుస్తుంది. దీనిపై పార్టీ హైకమాండ్ స్పందించి వెంటనే ఇద్దరినీ పిలిపించి క్లాస్ పీకారు. అయినా మార్పు రాలేదు. దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ తన అనుచరులను కావాలనే తొక్కేస్తూ నియోజకవర్గంలో ఇబ్బందులు పెడుతున్నారన్నది ప్రభాకర్ చౌదరి ఆరోపణ.మరొకవైపు త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. కార్పొరేషన్ ఎన్నికల్లో వంద శాతం సీట్లు గెలుస్తామని, ఎవరు అడ్డం పడినా గెలిచేది టీడీపీయేనని, తానేంటో చూపిస్తానని దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ మీడియా సమావేశం పెట్టి పరోక్షంగా ప్రభాకర్ చౌదరిపై సవాల్ విసిరారు. అనంతరం ప్రభాకర్ చౌదరి తాను వచ్చే ఎన్నికల్లో హైకమాండ్ తనకు అనంతపురం బీఫారం ఇచ్చినా తీసుకోనని, తాను పోటీ చేయనని చెప్పేశారు. ఇది తన వ్యక్తిగత నిర్ణయమని, ఆయన నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారు కదా? ఎన్నిసార్లు గెలుస్తారో గెలవనీయండి అంటూ సెటైరికల్ గా మాట్లాడుతుండటంతో వీరిద్దరి మధ్య వార్ స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపుతుందన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతుంది. మొత్తం మీద అధికార టీడీపీలో ఈ విభేదాలు హైకమాండ్ జోక్యంతోనూ సమసిపోయేలా కనిపించడం లేదు.

## కాంట్రవర్సీలో చిక్కుకున్న అనుష్క శర్మ.. స్పందిస్తుందా?



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శర్మ, టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి సతీమణి తాజాగా ఒక పెద్ద వివాదంలో చిక్కుకున్నారు. సోషల్ మీడియాలో ఆమె పెట్టిన ఒక పోస్ట్ ఇప్పుడు నెటిజన్ల మధ్య పెద్ద యుద్ధానికే దారితీసింది. సాధారణంగా వివాదాలకు దూరంగా ఉండే అనుష్క.. సడన్‌గా ఇలాంటి కాంట్రవర్సీలో ఇరుక్కోవడంతో ఫ్యాన్స్ అంతా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. అసలు ఆమె ఏం పోస్ట్ చేసింది? నెటిజన్లు ఎందుకు అంతలా ఫైర్ అవుతున్నారో ఇప్పుడు చూద్దాం.. అసలు మ్యాటర్ ఏంటంటే.. అనుష్క శర్మ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో హోమియోపతి ఫిజీషియన్ రాజన్ శంకరన్ మాట్లాడిన ఒక వీడియోను షేర్ చేశారు. ఆ వీడియోను షేర్ చేస్తూ.. తన వ్యక్తిగత జీవితంలో హోమియోపతి వైద్యం చాలా ఇంపార్టెంట్ రోల్ ప్లే చేసిందని, దానివల్ల తనకు ఎంతో మేలు జరిగిందని రాసుకొచ్చారు. అయితే ఒక సెలబ్రిటీ అయి ఉండి హోమియోపతిని ప్రమోట్ చేయడంపై సోషల్ మీడియాలో భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అనుష్క చేసిన ఈ పోస్ట్‌పై నెటిజన్లు, కొంతమంది వైద్య నిపుణులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. హోమియోపతి అనేది పూర్తిగా అశాస్త్రీయమైనదని, దానికి ఎలాంటి సైంటిఫిక్ ఆధారాలు లేవని వాదిస్తున్నారు. ఇక ఇలాంటి నకిలీ వైద్య పద్ధతులను, దొంగ బాబాలను పెద్ద సెలబ్రిటీలు ప్రమోట్ చేయడం వల్ల సమాజంలోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని, ప్రజలు తప్పుదోవ పడతారని అనుష్కపై సోషల్ మీడియాలో తీవ్రంగా మండిపడుతున్నారు. ఇదిలా ఉంటే, అనుష్క శర్మకు సపోర్ట్ చేస్తూ మరికొందరు రంగంలోకి దిగారు. అల్లోపతి మందుల వల్ల చాలా సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయని, కానీ హోమియోపతిలో అలాంటి భయాలు ఉండవని వారు చెబుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులకు హోమియోపతే ఎంతో మేలైన చికిత్స అని, అల్లోపతి కంటే ఇదే బెటర్ అని వాదిస్తున్నారు. ఇక అనుష్క కేవలం తన పర్సనల్ ఎక్స్‌పీరియన్స్‌ను మాత్రమే షేర్ చేసిందని, ఇందులో తప్పుపట్టడానికి ఏముందని ఆమె మద్దతుదారులు సమర్థిస్తున్నారు. ఇక ఏదేమైనా, అనుష్క శర్మ పెట్టిన ఒక్క పోస్ట్ ఇప్పుడు అల్లోపతి వర్సెస్ హోమియోపతి అనే రేంజ్‌లో సోషల్ మీడియాలో పెద్ద హాట్ టాపిక్‌గా మారింది. సెలబ్రిటీలు ఏది మాట్లాడినా, ఏది పోస్ట్ చేసినా అది ప్రజలపై చాలా ఇంపాక్ట్ చూపిస్తుంది కాబట్టే ఈ స్థాయిలో చర్చ జరుగుతోంది. మరి ఈ కొత్త వివాదంపై ఆమె ఎలా స్పందించి క్లారిటీ ఇస్తుందో లేదో వేచి చూడాలి.

## ఎన్టీఆర్ ఇన్‌పుట్స్ ఇవ్వకపోతే డ్రాగన్ స్క్రిప్ట్ లేనే లేదా?



ఇండియన్ సినిమా హిస్టరీలోనే అత్యంత భారీ అంచనాలతో రూపొందుతున్న లార్జర్-దేన్-లైఫ్ యాక్షన్ డ్రామా -డ్రాగన్-. యంగ్ టైగర్ ఎన్టీఆర్ .. సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్ కలయికలో వస్తున్న ఈ ప్రాజెక్ట్ 11 జూన్ 2027 న ప్రపంచవ్యాప్తంగా ఐదు భాషల్లో విడుదలకు సిద్ధమవుతోంది. అయితే తాజా ఇంటర్వ్యూలో దర్శకుడు ప్రశాంత్ నీల్ ఈ సినిమా స్క్రిప్ట్ వెనుక దాగి ఉన్న కొన్ని షాకింగ్ నిజాలను బయటపెట్టారు. ఒకవేళ ఎన్టీఆర్ తన ఆలోచనలను, ఇన్‌పుట్స్‌ను పంచుకోకపోయి ఉంటే ఈ డ్రాగన్ స్క్రిప్ట్ అసలు ఈ రూపంలో వచ్చేదే కాదా అనే రేంజ్‌లో నీల్ సంచలన విషయాలను తాజా ఇంటర్వ్యూలో రివీల్ చేసారు. ఈ ప్రాజెక్ట్ కోసం తాము దాదాపు ఐదేళ్ల పాటు స్క్రిప్ట్‌పై శ్రమించామని ప్రశాంత్ నీల్ తెలిపారు. ఇందులో అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. తాను కథ రాయడం ప్రారంభించిన మొదటి రెండేళ్ల వరకు ఈ ప్రాజెక్ట్‌లో ఎలాంటి రైటర్స్ లేరు. ఆ సుదీర్ఘమైన రెండేళ్ల కాలంలో ప్రశాంత్ నీల్ కేవలం జూనియర్ ఎన్టీఆర్‌తో మాత్రమే నిరంతరం కథా చర్చలు జరిపారు. ఎన్టీఆర్ కేవలం ఒక హీరోగా కాకుండా, స్క్రిప్ట్ డెవలప్‌మెంట్‌లో ఒక భాగస్వామిగా మారి అందించిన సరికొత్త ఆలోచనలు, ఇన్‌పుట్స్ ఈ కథ అత్యంత ఉత్తమంగా రూపుదిద్దుకోవడానికి ప్రధాన కారణమయ్యాయి.

ముఖ్యంగా సినిమాలో వచ్చే భావోద్వేగాల ఎలివేషన్ విషయంలో ఎన్టీఆర్ ఇచ్చిన ఐడియాలు అద్భుతంగా పనిచేశాయని ప్రశాంత్ నీల్ ప్రశంసించారు. ఎన్టీఆర్‌కు ఎమోషనల్ డ్రామాపై ఉన్న అపారమైన పట్టును తాను ఎంతగానో నమ్ముతానని.. అందుకే ఆయన ఒక నమ్మకమైన ప్రేక్షకుడి స్థానంలో నిలబడి కథలోని నాటకీయతను బెటర్ మెంట్ చేయడానికి ఎన్నో అద్భుతమైన సూచనలు చేశారని నీల్ వివరించారు. కేవలం సాధారణ స్క్రిప్ట్ మార్పులకే పరిమితం కాకుండా..సినిమా క్లైమాక్స్ సన్నివేశానికి కూడా ఎన్టీఆర్ స్వయంగా కీలకమైన ఇన్‌పుట్స్ ఇచ్చి ఆ సీన్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకువెళ్లాయని తెలిపారు. తన కెరీర్‌లోనే అత్యంత పవర్‌ఫుల్ డీప్ డార్క్ షేడ్ (చీకటి కోణం) ఉన్న ఒక నెగెటివ్ క్యారెక్టర్‌ను ఎన్టీఆర్ కోసం ప్రశాంత్ నీల్ డిజైన్ చేశారు.

ఇలాంటి ఒక నెగెటివ్ డార్క్ షేడ్ పాత్రను అంగీకరించేందుకు ఏ ఇతర హీరో ముందుకు రారు. కానీ ఈ కథలో కాంప్లికేషన్స్ ని అర్థం చేసుకుని తారక్ ఓకే చెప్పారు. ఈ సాహసానికి ఒడికట్టారని నీల్ చెప్పారు. కథా చర్చల చివరి దశలో.. ఎన్టీఆర్ ఇచ్చిన ఇన్‌పుట్స్‌తో రాసుకున్న ఆ బలమైన క్లైమాక్స్ సన్నివేశం హీరోలో వంద శాతం నమ్మకాన్ని నింపింది. ఆ పాత్ర పూర్తి ఎమోషనల్ ఆర్క్ అర్థమయ్యాక నా ఇమేజ్‌కు ఇది కొంత రిస్క్ అయినా చేసేద్దాం..ముందుకు వెళ్దామని ఎన్టీఆర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ప్రశాంత్ నీల్ గుర్తుచేసుకున్నారు. చిత్ర కథానాయకుడు, దర్శకుల మధ్య జరిగిన ఈ లోతైన ఐదేళ్ల సృజనాత్మక ప్రయాణమే డ్రాగన్ చిత్రాన్ని భారతీయ చలనచిత్ర చరిత్రలోనే ఒక సరికొత్త యాక్షన్ సంచలనంగా మార్చబోతోందని ఇప్పుడు విశ్లేషించవచ్చు.

## నెక్స్ట్ మూవీ.. ధనుష్ డెసిషన్ కు రీజనేంటి?



కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ మరోసారి తన ప్లాన్ తో వార్తల్లో నిలిచారు. నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా, గాయకుడిగా ఆకట్టుకుంటున్న ఆయన ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. అయితే తాజాగా ఆయన తీసుకున్న నిర్ణయం కోలీవుడ్ లో హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే ప్రకటించిన ఓ ప్రాజెక్టును మరో నిర్మాణ సంస్థ నుంచి తన సొంత బ్యానర్ కు మార్చడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కొన్ని నెలల క్రితం దర్శకుడు తమిళరసన్ పచ్చ ముత్తుతో కలిసి ధనుష్ కొత్త సినిమా చేయనున్నట్లు అఫీషియల్ అనౌన్స్మెంట్ వచ్చింది. లబ్బర్ పండు సినిమాతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న తమిళరసన్.. ధనుష్ కెరీర్ లో 57వ చిత్రానికి దర్శకత్వం వహించనున్నట్లు ప్రకటన వెలువడింది. దీంతో ఆ ప్రాజెక్టుపై అభిమానుల్లో కూడా మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఆ సినిమాను మొదట డాన్ పిక్చర్స్ నిర్మించాల్సి ఉంది. హీరోయిన్ గా రుక్మిణి వసంత్, నటుడు విజయ్ కుమార్ కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. కథకు తగ్గట్టు పలు ప్రాంతాల్లో లొకేషన్ రికీ కూడా నిర్వహించినట్లు రీసెంట్ గా మూవీ టీమ్ తెలిపింది. త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుందని అందరూ భావించారు. అయితే అనూహ్యంగా ఆ ప్రాజెక్టుకు సంబంధించిన పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. డాన్ పిక్చర్స్ బ్యానర్ పై రూపొందాల్సిన కొన్ని సినిమాలు వివిధ కారణాలతో ఆలస్యం అవుతున్నాయని కోలీవుడ్ లో ప్రచారం జరుగుతోంది. ధనుష్-తమిళరసన్ సినిమా కూడా అదే పరిస్థితి ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయని వార్తలు వినిపించాయి. ఈ నేపథ్యంలో ధనుష్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సినిమా నిర్మాణ బాధ్యతలను తన సొంత సంస్థ వండర్ బార్ ఫిల్మ్స్ కు మార్చినట్లు సమాచారం. ప్రాజెక్ట్ లేట్ కాకుండా, అనుకున్న సమయానికి షూటింగ్ పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలన్న ఉద్దేశంతో ఆ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. అయితే ధనుష్ కెరీర్ ను పరిశీలిస్తే.. కథల సెలక్షన్ లో ఆయన ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తారన్న విషయం తెలిసిందే. ఇప్పటి వరకు కెరీర్ లో పలు కమర్షియల్ సినిమాలు కూడా చేసినప్పటికీ, స్ట్రాంగ్ కంటెంట్ ఉన్న కథలకు ఎప్పుడూ ప్రాధాన్యం ఇస్తుంటారు. అందుకే తమిళరసన్ చెప్పిన కథపై ఆయనకు పూర్తి నమ్మకం ఉందని, ప్రాజెక్టు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుకు సాగాలనే ఉద్దేశంతో నిర్మాణ సంస్థను మార్చినట్లు ప్రచారం జరుగుతోంది.

## శత్రువులు అంటూ స్టార్ హీరోని చిక్కుల్లోకి నెట్టిన కంగన



కొన్నేళ్లుగా సినీపరిశ్రమలో శత్రుత్వాన్ని పెంచుకున్న నటిగా కంగన రనౌత్ అగ్రెస్సివ్ నేచర్ గురించి అందరికీ తెలుసు. ఎటు చూసినా శత్రుత్వం పెరగడంతో సైలెంట్ గా రాజకీయల్లోకి జంప్ అయింది. అక్కడ ఉంటూనే సినిమాలు కూడా నడిపించేస్తోంది. అయితే ఇప్పుడు తనలాగే రణ్ వీర్ సింగ్ కి కూడా శత్రువులు పెరిగారని అంటోంది కంగన. శత్రువులు పెరిగితే స్థాయి పెరిగినట్టేనని కితాబిచ్చింది!! డాన్ 3 వివాదంలో రణ్ వీర్ ని హీరోని చేయడానికి కంగన ప్రయత్నిస్తోంది కానీ.. క్వీన్ మద్ధతు అతడికి కలిసొస్తుందా? వికటిస్తుందా? అనేదే సందిగ్ధం! ఫర్హాన్ అక్తర్ ప్రతిష్టాత్మక చిత్రం డాన్ 3 నుండి బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ తప్పుకున్నారనే వార్తల నేపథ్యంలో.. ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియన్ సినీ ఎంప్లాయిస్ (ఎఫ్‌డబ్ల్యూఐసిఇ) ఆయనపై నాన్-కోఆపరేషన్ (సహాయ నిరాకరణ) ఆదేశాలు జారీ చేయడం చిత్ర పరిశ్రమలో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ వివాదంపై ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులు రణ్‌వీర్‌కు మద్దతుగా నిలవగా.. తాజాగా బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ కంగనా రనౌత్ కూడా ఈ అంశంపై స్పందించారు. రణ్‌వీర్ సింగ్‌కు పూర్తి అండగా నిలిచిన కంగనా, సినీ కార్మిక సంఘాల నిషేధాల సంస్కృతిని ఉద్దేశించి తనదైన శైలిలో ఘాటు వ్యాఖ్యలు చేశారు. తాను నటించిన భారత్ భాగ్య విధాత సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో కంగనా రనౌత్ మీడియాతో మాట్లాడుతూ ఈ వివాదాన్ని ప్రస్తావించారు. గతంలో నన్ను కూడా అందరూ నిషేధించారు (బ్యాన్ చేశారు). జీవితంలో మీ స్థాయి, సక్సెస్ హోదా పెరిగినప్పుడు.. శత్రువులు కూడా పెరుగుతారు. ఎనిమీ పెరగకుండా మీ హోదా పెరగడం అనేది అసాధ్యం. కాబట్టి రణ్‌వీర్ సింగ్ దీనిని చూసి భయపడకుండా పరిశ్రమలో తన స్థాయి ఎక్కడికి చేరిందో తానెంతటి ఉన్నత స్థానాన్ని సాధించాడో అర్థం చేసుకోవాలి అని కంగనా హితవు పలికారు. విజయం సాధించినప్పుడు శత్రువులు పెరగడం సహజమని.. రణ్‌వీర్ తన కెరీర్‌లో సాధించిన అద్భుతమైన విజయాల గురించి ఆలోచించుకోవాలని సూచించారు. జీవితంలో ఒక వ్యక్తి ముందుకు సాగుతున్నప్పుడు అనేక అడ్డంకులు, ఆటంకాలు ఎదురవుతాయని.. ప్రయాణం ఎప్పుడూ సాఫీగా సాగదని కంగనా చెప్పుకొచ్చారు. నేను కూడా నా కెరీర్‌లో ఇలాంటి ఎన్నో క్లిష్ట పరిస్థితులను, నిషేధాలను ఎదుర్కొన్నాను.. అయినా ఇప్పటికీ నేను బాగానే ఉన్నాను. ఇలాంటివి పెద్దగా పట్టించుకోవద్దు..కాలక్రమేణా అన్నీ సర్దుకుంటాయి! అంటూ రణ్‌వీర్ సింగ్‌కు మానసిక ధైర్యాన్ని ఇచ్చారు. అయితే రణ్ వీర్ పై నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్టు ఫెడరేషన్ ఇంతకుముందే ప్రకటించింది. అసోసియేషన్ తో రణ్ వీర్ సమస్యలో నిర్మాతల గిల్డ్ మధ్యవర్తిత్వం వర్కవుటైంది. ప్రస్తుతానికి వివాదం సద్దుమణిగింది.

కానీ ఫర్హాన్ తో సమస్యను వందశాతం పరిష్కరించుకునేందుకు రణ్ వీర్ ప్రయత్నించాల్సి ఉంది. ఇలాంటి సమయంలో శత్రుత్వం అంటూ కంగన పెద్ద తేనెతుట్టనే కదిపింది. అనవసరంగా ఇది రణ్ వీర్ కి చేటు చేయకూడదని ఆశిద్దాం. ఇక కంగనా రనౌత్ తదుపరి చిత్రం విషయానికి వస్తే.. అరడజను ఫ్లాపుల తర్వాత క్వీన్ ప్రధాన పాత్రలో నటించిన భారత్ భాగ్య విధాత చిత్రం 12 జూన్ 2026న థియేటర్లలో విడుదల కానుంది. ముంబైలో జరిగిన 26/11 ఉగ్రదాడుల నేపథ్యంలో సినిమా ఇది. ఆ క్లిష్ట సమయంలో హాస్పిటల్ సిబ్బంది ప్రదర్శించిన అసాధారణ ధైర్యసాహసాల కథాంశంతో ఈ సినిమా రూపుదిద్దుకుంది. మనోజ్ తపాడియా రచన, దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని కంగనా తన సొంత బ్యానర్ -మణికర్ణిక ఫిల్మ్స్- పతాకంపై నిర్మించగా... గిరిజా ఓక్, స్మితా తాంబే కీలక పాత్రలు పోషించారు.



మెట్రో సిటీటైమ్స్ METRO CITY TIMES

శనివారం, జూన్ 6, 2026

## ఈ వారంలో ఇంటర్ సప్లిమెంటరీ రిజల్ట్స్

హైదరాబాద్ : తెలంగాణలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 21వ తేదీతో ముగిసిన సంగతి తెలిసిందే. ఇక ఈ పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ కూడా ముగిసింది. ఈ క్రమంలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాసిన విద్యార్థులకు విద్యాశాఖ కీలక సమాచారం వెల్లడించింది. ఫలితాలను మరో 5 రోజుల్లోనే వెల్లడించనున్నట్లు తెలిపింది. అంటే జూన్ 10వ తేదీలోపు ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు ఇంటర్ బోర్డు విడుదల చేయనుంచి. ఈ మేరకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే జవాబు పత్రాల మూల్యాంకనం, స్కానింగ్ ప్రక్రియలు కూడా పూర్తయ్యాయి. ప్రస్తుతం ఫలితాల విడుదలకు సంబంధించిన తుది సాంకేతిక కసరత్తు జరుగుతుంది. వచ్చే వారంలో ఫలితాలు వెల్లడించనున్నారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా మే 12 నుంచి మే 21 వరకు ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షలకు గరిష్ట స్థాయిలో మొత్తం 3,98,358 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్ ఫలితాలు వెలువడితేగానీ ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలవదు. దీంతోపాటు డిగ్రీ ప్రవేశాలు, ఇతర ఉన్నత విద్యా అడ్మిషన్ ప్రక్రియలు కూడా త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ఫలితాలను త్వరగా ప్రకటించాలని అధికారులు భావిస్తున్నారు.కాగా ఈ ఏడాది ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 3,98,358 మంది విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించారు. దీంట్లో జనరల్ విభాగంలో మొత్తం 3,69,294 మంది విద్యార్థులు, ఒకేషనల్ విభాగంలో 28,703 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో ఫస్టియర్ విద్యార్థులు 2,67,141 మంది ఉండగా.. సెకండియర్ నుంచి 1,30,856 మంది విద్యార్థులు ఉన్నారు.

## అడవులను రక్షిద్దాం - ప్రకృతిని కాపాడుదాం

### నగరవనంలో మొక్కలు నాటిన కే. కుమార్

పిడుగురాళ్ల :ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా "అడవులను రక్షిద్దాం– ప్రకృతిని కాపాడుదాం" అనే నినాదంతో రాజుపాలెం మండలం దేవరంపాడు నగరవనం లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టిఐ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కే. కుమార్ మీడియాతో మాట్లాడుతూ, అడవులను రక్షించడం, మొక్కలను నాటడం ప్రతి ఒక్కరి దిన చర్యలో భాగం కావాలని, ప్రకృతిని నాశనం చేసుకుంటే ఈ భూమ్మీద జీవం అనే ఆనవాళ్లు కూడా కనిపించకుండా పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. మొక్కలను నాటండి ప్రకృతిని పరిరక్షించమని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## కార్యకర్తలకు అండగా ఉంటా..

### - మాజీ ఎమ్మెల్యే బ్రిజేంద్ర రెడ్డి

చాగలమర్రి : కార్యకర్తలకు వెన్నంటి అండగా ఉంటానని ఆళ్లగడ్డ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రీజెంద్రా రెడ్డి అన్నారు. నేలంపాడు గ్రామంలోని ఓ వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి నాయకులు, కార్యకర్తలు ఎవరు కూడా భయపడాల్సిన అవసరం లేదని నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు.

రైతే రాజని, వైయస్ జగన్ అన్న హయాంలో రైతు సంక్షేమానికి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. అందరూ కూడా రాజన్న రాజ్యం కోసం ఎదురుచూస్తున్నారని రానున్న రోజుల్లో జగనన్న నాయకత్వమును కోరుతున్నార న్నారు. ఈయన వెంట వైసిపి నియోజకవర్గ నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు, గంగుల అభిమానులు ఉన్నారు.

# తెలంగాణ ఎవరి జాగీర్?

హైదరాబాద్ : తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించి పుష్కరం పూర్తయింది. అయినా ఇప్పటికీ తెలంగాణ అంశం, ఉద్యమం, సెంటిమెంట్ ప్రజల్లో రగులుతూనే ఉంది. రాజకీయ నేతలు దానిని రగిలిస్తూనే ఉన్నారు. తాజాగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, తెలంగాణ కాంగ్రెస్ నేతల మధ్య జరుగుతున్న మాటల యుద్ధంతో తెలంగాణ అంశం మరోమారు తెరపైకి వచ్చింది. రాష్ట్రం 12 ఏళ్లు గడిచినా, ఆ అస్తిత్వం ఇప్పటికీ రాజకీయ యుద్ధభూమిగా మారుతోంది. ఇటీవలి పవన్ కల్యాణ్?పొన్నం ప్రభాకర్ వాగ్వాదం ఈ వాస్తవాన్ని మరోసారి బయటపెట్టింది. తెలంగాణ ఏర్పాటు దినోత్సవం సమయంలో హైదరాబాద్‌లో 'నవనిర్మాణ సభ' నిర్వహించాలని పవన్ కల్యాణ్ ప్రకటించగా, మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. "తెలంగాణ మీ అయ్య జాగీరా?" అని పవన్ ప్రశ్నించిన దానికి "అవును, మా అయ్య జాగీరే" అన్న తీరుగా వచ్చిన సమాధానాలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఉద్యమం నుంచి జాగీరు మనస్తత్వం వరకుదశాబ్దాల పోరాటం, విద్యార్థుల త్యాగాలు, యువకుల ఆత్మాహుతులు, లక్షలాది మంది ప్రజల ఉద్యమ ఉత్సాహం.. ఇవన్నీ తెలంగాణను కేవలం ఒక భౌగోళిక ప్రాంతంగా కాకుండా ఆత్మగౌరవ చిహ్నంగా నిలిపాయి. 2014లో రాష్ట్రం ఏర్పడినప్పుడు "మా రాష్ట్రం, మా సంపద, మా నిర్ణయాలు" అన్న నినాదం ప్రజల హృదయాల్లో గాఢంగా నాటుకుం ది. కానీ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొంతమంది నాయకులు ఆ స్ఫూర్తిని తమ కుటుంబం, తమ పార్టీ లేదా తమ ప్రాంతీయ ఆధిపత్యానికి పరిమితం చేస్తున్నారు. "ఇది మా అయ్య జాగీరు" అన్న మాటలు ఆ ఫ్యూడల్ భావనను స్పష్టంగా బయటపెడుతున్నాయి. ఉద్యమ కాలంలో అణచివేతను ఎదిరించిన వారే ఇప్పుడు తమను తాము "యజమానులు"గా చూసుకోవడం బాధాకరం.తెలంగాణపై మూడు ముఖ్యమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల సొత్తా? పార్టీలదా..?, బయటివారిదా? అంటే ఇది ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదు, ఎవరి కుటుంబ వ్యాపారం కాదు.ఏదైనా ఒక రాజకీయ పార్టీ లేదా కుటుంబం యాజమాన్యంలో ఉందా?ఎవరి ఆధిపత్యంలోనూ ఉండకూడదు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా, రాష్ట్రం ప్రజల సార్వభౌమత్వానికి లోబడి ఉండాలి. **రాజకీయం చేయడం తప్పా?...**భారత రాజ్యాంగం ప్రకారం ఏ భారతీయ పౌరుడికైనా దేశంలో



ఎక్కడైనా రాజకీయ కార్యకలాపాలు చేసే స్వేచ్ఛ ఉంది. కానీ ఆ కార్యకలాపాలు స్థానిక భావాలను గౌరవించి, ఉద్యమ త్యాగాలను అవమానించకుండా జరగాలి. "వలసదారులు" అన్న మాటను రాజకీయ ఆయు ధంగా ఉపయోగించడం కూడా ప్రమాదకరం. పవన్ కల్యాణ్ గతంలో తెలంగాణ ఏర్పాటుపై చేసిన కొన్ని వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల భావాలను గాయపరిచాయన్న విమర్శలు ఉన్నాయి. అదే సమయంలో, స్థానిక నాయకులు "ఇది మా జాగీరు" అని చెప్పడం ఆ గాయాలను మరింత లోతు చేస్తోంది. రెండు వైపులా ఉన్న ఈ ధోరణి తెలుగు రాష్ట్రాల మధ్య సహజీవనానికి మంచిది కాదు.తెలంగాణ ఉద్యమం అణచివేతకు వ్యతిరేకంగా పుట్టింది. ఆ ఉద్యమ స్ఫూర్తి ఇప్పుడు కొందరి రాజకీయ ఆధిపత్యం మరియు వ్యక్తిగత స్వార్థాలకు బలి అవుతోంది. "జాగీరు" మనస్తత్వం రాజకీయాలను కుటుంబ ఆస్తిగా మార్చేస్తుంది. ఇది దీర్ఘకాలికంగా ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తుంది. నిజమైన అభివృద్ధి కావాలంటే తెలంగాణను ఎవరి యాజమాన్యంగా కాకుండా, అందరి హక్కుగా చూడాలి. నాయకులు యజమానులుగా కాకుండా సేవకులుగా పని చేయాలి. బయటి నాయకులైనా, స్థానికులైనా వారి పనితనం, వారి విధానాలు, వారి నిబద్ధత ఆధారంగానే ప్రజలు నిర్ణయం తీసుకోవాలి. తెలంగాణ ప్రజలు దశాబ్దాల త్యాగాలతో సాధించిన ఆత్మగౌరవం ఇప్పుడు రాజకీయ లాభాల కోసం బలిపశువు కాకూడదు. ఈ "జాగీరు" వివాదం ఒక సంకేతం మాత్రమే. ఇది రాజకీయ వ్యవస్థలో ఇంకా ఉన్న ఫ్యూడల్ మనస్తత్వానికి అద్దం పడుతోంది తెలంగాణ ముమ్మాటికీ ఇక్కడి ప్రజలదే. మిగతా అన్నీ కేవలం రాజకీయ భ్రమలు మాత్రమే.

## ప్రభుత్వ సెక్యూరిటీలపై క్యాపిటల్ గెయిన్స్ టాక్స్ రద్దు

### - విదేశీ పెట్టుబడుల కోసం యత్నాలు

న్యూఢిల్లీ : ఇరాన్ యుద్ధం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతినే అవకాశం ఉంది. ఈ ప్రతికూల ప్రభావాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఓ కీలక అడుగు వేసినట్లు తెలుస్తోంది. దేశంలోకి విదేశీ పెట్టుబడులను పెద్ద ఎత్తున ఆకర్షించడమే లక్ష్యంగా సంచలన నిర్ణయం తీసుకున్నట్లు అధికారిక వర్గాలు చెబుతున్నాయి. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం ఆర్డినెన్స్‌ను ఆమోదించినట్లు సమాచారం.ఈ ఆర్డినెన్స్ ద్వారా ఆదాయపు పన్ను చట్టాన్ని సవరించనున్నారు. ప్రభుత్వ సెక్యూరిటీల్లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు పెట్టే పెట్టుబడులపై క్యాపిటల్ గెయిన్స్ పన్నును పూర్తిగా రద్దు చేయనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రపతి ఆమోదం లభించిన వెంటనే ఈ కొత్త నిబంధన అమల్లోకి రానుంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం విదేశీ ఇన్వెస్టర్లు 12.5 శాతం దీర్ఘకాలిక మూలధన లాభాల (ఎల్‌టీసీజీ) పన్ను చెల్లిస్తున్నారు. 12 నెలల కంటే ఎక్కువ కాలం అట్టిపెట్టుకునే బాండ్లు, లిస్టెడ్ షేర్లపై ఈ పన్ను విధిస్తారు.దీనికి తోడు ప్రభుత్వ బాండ్ల ద్వారా వచ్చే వడ్డీ ఆదాయంపై 20 శాతం విత్‌హోల్డింగ్ పన్ను కడుతున్నారు. గతంలో దీనిపై ఉన్న 5 శాతం రాయితీ రేటును 2023 లోనే కేంద్రం తొలగించింది. అయినా ఈ ఏడాది విదేశీ ఇన్వెస్టర్లు భారతీయ స్టాక్ మార్కెట్ల నుంచి ఏకంగా రూ.2.5 లక్షల కోట్లు ఉపసంహరించుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల అమ్మకాలను అడ్డుకునేందుకు పన్ను కోతలు విధించాలనే డిమాండ్లు వచ్చాయిదేశ విదేశీ మారక నిల్వలను మరింత బలోపేతం చేయడానికి భవిష్యత్తులో మరికొన్ని చర్యలు చేపట్టే అవకాశం ఉంది. ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించడానికి మరిన్ని నిర్ణయాలు తీసుకోవచ్చని అధికారిక వర్గాలు అంటున్నాయి. మూలధన లాభాలపై పన్నులను తగ్గించడం గురించి ఇన్వెస్టర్ల అభిప్రాయాలను వినడానికి సిద్ధంగా ఉన్నామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ప్రకటించారు. ఆమె ప్రకటన చేసిన కొద్ది రోజుల్లోనే కేంద్ర మంత్రివర్గం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు రావడం గమనార్హం.

## విదేశీయుల వివరాలు 24 గంటల్లో ఇవ్వండి

హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో బస చేసే విదేశీయుల వివరాలను 24 గంటల్లోగా తమకు తెలియజేయాలని నగర పోలీసులు స్పష్టం చేశారు. ఈ మేరకు ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్, 2025 ప్రకారం యజమానులకు, విద్యాసంస్థలకు తాజా అడ్వైజరీ జారీ చేశారు. నిబంధనలు పాటించని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.గోల్కొండ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) జూన్ 3న ఈ సూచనలు జారీ చేశారు. హోటళ్లు, లాడ్జీలు, గెస్ట్ హౌస్‌లు, అద్దె ఇళ్ల యజమానులు, ఆసుపత్రులు, విశ్వవిద్యాలయాలు, కళాశాలలు సహా విదేశీయులకు ఆశ్రయం కల్పించే వారందరూ ఈ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.విదేశీ పాస్‌పోర్ట్ హోల్డర్లు, ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డు ఉన్నవారు, నేపాల్ జాతీయులతో సహా ఏ విదేశీయుడు తమ ప్రాంగణంలో బస చేసినా, నిర్దేశిత ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఫారం–ఎఎ (ఫారం–సి) సమర్పించాలి. విద్యాసంస్థలు విదేశీ విద్యార్థుల వివరాలను ఫారం–ఎఎలో నమోదు చేయాలి. వారు తిరిగి వెళ్లిన వివరాలను కూడా రిపోర్ట్ చేసి, ఆ రికార్డులను కనీసం ఏడాది పాటు భద్రపరచుకోవాలి.

2025 సెప్టెంబర్‌లో అమల్లోకి వచ్చిన కొత్త ఇమ్మిగ్రేషన్ చట్టం అమలులో భాగంగానే ఈ చర్యలు తీసుకుంటున్నట్టు పోలీసులు తెలిపారు. దేశంలో విదేశీయుల కదలికలపై పర్యవేక్షణను పటిష్టం చేయడమే దీని లక్ష్యం. తప్పుడు సమాచారం ఇచ్చినా లేదా వాస్తవాలను దాచిపెట్టినా చట్ట ప్రకారం శిక్షార్హులవుతారని స్పష్టం చేశారు. ఎలాంటి చట్టపరమైన చిక్కులు రాకుండా ఉండేందుకు అందరూ ఈ నిబంధనలను కచ్చితంగా పాటించాలని పోలీసులు కోరారు.

# ఖజానా ఖాళీ

**ప్రతి నెలా దాదాపు రూ.18 వేల నుంచి 20 వేల కోట్ల ఖర్చు**



హైదరాబాద్ : కాంగ్రెస్ సర్కార్.. తెలంగాణ బండిని నడపలేక దిక్కులు చూస్తోందా? ఏం చేయాలో తోచక ప్రభుత్వ పెద్దలు తలలు పట్టుకుంటున్నారా? తెలంగాణ సర్కార్‌కు ఆర్థిక కష్టాలు కొత్త తలనొప్పులు తెస్తున్నాయా? నిధుల లేమితో అభివృద్ధికి అడ్డంకులు ఏర్పడుతున్నాయా? అంటే అవుననే టాక్ వినిపిస్తోంది. ఏకంగా ఆర్థిక శాఖ మంత్రే ఎమ్మెల్యేలతో ఇటీవల చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఆర్థిక పరిపుష్టికి ఇంకా సమయం పడుతుందని..అప్పటిదాకా కొత్తగా నిధులు ఇవ్వలేమంటూ ఏకంగా ఆర్థిక మంత్రే చేతులెత్తేయడం ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. ఇలా అయితే ఇక ప్రజల్లోకి వెళ్లేది ఎలా అంటూ ఆందోళన చెందుతున్నారట అధికార పార్టీ ఎమ్మెల్యేలు.తెలంగాణ సర్కార్ ఆర్థిక పరిస్థితి రోజురోజుకు దిగజారుతోంది. అవును. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఇచ్చిన రిపోర్ట్ ఇదే స్పష్టం చేస్తోంది. లోటు బడ్జెట్‌తో ఇబ్బందికర పరిస్థితులు ఉన్నట్లు కాగ్ స్పష్టం చేసింది. హామీల అమలుకు ఆర్థిక స్థితి అడ్డంకిగా మారుతోంది. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇస్తే..వాటిని అమలు చేయడం ఇప్పుడు సర్కార్‌కు సవాల్‌గా మారింది. బడ్జెట్ అంచనాలకు..వాస్తవాలకు పొంతన లేని పరిస్థితి. ప్రతి నెల రాష్ట్ర ప్రభుత్వానికి 100 రూపాయలు ఆదాయం వస్తే దాదాపు 108 రూపాయలు ఖర్చు అవుతుంది. దీని కోసం ప్రతినెల అప్పులు చేయాల్సి వస్తోంది. దీంతో కేవలం రెండున్నర ఏళ్లలోనే 4.14 లక్షల కోట్ల అప్పులను తెచ్చింది సర్కార్. గతంలో ఉన్న అప్పులకు..అసలు, వడ్డీలు కట్టలేక నడ్డి విరుగుతుంటే.. మూలిగే నక్క మీద తాటి పండు పడ్డట్లుగా కొత్తగా అవుతున్న లక్షల కోట్ల అప్పులు రేవంత్ ప్రభుత్వానికి గుదిబండగా మారాయి.అటు సంక్షేమాన్ని.. ఇటు అభివృద్ధిని పరుగులు పెట్టించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరాటపడుతుంటే..రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మాత్రం అగమ్యగోచరంగా మారుతోంది. దీంతో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు?కొత్త కొత్త పనులు, ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేస్తూ సర్కార్ ముందుకెళ్తోంది. వాస్తవంగా ప్రతి నెల జీతాలు, పెన్షన్లు, అసలు, వడ్డీల చెల్లింపు, ఉద్యోగుల పెండింగ్ బకాయిలు, ఇతర చెల్లింపులు అన్ని దాదాపు 18 వేల నుంచి 20 వేల కోట్ల వరకు ఖర్చవుతుంది. కానీ వాస్తవ రాబడి మాత్రం కేవలం 16 నుంచి 18 వేల కోట్లలోపే ఉంటుంది. అంటే దాదాపు ప్రతి నెల సగటున రూ.2,250 కోట్ల లోటు సర్కార్ కు సవాల్ గా మారుతోంది. ప్రభుత్వం శక్తికి మించి కార్యక్రమాల అమలుకు, కొత్త అభివృద్ధి పనులను చేపట్టడం.. ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికి నిచ్చెన వేసిందన్నట్లుగా తయారైంది పరిస్థితి. ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో వివిధ జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై భట్టి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆరు నెలలకో, సంవత్సరానికో పరిస్థితి కుదుట పడుతుందని భట్టి తేల్చి చెప్పడంతో ఎమ్మెల్యేల గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లయింది. ప్రభుత్వం ఎప్పుడు ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతుందో? ఖజానా ఎప్పుడు కళకళలాడుతుందో? అప్పులు తీసుకునే అవసరం తగ్గుతుందో లేదో అనేది చూడాలి.

## రాష్ట్రస్థాయి ఉత్తమ పోలీసు సేవా అవార్డు గ్రహీతలకు సన్మానం

కరీంనగర్ : రాష్ట్రస్థాయి ఉత్తమ పోలీసు సేవ అవార్డు గ్రహీతలు హుజురాబాద్ టౌన్ సిఐ టీ. కరుణాకర్, కానిస్టేబుల్ హెచ్ సి.మల్లయ్య, ఇటీవల బదిలీ పై వచ్చిన ఏఎస్ఐ బి.సంపత్ లను టౌన్ పోలీస్ స్టేషన్ కార్యాలయంలోహుజురాబాద్ బీసీ జేఏసీ అధ్యక్షులు సందేల వెంకన్న ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించినారు. ఈ సందర్భంగా హుజురాబాద్ బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్ మాట్లాడుతూ, బీసీ ముద్దు బిడ్డ టీ.కరుణాకర్ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సేవ పోలీసు అవార్డును అందుకోవడం పట్ల హర్షాన్ని వ్యక్తం చేస్తూ హుజురాబాద్ కీర్తి పతాకాన్ని రాష్ట్రస్థాయిలో రెపరెపలాడించిన వారి సేవలను కొనియాడినారు. ముఖ్యంగా సమాజంలోని బడుగు బలహీన వర్గాల ప్రజలకు సముచితమైనటు వంటి న్యాయముజరుగునట్లు చూడవలసిన గురుతరమైన టువంటి బాధ్యత వారిపై ఉందని ఈ సందర్భంగా గుర్తుచేసినారు. అదేవిధంగా తమ విధిని చట్ట ప్రకారము నిర్వర్తించి అన్ని వర్గాల ప్రజల ఆధారాభిమానాన్ని చూరగొనే విధంగా ఇంకా రెట్టింపు సేవలను సమాజములోని అన్ని వర్గాల ప్రజలకుఅందించి జాతీయస్థాయిలో ఒక ఉత్తమ పోలీస్ ఆఫీసర్గా ఎదగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించినారు. ఈ సన్మాన కార్యక్రమంలో బీసీ జేఏసీ ప్రధాన కార్యదర్శిఇప్పకాయల సాగర్, శాలపల్లి ఇందిరానగర్ సర్పంచ్ కోడిగుడి ప్రవీణ్, హుజురాబాద్ మండలకాంగ్రెస్ అధ్యక్షురాలు పుల్లా రాధా, అంబేద్కర్ సంఘం జిల్లా నాయకులు రామ్ సారయ్య, తునికి సమ్మయ్య, ప్రతాప నాగరాజు, మంచి కట్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో త్వరలో 1,597 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్!

హైదరాబాద్ : తెలంగాణలోని నిరుద్యోగులకు భారీ శుభవార్త చెప్పేందుకు సీఎం రేవంత్ సర్కార్ సిద్ధమైంది. త్వరలో 1,597 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల సీఎం రేవంత్ వివిధ శాఖల్లో 1800 పోస్టుల భర్తీకి జూన్ నెలలో నోటిఫికేషన్లు ఇస్తామని ప్రకటించారు. ఇందులో భాగంగా సీఎం ఆదేశాల మేరకు పలు శాఖల్లో 290 పోస్టుల భర్తీకి టిజి పిఎస్ సి. నోటిఫికేషన్లు విడుదల చేసింది. మరో 1597 పోస్టుల భర్తీకి చర్యలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ఫైలును సీఎం రేవంత్ రెడ్డి ఆమోదించినట్లు సమాచారం.

## కార్మికులను ప్రభుత్వం మోసం చేసింది:

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులను, కార్మికులను మోసం చేస్తోందని, ఆరు డీఏలను పెండింగ్‌లో పెట్టడం దారుణమని ఆరోపించారు. పటాన్‌చెరువు సిగాచి పరిశ్రమలో మరణించిన కార్మికుల కుటుంబాలకు పరిహారం విషయంలోనూ ప్రభుత్వం అన్యాయం చేసిందని దయ్యబట్టారు. జీహెచ్ఎంసీ, ఆర్టీసీ, సింగరేణి కార్మికులను వంచించిందని, రెండేళ్లు గడుస్తున్నా పీఆర్సీ ప్రకటన లేకపోవడం ప్రభుత్వ వైఫల్యమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఫుట్బాల్ లీగ్ మ్యాచ్ ను ప్రారంభించిన డి.ఎస్.పి. శ్రీనివాస రావు

ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డలోని వై.పి.పీ.ఎం ప్రభుత్వ పాఠశాల క్రీడ మైదానంలో ఏపీ స్పోర్ట్ అథారిటీ ఆధ్వర్యంలో ఆర్ ఆర్ .అకాడమీ నిర్వహిస్తున్న ఫుట్బాల్ సమ్మర్ కోచింగ్ పోటీలను డిఎస్పి శ్రీనివాసరావు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పోర్ట్స్ ద్వారా మీకు ఇష్టమైన గేమ్ లో బాగా రాణించి మన ఆళ్లగడ్డకు నంద్యాల జిల్లాకి మంచి పేరు తేవాలని అలాగే జిల్లా క్రీడల పట్ల తమ పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించి,శారీరికంగా మానసికంగా భవిష్యత్తులో ఉద్యోగాలలో ఆర్మీ రిజర్వ్ పోలీస్ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలోన్యాయవాది వినోద్ కుమార్ మాట్లాడుతూ ఆళ్లగడ్డలో శ్రీ సోమల రమణారెడ్డి ఆర్ఆర్ అకాడమీ గత మూడు సంవత్సరాల నుండి క్రీడలలో ప్రతిభ ఉన్న క్రీడాకారుల కోసం వివిధ రకాల క్రీడలను లను నిర్వహించి ఆణిముత్యాలను బయటికి తీయడమే ఆర్ఆర్ అకాడమీ యొక్క ముఖ్య లక్ష్యం అని అన్నారు. కోచ్ సుబ్బరాయుడు, మాట్లాడుతూ 2025 - 26 సంవత్సరంలో ఆర్ఆర్ అకాడమీ

## జూన్ 15 డెడ్ లైన్...

హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూటు మార్చారు. ఇప్పటి వరకూ కేంద్ర ప్రభుత్వంలో అధికారంలో ఉన్న బీజేపీ పట్ల మెతక వైఖరిని రేవంత్ అవలంబిస్తున్నారన్న అభిప్రాయం ఉండేది. కానీ రానున్న ఏ ఎన్నికల్లోనైనా బీజేపీ తనకు ప్రధాన ప్రత్యర్థిగా భావించిన రేవంత్ రెడ్డి ఆ పార్టీ విషయంలో దూకుడుగా వెళ్లాలని నిర్ణయించినట్లు కనపడుతుంది. రాష్ట్ర నేతలనే తన టార్గెట్ చేసినా నేరుగా కేంద్ర ప్రభుత్వాన్ని తాకేలా రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఒకింత రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వానికి డెడ్ లైన్ విధించడం కూడా హాట్ టాపిక్ గా మారిందని రాజకీయ విశ్లేషకులు సయితం అభిప్రాయపడుతున్నారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ జిల్లాలో బీజేపీ నేతలకు హెచ్చరిక జారీ చేశారు. పోలవరం కోసం ఏడు తెలంగాణ మండలాలను ఆంధ్రప్రదేశ్ లో కలిపారని, తుమ్మిడిహెట్టి కోసం మహారాష్ట్ర భూములను రెండు వేల ఎకరాలు ఇవ్వలేరా అంటూ మహారాష్ట్రలో ఉన్న బీజేపీ సర్కార్ ను రేవంత్ రెడ్డి నిలదీశారు.

ఎన్ని లేఖలు రాసినా మహారాష్ట్ర సీఎం స్పందించడం లేదంటూ తప్పంతా బీజేపీదేనంటూ ఆ పార్టీపై విరుచుకుపడ్డారు. తమ ప్రభుత్వం రాష్ట్రం నుంచి డెబ్బయి ఐదు లక్షల క్వింటాళ్ల వడ్లు కొంటున్నామని, ఆ ధాన్యాన్ని కేంద్రం తీసుకోవాలని కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరొక డిమాండ్ కేంద్ర ప్రభుత్వానికి విధించారు.అంతే కాదు సత్రంలో పెట్టే భోజనానికి..నెల్లూరు పెద్దారెడ్డి రికమండేషన్ అవసరం లేదన్నారు. రాష్ట్రంకొనే పంటను కేంద్రం తీసుకునేలా..కిషన్‌రెడ్డి బాధ్యత తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పంటను కేంద్రం తీసుకోకపోతే జూన్ 15 తర్వాత బీజేపీ ఆఫీసు దగ్గరే తేల్చుకుంటామని రేవంత్ హెచ్చరించారు. అక్కడికే ధాన్యాన్ని తీసుకు వచ్చి పారబోస్తామని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. అంతే కాదు కిషన్‌రెడ్డి

## ఫ్యూచర్ సిటీ... ఎకరానికి 1.24 కోట్ల పరిహారం

హైదరాబాద్ : తెలంగాణలోని అర్బన్ రీజియన్లలో భూముల ధరలు విపరీతంగా పెరగడంతో ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల భూసేకరణ కోసం ప్రభుత్వం రికార్డు స్థాయి పరిహారం చెల్లిస్తోంది. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమీపంలోని కొంగర ఖుర్ద్, కొంగర కలాన్ గ్రామాల్లో ఫ్యూచర్ సిటీకి అనుసంధానంగా నిర్మించే గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే కోసం ఎకరాకు గరిష్టంగా రూ.1.24 కోట్ల భారీ పరిహారాన్ని ప్రభుత్వం చెల్లించింది. రూ.4,600 కోట్లతో ప్రతిపాదించిన 300 అడుగుల ఈ రహదారి కోసం రెండు దశల్లో మొత్తం 1,500 ఎకరాలను సేకరిస్తున్నారు.తెలంగాణ రాజధాని పరిసర ప్రాంతాలలో, ముఖ్యంగా కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో భూముల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇటీవల రాయదుర్గం ఏరియాలో ప్రభుత్వం నిర్వహించిన వేలంలో ఎకరాకు రికార్డు స్థాయిలో రూ.204 కోట్లు పలికింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వివిధ ప్రాజెక్టుల కోసం రైతుల నుంచి భూములను సేకరించడం పెద్ద సవాలుగా మారింది. దీంతో భూసేకరణ ప్రక్రియ సజావుగా.. ఎలాంటి వివాదాలు లేకుండా సాగడం కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రికార్డు స్థాయి పరిహారం చెల్లించాల్సి వస్తోంది. తాజాగా ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీకి అనుసంధానంగా ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన కొందరు రైతులకు ప్రభుత్వం రికార్డు స్థాయిలో పరిహారం అందించింది. ఎకరాకు ఏకంగా రూ.1.24 కోట్ల చొప్పున భారీ పరిహారాన్ని అందజేసింది.రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు ఆనుకుని, ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న కొంగర కలాన్, కొంగర ఖుర్ద్ గ్రామాల్లో ప్రస్తుతం బహిరంగ మార్కెట్ ధర ఎకరాకు రూ.8 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు పలుకుతోంది. ఈ ప్రాంతంలో ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం కోసం 15 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. మార్కెట్ రేట్లు భారీగా ఉండటంతో జిల్లా యంత్రాంగం రైతులతో పలుమార్లు చర్చలు జరిపింది. చివరకు కుదిరిన ఒప్పందం ప్రకారం ఎకరాకు రూ.1.24 కోట్ల రికార్డు స్థాయి పరిహారాన్ని చెల్లించి భూములను స్వాధీనం చేసుకున్నట్లు రంగారెడ్డి జిల్లా ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. ఎక్స్‌ప్రెస్‌వే వెళ్లే మార్గంలోని ఇతర లొకేషన్లను బట్టి రైతులకు ఎకరాకు రూ.30 లక్షల నుంచి రూ.98 లక్షల వరకు అందజేశారు. మారుమూల ప్రాంతాల్లో మాత్రం ఎకరాకు రూ.15 లక్షల చొప్పున చెల్లిస్తున్నారు.కాగా, రావిర్యాల్ ఓఆర్ఆర్ నుంచి మీర్‌ఖాన్‌పేట్ మీదుగా ఆమన్‌గల్ వరకు రెండు విడతల్లో దాదాపు రూ.4600 కోట్ల అంచనా వ్యయంతో 300 అడుగుల వెడల్పైన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టు కోసం మొత్తం 1500 ఎకరాల భూమి అవసరం కానుంది. ఫేజ్–1 కింద 447 ఎకరాల భూసేకరణ ఇప్పటికే పూర్తయింది. ఫేజ్–2 కింద మరో 558 ఎకరాల భూసేకరణ ప్రక్రియ ప్రస్తుతం వేగంగా సాగుతోంది. ఈ భారీ ఎక్స్‌ప్రెస్‌వే రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కందుకూర్, కడ్తాల్, ఆమన్‌గల్ మండలాల గుండా వెళ్తుంది.

Printed, Published and Owned by **B.PRAMOD KUMAR**, B-258, Phase-1, Vanasthalipuram, Hyderabad-70. Printed at **Garuda Printers**, H.No :2-86/1, Plot No. 23 -SP, Sy.No.417, Sagar High Way. Ragannaguda Village, Abdullapurmet (M), Rangareddy Dist, Telangana State- 501510 , **Published at :** H.No.Plot no.1, Bhagya laxmi Towers, opp: GHMC, L.B.Nagar Circle, venkateswara Colony, Saroornagar, Ranga Reddy Dist. Hyderabad-500035,Telangana State, **Editor :B. Pramod Kumar**, **RNI No: TELTEL/2021/81803**